



నిజాల నిగ్గు తేల్చే

# చర్చ

తెలుగు దిన పత్రిక

**విలేకరులు కావలెను**

ప్రజా సమస్యలపై స్పందించే తత్వం మీకుందా..? సమాజంలో జరుగుతున్న అన్యాయాలకు, అక్రమాలకు అక్షర రూపమిచ్చి బాధితులకు అండగా నిలబడే ధైర్యం మీకుందా..? మీకోసమే చర్చ ఎదురుచూస్తోంది. కలం బలంతో ముందుకు సాగుదాం. తెలంగాణ వ్యాప్తంగా చర్చ దినపత్రికలో రాష్ట్రం, జిల్లాలు, నియోజకవర్గ, మండలాల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఉత్సాహవంతులైన యువతి, యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.

సంప్రదించవలసిన ఫోన్ నంబర్ 99666 41155

తెలంగాణ , సంపుటి : 25 సంచిక : 41 గురువారం, నవంబర్ 06, 2025 , పేజీలు - 12 వెల : 2/-

# మైనార్టీలకు కాంగ్రెస్ అండగా ఉంటుంది

## రేంవత్‌తో భేటీ అయిన క్రైస్తవ సంఘాల నేతలు

**బిజెపిలో త్వరలోనే బిఆర్ఎస్ విలీనం**

**ఈ రెండు పార్టీలు ఒక్కటే అని రుజువయ్యింది**

**గత పార్లమెంట్ ఎన్నికల్లో వీరి బంధం బట్టబయలు**



**హైదరాబాద్,నవంబర్5 :** బీఆర్ఎస్ పార్టీని బీజేపీకి మాజీ సీఎం కేసీఆర్ తాకట్టు పెట్టారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి షాకింగ్ కామెంట్స్ చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులకు ఎనిమిది చోట్ల డిపాజిట్ కూడా రాకపోవడానికి కుమ్మక్కు రాజకీయాలే కారణమని విమర్శించారు. బిజెపిలో బిఆర్ఎస్ విలీనం ఎంతోదూరం లేదన్నారు. మిగతాది 2లో...

# భారత జట్టు అద్భుతమైన పునరాగమనం చేసింది.

**ప్రధాని నరేంద్ర మోదీని కలిసిన ప్రపంచ కప్ గెలిచిన మహిళా క్రికెట్ జట్టు**

**జట్టు సభ్యులకు తన నివాసంలో ఆతిథ్యం ఇచ్చిన ప్రధానమంత్రి**

**'నమో' అని సంతకం చేసిన జెర్సీ ప్రధానికి బహూకరణ**




**న్యూఢిల్లీ,నవంబర్5:** వన్డే ప్రపంచ కప్ గెలిచిన భారత మహిళా క్రికెట్ జట్టు సభ్యులకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బుధవారం సాయంత్రం తన నివాసంలో ఆతిథ్యమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన జట్టు సభ్యులను అభినందించారు. వరుసగా మూడు ఓటముల తర్వాత భారత జట్టు అద్భుతమైన పునరాగమనం చేసిందని ఆయన కొనియాడారు.మహిళా జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌తో పాటు జట్టు సభ్యులు సాయంత్రం ప్రధాని నివాసానికి చేరుకున్నారు. ప్రపంచ కప్ విశేషాలను ప్రధానితో పంచుకున్నారు. ఈ సందర్భంగా 'నమో' అని సంతకం చేసిన టీమిండియా జెర్సీని ప్రధానికి మహిళా జట్టు బహూకరించింది. 2017 ప్రపంచ కప్ ఫైనల్‌లో భారత్ చివరి వరకు పోరాడి ఓడింది. నాడు రన్నరప్‌తో సరిపెట్టుకుంది. అప్పుడు మిథాలీ రాజ్ నేతృత్వంలోని భారత జట్టు ప్రధానిని కలిసింది. ఈ విషయాన్ని మోదీ గుర్తు చేసుకున్నారు. అనంతరం మోదీకి ప్రపంచ కప్‌ను అందించారు.



## తెలంగాణ సరిహద్దు సమీపంలో కాల్పుల మోత... ముగ్గురు మావోయిస్టుల మృతి

**ఛత్తీస్‌గఢ్ బీజాపూర్ అడవుల్లో భారీ ఎన్‌కౌంటర్**

**కూంబింగ్ ఆపరేషన్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతి**

**మృతదేహాలు, ఆయుధాలు స్వాధీనం చేసుకున్న బలగాలు**

**జనవరి నుంచి ఇప్పటివరకు 477 మంది మావోయిస్టుల హతం**

**ఆపరేషన్ ఇంకా కొనసాగుతోందని వెల్లడి**

**ఛత్తీస్‌గఢ్:** ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల ఏరివేత ఆపరేషన్ ముమ్మరంగా సాగుతోంది. బీజాపూర్ జిల్లాలోని దట్టమైన అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య బుధవారం జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మరణించినట్లు సమాచారం. తెలంగాణ సరిహద్దుకు సమీపంలోని తార్లగూడ ప్రాంతంలో ఈ ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. మిగతాది 2లో...

## బండి సంయ్ మరో సంచలన నిర్ణయం

**ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ సూల్ పిల్లలకు అండ**

**టెన్త్ విద్యార్థుల పరీక్ష ఫీజు చెల్లించాలని నిర్ణయం**

**ఆయా జిల్లా కలెక్టర్లకు లేఖ ద్వారా వెల్లడి**

**కరీంనగర్,నవంబర్5:** కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుకునే విద్యార్థులందరికీ కేంద్రమంత్రి బండి సంజయ్ శుభవార్త అందించారు. ఈ ఏడాది టెన్త్ ఎగ్జామ్ ఫీజును పూర్తిగా చెల్లించేందుకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ముందుకొచ్చారు. ఈ మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లకు కేంద్ర మంత్రి లేఖ రాశారు. అధికార వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో 12,292 మంది విద్యార్థినీ, విద్యార్థులు పదో తరగతి చదువుకుంటున్నారు. వీరిలో కరీంనగర్ జిల్లాలో 4,847, సిరిసిల్ల జిల్లాలో 4059, సిద్దిపేట జిల్లాలో 1118, జగిత్యాల జిల్లాలో 1135, మిగతాది 2లో...



## అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇస్తే కిషన్ రెడ్డికి వచ్చిన ఇబ్బందేమిటి?

**హైదరాబాద్‌లో మూసీ రివర్ ఫ్రంట్ ఎందుకు ఉండకూడదో చెప్పాలి**

**నేను మొదట సెక్యులర్ భావాలు కలిగిన వ్యక్తినన్న రేవంత్ రెడ్డి**

**మోదీ, కేసీఆర్ ఇద్దరూ ఒకటేనని విమర్శ**



**షేక్‌పేట :** అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇస్తే కిషన్ రెడ్డికి వచ్చిన ఇబ్బందేమిటని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా షేక్‌పేటలో మిగతాది 2లో...

## బీహార్‌లో నేడు తొలిదశ పోలింగ్

**భారీగా ఏర్పాట్లు చేసిన ఎన్నికల సంఘం**

**18 జిల్లాల్లోని 121 నియోజకవర్గాల్లో తొలిదశ ఓటింగ్**

**ఉదయం 7నుంచి సాయంత్రి 6 వరకు పోలింగ్**




**పాట్నా,నవంబర్5:** బిహార్ అసెంబ్లీ ఎన్నికల సమరం కీలక ఘట్టానికి చేరుకుంది. నేటి తొలివడత పోలింగ్‌కు ఇసి పక్కాగా ఏర్పాట్లు చేసింది. ఎన్నికల సిబ్బంది తమ సరంజామాతో కేటాయించిన పోలింగ్ కేంద్రాకు ప్రత్యేక వాహనాల్లో చేరుకున్నారు. రెండు విడతల పోలింగ్‌లో మిగతాది 2లో...

## ఎస్ఐఆర్‌ను రాహుల్ గాంధీ సమర్థిస్తున్నారా, వ్యతిరేకిస్తున్నారా?

**రాహుల్ గాంధీ ఓటు చోరీ విమర్శలు.. కౌంటర్ ఇచ్చిన ఎన్నికల సంఘం**

**హర్యానాలో ఓటు చోరీ జరిగిందని రాహుల్ గాంధీ ఆరోపణలు**

**హర్యానా ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నుంచి అభ్యంతరాలు రాలేదని వెల్లడి**

2లో.




# దమ్ముంటే అభివృద్ధిపై చర్చిద్దాం..

**ఎవరి హయాంలో ఏం చేశామో వివరిద్దాం**

**సిఎం రేవంత్‌కు కెటిఆర్ సవాల్**



**హైదరాబాద్,నవంబరు5 :** హైదరాబాద్ అభివృద్ధి పై తనతో చర్చకు రావాలని సిఎం రేవంత్ రెడ్డికి కెటిఆర్ సవాల్ విసిరారు. హైదరాబాద్ అభివృద్ధి ఎవరి హయాంలో ఏం జరిగిందో వివరిస్తానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు కౌంటర్ ఇచ్చారు. అసెంబ్లీ, సచివాలయం, గాంధీ భవన్ ఎక్కడైనా సరే.. రేవంత్‌తో చర్చకు రెడీ అని ఛాలెంజ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిరాశ, నిస్పృహతో ఉన్నారని విమర్శించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ ఓటమి ఖాయమని రేవంత్‌కు అర్థమైందని సెటైర్లు గుప్పించారు. అందుకే తనపై రేవంత్‌రెడ్డి వ్యక్తిగత దూషణలకు దిగారని ధ్వజమెత్తారు. మిగతాది 2లో...

## కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మడం లేదు

**ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న కిషన్ రెడ్డి**



**హైదరాబాద్,నవంబర్5:** జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి కాంగ్రెస్ ఏం చేస్తుందో చెప్పకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. రెండేళ్లలో ఏం చెప్పారో..ఏం జరిగిందో ప్రజలకు తెలిసిపోయిందని, కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్తితి మిగతాది 2లో...

# మైనార్టీలకు కాంగ్రెస్ అండగా ఉంటుంది

(మొదటి పేజీ తరువాయి)
ఈ మేరకు ఈ రెండు పార్టీలు ఒక్కటే అంటూ బీఆర్ఎస్ బీజేపీ లపై రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రధామంత్రి నరేంద్రమోదీకి మద్దతు ఇస్తున్న కేసీఆర్ తెలంగాణకి అత్యంత ప్రమాదకరమని ఆక్షేపించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కారు గుర్తుకు ఓటేస్తే కమలం గుర్తుకు వేసినట్లేనని ఆరోపించారు. జూబ్లీహిల్స్ క్రైస్త్రవ సంఘాల ప్రతినిధులు, పాస్టర్స్ సీఎం రేవంత్‌రెడ్డిని బుధవారం కలిశారు. ఈ క్రమంలో సీఎంతో క్రైస్త్రవ సంఘాల ప్రతినిధులు సమావేశం అయ్యారు. ఈ నేపథ్యంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు క్రైస్త్రవ సంఘాల ప్రతినిధులు, పాస్టర్స్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం కోసం పనిచేస్తామని వారు హామీ ఇచ్చారు. అలాగే, తమ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. వారి సమస్యలపై సానుకూలంగా సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. వారి సమస్యలని వెంటనే పరిష్కారిస్తానని మాటిచ్చారు. భారత్ జోడో పాదయాత్ర ద్వారా ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ దేశంలోని మైనార్టీలకు ఒక భరోసా ఇచ్చారని గుర్తుచేశారు. జూబ్లీహిల్స్‌లో మైనార్టీలను మభ్యపెట్టడానికి కుట్ర జరుగుతోందని ఆరోపించారు. జూబ్లీహిల్స్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేసీఆర్ ఒక వైపు ఉన్నారని.. రాహుల్ గాంధీ, తాను మరోవైపు నిలబడ్డామని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి కేసును సీబీఐకి అప్పగించి మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు కేంద్రప్రభుత్వం ఎందుకు స్పందించలేదని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నల వర్షం కురిపించారు. కార్ రేస్ కేసులో మాజీ మంత్రి కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు తెలంగాణ గవర్నర్ ఇప్పటి వరకు ఎందుకు అనుమతి ఇవ్వలేదని నిలదీశారు. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య రాజకీయ ఒప్పందం లేకపోతే ఎందుకు అనుమతి ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఈ కేసుల విషయంలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులను ఎందుకు విచారణకు పిలవడం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అయ్యే పరిస్థితి ఉందని ఆరోపించారు. గతంలో కవితనే ఈ విషయాన్ని స్పష్టం చేసిందని పేర్కొన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ కలిసేందుకు జూబ్లీహిల్స్‌ను ప్రయోగశాలగా చూస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ మంత్రివర్గంలో ఒక్క దళితుడే మంత్రిగా ఉన్నారని గుర్తుచేశారు. తమ మంత్రివర్గంలో నలుగురు దళితులకు అవకాశం కల్పించామని ఉద్ఘాటించారు. అసెంబ్లీ స్పీకర్‌గా గడ్డం ప్రసాద్ కుమార్‌కి అవకాశం ఇచ్చామని అన్నారు.

అత్యంత నిరుపేదలకు సంక్షేమ కార్యక్రమాలు అందించాలన్నదే తమ ప్రభుత్వ విధానమని స్పష్టం చేశారు. దేశం కోసం సర్వం త్యాగం చేసిన సోనియా గాంధీ, రాహుల్ గాంధీలని ఈడీ ఆఫీసుకు పిలిచి విచారణ చేశారని సీఎం రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. క్రైస్త్రవ సంఘాల ప్రతినిధులతో జరిగిన భేటీకి మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యేలు లక్ష్మీకాంతరావు, శ్రీ గణెళిష్, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్,

తెలంగాణ క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్, ఏఐసీసీ మైనార్టీ విభాగం ఉపాధ్యక్షుడు అనిల్ థామస్, తదితరులు పాల్గొన్నారు.

# దమ్ముంటే అభివృద్ధిపై చర్చిద్దాం..

(మొదటి పేజీ తరువాయి)
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓటమి తప్పదని భావించి.. రేవంత్‌రెడ్డి తనపై విమర్శలు చేస్తున్నారని ÷ర్ అయ్యారు. ఆయన కంటే గట్టిగా తాను మాట్లాడగలనని... రేవంత్‌రెడ్డికి సమాధానం చెప్పే సత్తా తనకు ఉందని స్పష్టం చేశారు. కానీ తమ అధినేత కేసీఆర్ సూచనల తోనే రేవంత్‌రెడ్డిపై వ్యక్తిగత దూషణలకు తాను దిగటం లేదని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు చెప్పాలని కేసీఆర్ తనకు చెప్పారని పేర్కొన్నారు. తనను వ్యక్తిగతంగా విమర్శించిన.. ముఖ్యమంత్రి హోదాలో ఉన్నారు కాబట్టి రేవంత్‌రెడ్డిని తాను గౌరవిస్తున్నానని కేటీఆర్ పేర్కొన్నారు. హైదరాబాద్, జూబ్లీహిల్స్ అభివృద్ధిపై రేవంత్‌రెడ్డి చర్చకు రావాలని సవాల్ విసిరారు. హోంశాఖను పర్యవేక్షిస్తున్న రేవంత్‌రెడ్డి హయాంలో శాంతి భద్రతలు క్షీణించాయని ఫైర్ అయ్యారు. హైదరాబాద్‌లో గన్, డ్రగ్ కల్చర్ పెరిగిందని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో హైదరాబాద్.. చెత్త సిటీ, క్రైం సిటీగా మారిందని విమర్శించారు. అండర్ పాస్‌లు, ఫ్లైఓవర్లు కేసీఆర్ హయాంలోనే నిర్మించామని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఎన్ని ఫ్లై ఓవర్లు కట్టారో చెప్పాలని సవాల్ విసిరారు. కేసీఆర్ హయాంలోని పదేళ్లలో వంద లింకు రోడ్లు నిర్మించామని ఉద్ఘాటించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రోడ్లపై ఉన్న ఒక గుంత కూడా ఎందుకు పూడ్చలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. సీఎం అంటే కటింగ్ మాస్టర్ మాదిరిగా రేవంత్ వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. హైదరాబాద్ సిటీలో మళ్లీ తాగునీటి కష్టాలు తెచ్చింది కాంగ్రెస్ సర్కార్‌నేనని విమర్శించారు. చెత్త సమస్య పరిష్కారానికి స్వచ్ఛ హైదరాబాద్ కార్యక్రమానికి తాము శ్రీకారం చుట్టామని నొక్కిచెప్పారు. మెట్రో నిర్మించిన ఎల్అండ్ టీని సీఎం రేవంత్‌రెడ్డి బెదిరించారని మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో ఫ్లైల ఓవర్లు, అండర్‌పాసులు నిర్మించామన్నారు. రేవంత్ ప్రభుత్వం కనీసం రోడ్లపై పడిన గుంతలనైనా పూడ్చిందా? అంటూ ప్రశ్నించారు. హైదరాబాద్ ప్రజల దాహార్తిని తీర్చేదెవరో ప్రజలందరికీ తెలుసునని, కాంగ్రెస్ హయాంలో మంచినీటి కష్టాలు మొదలయ్యాయన్నారు. కేసీఆర్ ప్రభుత్వం పదేళ్లలో హైదరాబాద్‌ను క్లీన్ సిటీగా మార్చిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్‌ను మురికికూపంగా మార్చిందని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో పవర్ హాలీడేలు విధించేవారని, కేసీఆర్

పాలనలో24గంటలు నాణ్యమైన కరెంట్ అందించామన్నారు. కేసీఆర్ హయాంలో విద్యుత్ వెలుగులు నిండాయని, గ్రీన్ సిటీ ఆఫ్ ది వరల్డ్‌గా హైదరాబాద్‌ను తీర్చిదిద్దామన్నారు. 16వేల నర్సరీలను రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేశామన్నారు. హెచ్‌సీయూలో జీవవైవిధ్యాన్ని నాశనం చేసిన ఘనత రేవంత్‌రెడ్డిదని అన్నారు. రేవంత్ బెదిరింపులకు ఎన్నో పరిశ్రమలు తరలిపోతున్నాయని, రాష్ట్రంలో శాంతిభద్రతలు అధ్వాన్నంగా మారాయని విమర్శించారు. మహారాష్ట్ర పోలీసులు వచ్చి ఇక్కడ డ్రగ్స్ దందాను పట్టుకున్నారని, రూ.12వేల డ్రగ్స్ దొరికితే పట్టింపులేదా?.. తెలంగాణ ముఖ్యమంత్రి, పోలీసులు ఏం చేస్తున్నారని నిలదీశారు. జూబ్లీహిల్స్ అభివృద్ధి రిపోర్ట్‌ను ఇంటింటికీ పంపిస్తామన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధికి రూ.5,328 కోట్లు ఖర్చు చేశామని.. మెట్రోపై రూ.1,722 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. స్ఆర్‌డీపీ కింద రూ.333కోట్లతో షేక్‌పేట ఫ్లై ఓవర్‌ను నిర్మించామని గుర్తు చేశారు. కేసీఆర్ హయాంలో ప్రజారోగ్యానికి పెద్దపీట వేశామన్నారు. ఎర్రగడ్డలో రూ.900 కోట్లతో టిమ్స్ ఆసుపత్రిని నిర్మించామన్నారు. వెయ్యి పడకలతో టిమ్స్ ఆసుపత్రిని నిర్మించింది వాస్తవం కాదా? అంటూ ప్రశ్నించారు. జీహెచ్ఎంసీ పరిధిలో లక్ష డబుల్ బెడ్‌రూంలు కట్టామని, రెహ్మత్‌నగర్‌లో కట్టిన 3600 డబుల్ బెడ్‌రూంలను పంపిణీ చేశామన్నారు. ప్రైవేట్ వాళ్లు కడితే ఒక్కో డబుల్ బెడ్‌రూంకు రూ.కోటి ఛార్జ్ చేసేవారన్నారు. ఆసరా పెన్షన్, కల్యాణలక్ష్మి కింద దాదాపు రూ.600 కోట్లు అందించామన్నారు. 106 మందికి దళితబంధు అందించామన్నారు. పండుగల కోసం 14కోట్లు అందించామని, అన్నపూర్ణ భోజనాల కోసం రూ.2కోట్లు చెల్లించినట్లు వివరించారు. మైనారిటీల కోసం 204 గురుకులాలను ఏర్పాటు చేశామని, రూ.51కోట్లతో గురుకులాలన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బోరబండలో సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.87కోట్లు ఖర్చు చేశామని, రూ.17కోట్లతో ఫంక్షన్ హాలు నిర్మించినట్లు తెలిపారు. రూ.455 కోట్లతో పది సబ్‌స్టేషన్లను కట్టామని, జూబ్లీహిల్స్‌లో విద్యుత్ నిర్వహణ కోసం రూ.505కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. ఇంటింటికీ తాగునీరు ఇచ్చేందుకు రూ.30కోట్లు ఖర్చు చేశామన్న కేటీఆర్.. రూ.180కోట్లు మంచినీటి కోసం ఖర్చు చేసినట్లు చెప్పుకొచ్చారు. పార్కుల నిర్వహణకు రూ.20కోట్లు, డీఆర్ఎఫ్ పెట్టి ప్రజలకు సహాయక చర్యలు అందించామన్నారు. బీఆర్ఎస్ హయాంలో రూ.5328 కోట్లు ఖర్చు చేస్తే.. రెండేళ్ల రేవంత్ పాలనలో ఎంత ఖర్చు చేశారో చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రెండేళ్లలో చేసిన అభివృద్ధిని చూపించి రేవంత్ ఓట్లు అడగాలని, గోపీనాథ్ వేసిన శిలాఫలకం జూబ్లీహిల్స్‌లో ఎక్కడికి పోయినా కనిపిస్తుందన్నారు. బీఆర్ఎస్ పాలనలో స్వచ్ఛ్ సర్వేక్షణ్‌లో 34 అవార్డులు వచ్చాయని.. రేవంత్ పాలనలో ఎన్ని వచ్చాయని ప్రశ్నించారు. ప్రజలే న్యాయనిర్ణేతలని.. జూబ్లీహిల్స్‌లో సరైన జవాబిస్తారన్నారు.

# కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మడం లేదు

(మొదటి పేజీ తరువాయి)
లేదన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారంలో భాగంగా యూసఫ్‌గూడ డివిజన్ వెంకటగిరిలో ఆయన పాదయాత్ర నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ భాజపా అభ్యర్థి లంకల దీపక్ రెడ్డిని గెలిపించాలని కోరారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమకు, భారత రాష్ట్ర సమితికి మధ్య ఎలాంటి అవగాహనా ఒప్పందం జరగలేదని తేల్చిచెప్పారు. కేసీఆర్ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో కేంద్ర మంత్రిగా పనిచేశారని.. కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి మధ్యనే అవగాహన కుదిరిందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంతో పాటు జూబ్లీహిల్స్‌లోనూ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని చెప్పారు.

# తెలంగాణ సరిహద్దు సమీపంలో కాల్పుల మోత...

(మొదటి పేజీ తరువాయి)
వివరాల్లోకి వెళితే... అన్నారం, మరిమల్ల గ్రామాల మధ్య అటవీ ప్రాంతంలో మావోయిస్టుల కదలికలపై నిఘా వర్గాల నుంచి పక్కా సమాచారం అందింది. దీంతో డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డీఆర్‌జీ), స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్‌టీఎఫ్) బృందాలు సంయుక్తంగా కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో భద్రతా బలగాలకు మావోయిస్టులు తారసపడటంతో ఇరువర్గాల మధ్య కాల్పులు మొదలయ్యాయి.ఈ ఆపరేషన్‌లో ముగ్గురు మావోయిస్టుల మృతదేహాలను, కొన్ని ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. అయితే, దీనిపై అధికారికంగా పూర్తి ప్రకటన వెలువడాల్సి ఉంది. బుధవారం సాయంత్రం నాటికి కూడా ఆపరేషన్ కొనసాగుతూనే ఉందని అధికారులు వెల్లడించారు. "బీజాపూర్ ప్రాంతంలో ఆపరేషన్ కొనసాగుతోంది, పరిస్థితి సాధారణంగానే ఉంది. ఆపరేషన్‌కు సంబంధించిన కీలక వివరాలను తగిన సమయంలో అందిస్తాం" అని మధ్యాహ్నం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఈ ఘటనపై స్పందిస్తూ, హతమైన మావోయిస్టులు అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో పనిచేస్తున్న స్థానిక కమిటీలకు చెందినవారై ఉండవచ్చని అధికారులు ప్రాథమికంగా భావిస్తున్నారు.

2026 మార్చి నాటికి దేశం నుంచి మావోయిజాన్ని పూర్తిగా నిర్మూలిస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇటీవలే ప్రకటించిన నేపథ్యంలో భద్రతా బలగాలు ఆపరేషన్లను తీవ్రతరం చేశాయి. ఛత్తీస్‌గఢ్‌లో 2024 జనవరిలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు 2,100 మంది మావోయిస్టులు లొంగిపోగా, 1,785 మందిని అరెస్ట్ చేశారు. వివిధ ఆపరేషన్లలో 477 మంది మావోయిస్టులు హతమయ్యారు. ఒకవైపు సైనిక చర్యలు కొనసాగిస్తూనే, మరోవైపు 'ఆత్మసమర్పణ్ ఏవం పునర్వాస్ నీతి 2025', 'నియాద్ నెల్ల నార్ యోజన' వంటి పథకాల ద్వారా లొంగిపోయిన వారికి పునరావాసం కల్పిస్తూ ప్రభుత్వం ద్వంద్వ వ్యూహాన్ని అమలు చేస్తోంది.

# అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇస్తే కిషన్ రెడ్డికి వచ్చిన ఇబ్బందేమిటి?

(మొదటి పేజీ తరువాయి)
నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ, జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పేరుతో బీజేపీ ఓట్లు అడుగుతోందని విమర్శించారు. నియోజకవర్గంలో రూ. 400 కోట్లతో అభివృద్ధి పనులను చేస్తున్నామని అన్నారు.హైదరాబాద్ నగరంలో మూసీ రివర్ ఫ్రంట్ ఎందుకు కట్టకూడదో కిషన్ రెడ్డి చెప్పాలని నిలదీశారు. కిషన్ రెడ్డికి సవాల్ విసిరితే ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. తాను మొదట సెక్యులర్ భావాలు కలిగిన వ్యక్తినని అన్నారు. కొడంగల్‌లో తాను మూడుసార్లు గెలవడంలో మైనారిటీల సహకారం ఉందని వెల్లడించారు.

ఇరవై నెలల కాంగ్రెస్ పాలనలో మైనారిటీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూశామని అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇద్దరూ ఒకటే అన్నారు. ముస్లింలను బీఆర్ఎస్ మోసం చేస్తోందని అన్నారు. సవాల్ విసిరి పారిపోవడం కేటీఆర్‌కు అలవాటేనని అన్నారు.

# ఎస్ఐఆర్‌ను రాహుల్ గాంధీ సమర్థిస్తున్నారా, వ్యతిరేకిస్తున్నారా?

(మొదటి పేజీ తరువాయి)
ఓట్ల చోరీ అంశంపై 'హైడ్రోజన్ బాంబు' పేరిట కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించగా, కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిస్పందించింది. హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ల చోరీ జరిగిందని రాహుల్ గాంధీ ఆరోపించారు. 25 లక్షల ఓట్ల చోరీ జరిగిందని, బ్రెజిల్ మోడల్‌కు కూడా ఇక్కడ ఓటు ఉందని ఆరోపించారు. ఈ ఆరోపణలపై ఈసీ స్పందించింది.

రాహుల్ గాంధీ ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను సమర్థిస్తున్నారా? వ్యతిరేకిస్తున్నారా? చెప్పాలని ఈసీ ప్రశ్నించింది. గత ఏడాది హర్యానాలో ఎన్నికలు జరిగాయని, వాటికి ముందు కాంగ్రెస్ పార్టీ నుంచి ఎలాంటి అభ్యంతరాలు రాలేదని తెలిపింది. పోలింగ్ స్టేషన్‌లలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఏజెంట్లు ఏం చేస్తున్నారని ప్రశ్నించింది.

# భూపాలపల్లి జిల్లాలో భారీ సుడిగాలులు

## గాలుల బీభత్సానికి నేలకొరిగిన పంటలు



**జయశంకర్ భూపాలపల్లి,నవంబర్5:** జిల్లాలో భారీ సుడిగాలులు బీభత్సం సృష్టించాయి. పలిమెల మండలంలోని లెంకలగడ్డలో గోదావరి పరివాహక అటవీ ప్రాంతంలో సుడిగాలుల ఏర్పడడంతో భారీగా చెట్లు ,మిర్చి, పత్తి పంటలు నెలకొరిగాయి. గత సంవత్సరం సెప్టెంబర్ నుండి ఇప్పటి వరకు మూడు సార్లు ప్రకృతి విలయతాండవం చేయడం సంచలన ంగా మారింది. అయితే గత సంవత్సరం సెప్టెంబర్, డిసెంబర్ నెలల్లో ములుగు జిల్లా మేడారం అటవీ ప్రాంతంలో బీభత్సం చోటు చేసుకోగా తాజాగా లెంకలగడ్డ అటవీ ప్రాంతంలో ప్రళయం సంభవించడం గమనార్హం. మంగళవారం సాయంత్రం 4 గంటల నుండి 5 గంటల మధ్య ఏర్పడిన వాటర్ స్పౌట్ ఉత్తర దిశ నుండి దక్షిణం వైపు ప్రయాణం చేసింది.దాదాపు 60 మీటర్ల వెడల్పుతో 3 కిలో మీటర్ల పొడవున సుడిగాలులు బీభత్సం సృష్టించాయి. అయితే లెంకలగడ్డ అటవీ ప్రాంతంలో వచ్చిన వాతావరణ మార్పుల ప్రభావం వల్ల కొంతమంది రైతులు ప్రాణాపాయం నుండి తప్పించుకున్నారు. వ్యవసాయ అవసరాల కోసం మోటార్లను తరలిస్తున్న ఎద్దుల బండి కూడా సుడిగాలుల ఉధృతికి కొట్టుకపోయింది. దీంతో ఎడ్ల బండిలో తీసుకెల్తున్న వ్యవసాయ పనిముట్లన్ని తునాతునకలు అయ్యాయి.. వ్యవసాయ పనుల్లో నిమగ్నం అయిన కొంతమంది రైతులు వాటర్ స్పౌట్ కారణంగా పలుమార్లు గాల్లోకి లేవగా గురత్వాకర్షణ శక్తి వల్ల తిరిగి నేలపై పడిపోయారు.ఇక్కడే ఉన్నట్టయితే

# బీహార్‌లో నేడు తొలిదశ పోలింగ్

(మొదటి పేజీ తరువాయి)
భాగంగా తొలి విడత పోలింగ్ 18 జిల్లాల్లోని 121 నియోజకవర్గాల్లో గురువారం జరుగనుంది. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమై సాయంత్రం 6 గంటలతో ముగుస్తుంది. కొన్ని నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో మాత్రం ముందస్తు జాగ్రత్తగా సాయంత్రం 5 గంటలకే పోలింగ్ ముగుస్తుంది. తొలి విడత పోలింగ్ జరుగనున్న నియోజకవర్గాల్లో అందరి దృష్టి ప్రధానంగా వైశాలి జిల్లాలోని రఘోపూర్ అసెంబ్లీ నియోజకవర్గంపై ఉంది. ఇక్కడి నుంచి ఆర్జేడీ నుంచి 'మహాగర్‌బంధన్' ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వి యాదవ్ పోటీ చేస్తున్నారు. రెండు సార్లు వరుసగా రఘోపూర్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన ఆయన హ్యాట్రిక్ విజయం కోసం బరిలో ఉన్నారు. గతంలో ఆ నియోజకర్గానికి తేజస్వి తండ్రి లూలూప్రసాద్ యాదవ్ రెండుసార్లు, తల్లి రబ్రీదేవి మూడుసార్లు ప్రాతినిధ్యం వహించారు. ఇద్దరూ రఘోపూర్ నుంచి గెలిచే ముఖ్యమంత్రులు అయ్యారు. మహూవా నియోజకవర్గం కూడా అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. లాలూ పెద్ద కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్ కొత్తగా ఏర్పాటు చేసిన 'జన్‌శక్తి జనతా దళ్' నుంచి పోటీ చేస్తున్నారు. ఈ ఏడాది మొదట్లో ఆర్జేడీ నుంచి తేజ్ ప్రతాప్ బహిష్కరణకు గురయ్యారు. ఇటీవల జన్‌సురాజ్ కార్యకర్త దులార్ చంద్ యాదవ్ హత్యకు గురైన మొకామా నియోజకవర్గంలోనూ ఓటర్లు ఎవరికి పట్టం కడతారనే ఆసక్తి నెలకొంది. ఈ హత్య కేసులో అరెస్టయిన అనంత్ సింగ్ మొకామా నుంచి జేడీయూ టిక్కెట్‌పై పోటీలో ఉన్నారు. ఆయన తరఫున కేంద్ర మంత్రి లలన్ సింగ్ ప్రచారం చేశారు. కాగా, గురువారంనాడు పోలింగ్ జరుగనున్న తారాపూర్ నియోజకవర్గంపైనా ఆసక్తి నెలకొంది. ఇక్కడి నుంచి ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర బీజేపీ మాజీ అధ్యక్షుడు సామ్రాట్ చౌదరి పోటీలో ఉన్నారు. గురువారంనాడు పోలింగ్ జరుగనున్న తొలి విడత ఎన్నికల్లో 1,314 మంది అభ్యర్థులు తమ అదృష్టం పరీక్షించుకోనున్నారు. 3.75 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. 50,000కు పైగా పోలింగ్ స్టేషన్లను ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది. మహిళల కోసం 1,000కు పైగా ప్రత్యేక బూత్‌లు ఏర్పాటు చేసింది. ఓటర్ ఐడీ కార్డు లేకపోతే ఆధార్, పాన్, పెన్షన్ కార్డు, డ్రైవర్ లైసెన్స్ వంటి 11 పత్రాలు ఉపయోగించుకునే అవకాశాన్ని కేంద్ర ఎన్నికల సంఘం కల్పించింది. భద్రత కోసం పోలీసులు, కేంద్ర బలగాలతో కలిపి 50,000 వేల మందిని మోహరించింది. డ్రోన్లు, సీసీటీవీల పర్యవేక్షణలో

# బండి సంయ్ మరో సంచలన నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)
హన్మకొండ జిల్లాలో 1133 మంది విద్యార్థులున్నారు. వీరందరికీ పరీక్ష ఫీజు చెల్లించాలంటే రూ.15 లక్షలకుపైగా ఖర్చవుతుంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులంతా దారిద్య్ర రేఖకు దిగువన ఉన్నవారే. వారిలో చాలా మంది విద్యార్థుల తల్లిదండ్రులు కూలీ పని చేసి బతికేటోళ్లు. పిల్లలకు పరీక్ష ఫీజు కూడా చెల్లించే పరిస్థితి లేదని తెలుసుకున్న బండి సంజయ్ తన నియోజకవర్గ పరిధిలోని ఆయా స్కూళ్లలో చదివే విద్యార్థుల ఫీజు మొత్తాన్ని చెల్లించాలని నిర్ణయించు కున్నారు. ఆ మొత్తాన్ని తన వేతనం నుండి చెల్లించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లకు లేఖలు పంపారు. వాస్తవానికి బండి సంజయ్ కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి పేద విద్యార్థులకు బాసటగా నిలుస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులతోపాటు సరస్వతి శిశు మందిరాల్లో చదువుకునే విద్యార్థులుసహా దాదాపు 20 వేల మందికి 'మోడీ గిఫ్ట్' పేరుతో బ్రాండెడ్ సైకిళ్లను పంపిణీ చేశారు. అతి త్వరలోనే సర్కారీ స్కూళ్లలో 9వ తరగతి చదువుకునే విద్యార్థులకు సైతం సైకిళ్లను

# మహిళలను వేదిస్తే కఠిన చర్యలు తప్పవు

**-మహిళల రక్షణ కోసం షీ టీమ్స్ ఎల్లప్పుడూ సిద్ధం**

**- రామగుండం సి.పి అంబర్ కిషోర్ ఝా వెల్లడి**



**చర్చ,గోదావరిఖని (నవంబర్ 05):** మహిళలు, యువతులు ఎలాంటి సమస్యలు ఉన్నా నిర్భయంగా పోలీసులను సంప్రదించవచ్చునని, మహిళల రక్షణ కోసమే షీ టీమ్స్ పనిచేస్తున్నట్లు రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు.రామగుండం పోలీస్ కమిషనరేట్ లో రెండు షీ టీం బృందాలు పని చేస్తున్నాయని అన్నారు. షీ టీం ఆధ్వర్యంలో వివిధ ప్రదేశాలలో, స్కూల్స్ , కాలేజీ లలో ర్యాగింగ్,ఈవ్ టీజింగ్,పోక్సో, ఆత్మహత్య లు/డ్రగ్స్ ,బాల్య వివాహాలు,వరకట్నం చట్టాలపై, నూతన మహిళా చట్టాలపై, డయాల్ 100, యాప్ మహిళ భద్రత, రక్షణ చర్యలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తునట్లు తెలిపారు. టీమ్ సభ్యులు ప్రత్యక్షంగా ఫిర్యాదులు తీసుకుంటారని, ఆన్లైన్, వాట్సప్ ద్వారా కూడా స్వీకరిస్తారని తెలిపారు. మహిళలు, బాలికలపై ఆన్లైన్లో అసభ్యకర పోస్టులు పెట్టే వారు, సైబర్ నేరగాళ్లపై కూడా సైబర్, షీ టీమ్ సమన్వయంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని చెప్పారు. మహిళలు బాలికలు విద్యార్థులు షీ టీం సేవలు ఉపయోగించుకోవాలని సూచించారు. విద్యార్థినిలు, మహిళలు అత్యవసర పరిస్థితులలో రామగుండం పోలీస్ కమిషనరేట్ షీ టీం నెంబర్ 6303923700, పెద్దపల్లి జోన్ షీ టీమ్ నెంబర్ 8712659386 మంచిర్యాల జోన్ షీ టీమ్ నెంబర్ 8712659386 కి కాల్ చేసి, వాట్సాప్ ద్వారా సందేశం పంపించి లేదా డయల్ 100 కు కాల్ చేసి తక్షణ పోలీస్ సహాయం పొందాలని సీపీ పేర్కొన్నారు.అక్టోబర్ నెలలో షీ టీమ్ మొత్తం 69 ఫిర్యాదులు రాగా 12 నేరుగా షీ టీమ్స్ కార్యాలయం లో దరఖాస్తు స్వీకరించినట్లు తెలిపారు. నేరుగా 57 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. మహిళలను వేదిస్తే కఠిన చర్యలు తప్పవని సిపి పేర్కొన్నారు

# కార్తీక పౌర్ణమి సందర్భంగా శ్రీ మహాశక్తి దేవాలయానికి పోటెత్తిన భక్తులు

**- కన్నుల పండుగగా సాగిన శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతం**





**చర్చ :- కరీంనగర్** కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని కరీంనగర్ లోని శ్రీ మహాశక్తి దేవాలయానికి భక్తులు పోటెత్తారు. సత్యనారాయణ స్వామి వ్రతాలకు నేడు శ్రీ మహాశక్తి దేవాలయం ఒక తెలంగాణ అన్నవరంగా మారింది. దేవాలయంలో ప్రత్యేకంగా పూలతో అలంకరించిన మండపం వేయగా, అందులో సామూహికంగా శ్రీ రమా సత్యనారాయణ స్వామి వ్రతం కన్నుల పండుగగా జరిగింది. శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతి స్వామి వారి దివ్య ఆశీస్సులతో ఆలయ వేద పండితులు ఇట్టి సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసం శివ కేశవుల ఆరాధనకు ముఖ్యమైనది. ఈ మాసంలో ప్రతి ఒక్కరూ చేసే పవిత్రమైన పూజ సత్యనారాయణ స్వామి వ్రతం. ఈ వ్రతాన్ని ఆచరించడం వల్ల, సత్యనారాయణ స్వామిని పూజించడంవల్ల ఆయురా రోగ్యాలు, అష్టైశ్వర్యాలు, కష్టాలనుండి విముక్తి లభిస్తుందని, విశేషంగా కుటుంబ శ్రేయస్సు కలుగుతుందని, ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా భార్యాభర్తలు ఆనందంగా ఉండేందుకు ఈ సత్యనారాయణ స్వామి వారు కాపాడుతారని హిందువుల విశ్వాసం. ప్రజల యొక్క పాపాలను, బాధలను, కష్టాలను తీర్చే వ్రతం ఈ సత్యదేవుని వ్రతమని సాక్షాత్తు విష్ణుమూర్తి నారదునికి చెప్పినట్లు పురాణాలు మనకు చెబుతున్నాయి. భక్తుల విశ్వాసానికి అనుగుణంగా శ్రీ మహాశక్తి దేవాలయంలో బుధవారం రోజున చేపట్టిన శ్రీరమా సత్యనారాయణ స్వామి వ్రత మహోత్సవంలోచి అశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పూజ అనంతరం ఆలయ అర్చకులు వ్రతంలో పాల్గొన్న దంపతు లకు స్వామివారి ప్రసాదంతో పాటు ఆశీర్వదించారు. కార్తీకమా సం సందర్భంగా భక్తులు తులసి చెట్టు వద్ద వివిధ దేవతా వృక్షాల వద్ద కార్తీకదీపం వెలిగించి మొక్కలు చెల్లించారు. కార్తీక పౌర్ణమి రోజున దీపారాధన ప్రధాన అంశం. ఎవరైతే ఆలయాల్లో లేదా పవిత్ర స్థలాల్లో దీపాలను దానం చేస్తారో వారికి కోటి జన్మల పుణ్యం లభిస్తుందిని, ఈ దీపం మనలోని అంధకారాన్ని తొలగించి జ్ఞానాన్ని ప్రసాదిస్తుందని తద్వారా మోక్ష ప్రాప్తికి దారి చూపుతుందని హిందువుల విశ్వాసం. ఈ సందర్భంగా అనేక మంది భక్తులు దేవాలయంలో దీప దానాలను అందించారు.

# కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు కోసం మంత్రులతో కలిసి వెలిచాల ప్రచారం

**- నవీన్ యాదవ్ తండ్రి చిన్న శ్రీశైలం యాదవ్ తో సమాలోచనలు**

**- నవీన్ యాదవ్ గెలుపు**

**- ఎప్పుడో ఖరారు అయింది**

**- వారి కుటుంబంతో ఎన్నో ఏండ్ల అనుబంధం ఉంది**

**మాతండ్రిజగపతిరావునుంచిఆత్మీయతకొనసాగుతున్న**

**- నవీన్ యాదవ్ గెలుపు కోసం నా వంతు కృషి చేస్తున్న**

**- జూబ్లీహిల్స్ లో మా కుటుంబానికి తెలియని వారు లేరు కాంగ్రెస్ వైపే ఓటర్ల చూపు**

**- కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు**






**చర్చ, హైదరాబాద్** జూబ్లీహిల్స్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు కోసం కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు ప్రత్యేక కృషి చేస్తున్నారు. బుధవారం జూబ్లీహిల్స్ నియోజక వర్గం లో జరిగిన ప్రచార కార్యక్రమంలో మంత్రులతో కలిసి పాల్గొన్నారు. పౌర సరఫరాలు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన మైనార్టీ శాఖ మంత్రి అజారుద్దీన్ ఎఐసిసి కార్యదర్శి విశ్వనాథ్ సంపత్ కుమార్ తో పాటు వివిధ కార్పొరేషన్ల చైర్మన్ లతో కలిసి ప్రచారం నిర్వహించారు. బుధవారం ఉదయం కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్, వారి తండ్రి చిన్న శ్రీశైలం యాదవును హైదరాబాద్ యూసుఫ్ గూడలో వారి స్వగృహంలో వెలిచాల రాజేందర్ రావు కలిశారు. ఈ సందర్భంగా నవీన్ యాదవ్ ప్రచారం తీరు.. ప్రజలు ఓటర్ల స్పందన కాంగ్రెస్ కు రోజు పెరుగుతున్న బలము స్టాటజీ పై నవీన్ యాదవ్, శ్రీశైలం యాదవ్ తో ప్రత్యేకంగా సమాలోచనలు చేశారు. చిన్న శ్రీశైలం ఆహ్వానం మేరకు రాజేందర్ రావ్ వారి ఇంటికి వెళ్లారు. వారితో కలిసి బ్రేక్ ఫాస్ట్ చేశారు. ఈ సందర్భంగా వారితో ప్రత్యేకంగా మాట్లాడారు. మా తండ్రి మాజీ ఎమ్మెల్యే మాజీ ఎమ్మెల్సీ జగపతిరావు తో పాటు మా కుటుంబానికి జూబ్లీహిల్స్ తో ప్రత్యేక అనుబంధం ఉందని వివరించారు. దీంతోపాటు చిన్న శ్రీశైలం యాదవ్ కుటుంబానికి అనేక ఏళ్ల నుంచి ఆత్మీయత అనుబంధం ఎంతో ఉందని పేర్కొన్నారు. ఈ అనుబంధం తోనే నవీన్ యాదవ్ గెలుపు కోసం తన వంతు కృషి చేస్తున్నానని రాజేందర్రావు పేర్కొన్నారు. ఈ ప్రాంతంలోనే నివసించామని, చిన్నప్పటి నుంచి ఈ ప్రాంతం పై ఎంతో మమకారం ఉందని చెప్పారు. మిత్రులు బంధువులు సుపరిచితులు ఎంతోమంది ఇక్కడే ఉన్నారని తెలిపారు. ఆ పరిచయాలతో నవీన్ యాదవ్ గెలుపునకు తన శక్తియుక్తుల పని చేస్తున్నానని నవీన్ యాదవ్ కు వారి తండ్రి చిన్న శ్రీశైలం యాదవ్ కు రాజేందర్రావు హామీ ఇచ్చారు. ప్రచారము సభలు సమావేశాలకు వస్తున్న జన ప్రభంజనాన్ని చూస్తే నవీన్ యాదవ్ గెలుపు ఎప్పుడో ఖరారు అయిందని భారీ మెజార్టీతో విజయం సాధించబోతు న్నారని రాజేందర్రావు ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓటర్లు కాంగ్రెస్ వైపే మద్దతుగా ఉన్నారని రాజేందర్రావు పేర్కొన్నారు. అదేవిధంగా నూతనంగా ప్రమా ణస్వీకారం చేసిన మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్ కు రాజేందర్ రావు ప్రత్యేక అభినందనలు తెలిపారు. నవీన్ యాదవ్ గెలుపు కోసం రాజేందర్ రావు జూబ్లీహిల్స్ నియోజ కవర్గం లో విస్తృతంగా ప్రచార నిర్వహిస్తున్నారు.

## జూబ్లీ హిల్స్ ఎన్నికల ప్రచారంలో సుడా చైర్మన్





**కరీంనగర్ :** హైదరాబాద్ లోని జూబ్లీ హిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నిక సందర్భంగా సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి 97 వ డివిజన్ లోని ఎల్లారెడ్డి గూడలో ఎన్నికల ప్రచార ంలో పాల్గొంటున్నారు.కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ను గెలిపించాలని ఇంటింటి ప్రచారం చేస్తున్నారు.సుడా చైర్మన్ తో కలిసి ప్రచారంలో సిటీ కాంగ్రెస్ నాయకులు కొట్టె ప్రభాకర్, కీర్తి కుమార్,ఉప్పరి అజయ్,బాలకృష్ణ తదితరులు పాల్గొంటున్నారు.

## అగ్రి బిజినెస్ అవార్డుల కార్యక్రమంలో

**- కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి**

**హైదరాబాద్ చర్చ ప్రతినిధి నవంబర్ 5**అగ్రి బిజినెస్ అవార్డులు ఇవ్వడం ద్వారా మన దేశ వ్యవసాయ రంగానికి ఎనలేని సేవలు అందిస్తున్న రైతులకు, ఇన్నొవేటర్స్, అగ్రిప్రెన్యూర్స్ కు గౌరవించుకోవడమే. దేశంలో ఎన్ని మార్పులు వచ్చినా.. వ్యవసాయం ఇప్పటికీ మన జీవన విధానంలో భాగం. దేశంలోని 54 శాతం జనాభా వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. వ్యవసాయ రంగం దేశ జీడీపీలో 18 శాతం భాగస్వామ్యం కలిగి ఉంది. ఆత్మ నిర్భర భారత్ దిశగా దూసుకెళ్లేందుకు వ్యవసాయ రంగం కీలక పాత్ర పోషిస్తోంది. రైతులు సుభిక్షంగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ గారు బలంగా నమ్ముతారు. అందుకే అనేక పథకాలు రైతులకు మేలు చేసేలా రూపొందించారు. ఈ ఏడాది చైనాను దాటేసి 149 మిలియన్ టన్నుల ధాన్యం ఉత్పత్తితో భారత్ ప్రపంచంలోనే తొలిస్థానంలో నిలిచింది. 2014-15తో పోలిస్తే పాల ఉత్పత్తి 63 శాతం పెరిగింది. ఇప్పటికీ ప్రపంచంలోనే అత్యంత ఎక్కువ పాలు ఉత్పత్తి చేసే దేశంగా నిలిచింది. పప్పు ధాన్యాల ఉత్పత్తిలో ప్రపంచలోనే తొలిస్థానంలో నిలిచింది. దేశంలో 26 మిలియన్ టన్నుల పప్పు ధాన్యాల ఉత్పత్తి జరుగుతోంది. కరోనా సమయంలో ప్రపంచవ్యాప్తంగా సరఫరా విషయంలో ఎన్ని ఇబ్బందులు తలెత్తినా ఆహార ధాన్యాలు సరఫరా జరిగేలా చర్యలు తీసుకున్నాం. వేరే దేశాలకు కూడా మన దగ్గరి నుంచి ఎగుమతి చేశాం. ప్రధానమంత్రి నరేంద్రమోదీ గారి నేతృత్వంలో దేశంలోని 80 కోట్ల మందికి ఉచితంగా 5 కేజీల చొప్పున బియ్యం ఇస్తున్నాం. పీఎం కిసాన్, పీఎం కృషి సించాయ్ యోజన వంటి అద్భుతమైన పథకాలను అమలు చేస్తున్నాం. 2019లో పీఎం సమ్మాన్ నిధి యోజన ప్రారంభించినప్పటి నుంచి 11.8 కోట్ల మంది రైతులకు 21 విడతల్లో రూ.4 లక్షల కోట్ల నగదు రైతుల ఖాతాల్లో జమ చేశాం. ఈ పథకం ద్వారా చిన్న, మధ్య తరహా రైతులకు భరోసా దక్కింది. దళారుల ప్రమేయం లేకుండా రైతులు లబ్ధి పొందుతున్నారు. 2014 నుంచి ఇప్పటివరకు వరి ధాన్యం కనీస మద్దతు ధర భారీగా పెంచాం. జీఎస్టీ 2.0 ద్వారా రైతులకు ఉపయోగపడేలా ట్రాక్టర్లు, మెషీన్లపై భారీగా జీఎస్టీ తగ్గించాం. దీంతో రైతులకు ఎంతో మేలు జరుగుతోంది. సాగు ఖర్చు కూడా భారీగా తగ్గి, రైతుల ఆదాయం మరింత పెరుగుతుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, డ్రోన్స్ వంటి అగ్రి టెక్నాలజీ ద్వారా వ్యవసాయ రంగాన్ని మరింతగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది.

## ప్రభుత్వ సలహా దారునికి శుభాకాంక్షలు చెప్పిన జగిత్యాల ఎమ్మెల్యే



**చర్చ, జగిత్యాల, నవంబర్ 5:** రాష్ట్ర ప్రభుత్వ సలహా దారులుగా నియమితులైన మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం రాష్ట్ర సచివాలయానికి వెళ్లిన జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పదవి భాధ్యత లను చేపట్టనున్న సుదర్శన్ రెడ్డికి పూల కుండిని అందించి శుభాకాంక్షలు తెలిపారు.


## జిన్నింగ్ మిల్లు ఎదుట రైతు ఆందోళన



**చర్చ, ఖమ్మం:** ఖమ్మం రూరల్ మండలం గుర్రాలపాడు జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం ఎదుట ఓ రైతు ఆందోళనకు దిగాడు. ఆరుగాలం కష్టించి పండించిన పత్తిని ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రంలో విక్రయించేందుకు యాలాద్రి అనే రైతు బుధవారం వాహనంలో పత్తిని మార్కెట్‌కు తీసుకుని వచ్చాడు. అయితే పత్తి నల్లగా ఉందని, తాము కొనుగోలు చేయలేమని, బయట విక్రయించుకోవాలంటూ సీసీఐ అధికారులు సూచించారని రైతు వాపోతున్నాడు. ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకే సిసిఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తే, అక్కడ మాత్రం పత్తిని కొనకుంటా బయటి మార్కెట్‌లో అమ్ముకోమని చెప్పడం ఏమిటని రైతు ఆగ్రహం వ్యక్తం చేశాడు. వర్షాలకు నల్ల బారిన పత్తిని సిసిఐ కొనుగోలు కేంద్రంలో ప్రభుత్వమే కొనుగోలు చేయకపోతే ఎక్కడ అమ్ముకోవాలని వాపోయాడు. తాను పండించిన పత్తిని కొనుగోలు చేసే వరకు ఆందోళన విరమించేది లేదని రైతు యాలాద్రి అధికారులను హెచ్చరించారు.

# కిటకిటలాడిన శైవ క్షేత్రాలు





**చర్చ, సత్తుపల్లి:** కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని పట్టణ పరిధిలోని శైవక్షేత్రాలు బుధవారం భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక గుడిపాడులో వేంచేసి ఉన్న దుర్గా పార్వతి సహిత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుండే భక్తులు విరివిగా గుడికి తరలివచ్చి శివయ్యకు అభిషేకాలు, దీపాలంకరణ చేశారు. కోరిన కోరికలు తీర్చే స్వామిగా పేరుగాంచడంతో భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకొని భక్తిశ్రద్ధలతో అభిషేకాలు నిర్వహించారు. అశేష భక్త సమూహంతో శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ కమిటీ వారు భక్తులకి అన్ని విధాల సౌకర్యాలు కల్పిస్తూ దీపాలు వెలిగించే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# పిడియస్‌యూ జిల్లా అధ్యక్షులుగా తిప్పరపు లక్ష్మణ్

**- జిల్లా ప్రధాన కార్యదర్శిగా వంగూరి వెంకటేష్ ఎన్నిక**



**చర్చ, సత్తుపల్లి:** పట్టణంలో జరిగిన పిడిఎస్‌యు ఖమ్మం జిల్లా 23వ మహాసభలలో జిల్లా అధ్యక్షులుగా తిప్పరపు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా వంగూరి వెంకటేష్, ఉపాధ్యక్షులుగా గొలుసు వినయ్, శశికిరణ్, షిలార్ పాషా, సహాయ కార్యదర్శులుగా యశ్వంత్, సాధిక్, రఘు, కోశాధికారిగా కీర్తిలతోపాటు రెండు కోఆప్షన్ సభ్యులు, 11మంది సభ్యులను ఎకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు కాంపటి పృథ్వి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్, వెంకటేష్‌లు మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు విద్యార్థులతో మమేకమై ఉద్యమాలు నిర్మిస్తామనన్నారు. ఖమ్మం జిల్లాకు యూనివర్సిటీ సాధనతోపాటు దేశ, రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ యూనివర్సిటీల అభివృద్ధి, సమస్యల పరిష్కారం కోసం, ప్రభుత్వ విద్యా సంస్థల అభివృద్ధి కోసం ప్రగతిశీల శక్తులను ఐక్యం చేస్తూ పోరాటం చేస్తామన్నారు. విద్యార్థి, యువజన, ప్రజా వ్యతిరేక విధానాలపై విద్యార్థులను సంఘటితం చేయడంలో, ఉద్యమాలు నిర్మించడంలో కీలకపాత్ర పోషించే విధంగా కృషి చేస్తాన్నారు.

# జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్ట రాగమయి




**చర్చ, సత్తుపల్లి:** నవీన్ యాదవ్‌ను అత్యధిక ఓట్ల మెజారిటీతో గెలిపించాలని కోరుతూ జూబ్లీహిల్స్ వెంగళ్‌రావు నగర్ డివిజన్‌లో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, కాంగ్రెస్ వెంగళరావు నగర్ డివిజన్ ఇంచార్జ్ మట్టా దయానంద్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నవంబర్ 11న జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జరిగే ఉప ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాగమయి ఇస్త్రీ షాపులు వద్ద ఇస్త్రీ చేస్తూ తనదైన శైలిలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ఓటర్లకు తెలియజేస్తూ ప్రచారం కొనసాగించారు. ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ నవీన్ యాదవ్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి మున్సిపల్ మాజీ చైర్మన్ ఇందుప్రియ, గజ్వేల్ మాజీ జడ్పీ చైర్మన్ సరిత, డివిజన్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు, సత్తుపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# నవీన్ యాదవ్ గెలుపు నల్లేరుపై నడకే

**- జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి ధీమా**



**చర్చ:- కరీంనగర్** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ గెలుపు ఖాయమని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. బుధవారం ఆయన తిమ్మాపూర్ మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు నల్లేరుపై నడకేనని పేర్కొన్నారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ పాలకులు రాష్ట్రాన్ని అధోగతి పాల్జేశారని విమర్శించారు. దోచుకో,దాచుకో చందంగా పాలన సాగించి రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారన్నారు. పదేళ్లలో పొందని సంక్షేమ ఫలాలను ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో పొందుతున్నారని ఆయన గుర్తు చేశారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా అన్నివర్గాల ప్రజలను మోసం చేసిందని డాక్టర్ కవ్వంపల్లి విమర్శించారు. ముఖ్యంగా ముస్లింలకు తీరని అన్యాయం జరిగిందన్నారు. ముస్లింలకు సంబంధించిన పాఠశాలను అనేకం మూత వేసిందని, ప్రవేశా ల్లోనూ కోత విధించిందన్నారు. ముస్లింలకు రిజర్వేషన్ల పేరట వారిని నయవంచనకు గురిచేసిందన్నారు. ఎన్నికల సమయంలో ముస్లింలపై ప్రేమ ఒలకబోసిన అప్పటి బీఆర్ఎస్ పాలకులు ఒక్క ముస్లింని కూడా రాజ్యసభకు ఎందుకు పంపించలేదని ఆయన ప్రశ్నించారు. బీఆర్ఎస్ సాగించే ప్రచారాలను నమ్మి మరోసారి మోసపోవద్దని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈనెల 11న జరిగే ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కు ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్.ఎల్ గౌడ్, తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్, మాజీ అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, పార్టీ నాయకులు సిరిగిరి రంగారావు, గోపు మల్లారెడ్డి, మామిడి అనిల్ కుమార్, గోగూరి నర్సింహా రెడ్డి, కొత్త తిరుపతి రెడ్డి, బుధారపు శ్రీనివాస్, సిరిగినేని కొండాల్ రావు, గంకిడి లక్ష్మారెడ్డి, బి.కొండయ్య గౌడ్, చింతల లక్ష్మా రెడ్డి, పోలు రాము, పోతుగంటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# వైరా ఎమ్మెల్యేను కలిసిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బంజారా సంఘాల జేఏసీ

**- తుల్జా భవాని జాతర ఏర్పాటుకు స్థలం, నిధులు కేటాయించాలని వినతి**

**- హైదరాబాద్‌కు తరలివెళ్లిన ఉద్యోగ, ఉపాధ్యాయ, సాధులు, బంజార సంఘాల నాయకులు**





**చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో బంజారాల ఆరాధ్య దైవమైన సంత్ శ్రీశ్రీశ్రీ సేవాలాల్ మహారాజ్, శ్రీశ్రీశ్రీ తుల్జా భవాని జాతర ఏర్పాటుకు చేయుట గురించి కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, తెలంగాణ అటవీ శాఖ బోర్డు సభ్యులు, వైరా నియోజకవర్గ శాసన సభ్యులు మాళోత్ రాందాస్ నాయక్‌ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బంజారా సంఘాల జేఏసీ చైర్మన్ డాక్టర్ శంకర్ నాయక్, వైస్ చైర్మన్ బానోత్ వీరు నాయక్‌ల ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందచేశారు. జిల్లాకు చెందిన బంజారా ఉపాధ్యాయ, ఉద్యోగ, సాధులు, బంజారా సంఘాల నాయకులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు సుమారు 50 మందికిపైగా హైదరాబాద్‌కు తరలి వెళ్లి రాందాస్ నాయక్‌ను కలిశారు. ఈ సందర్భంగా బంజారా సంఘాల జేఏసీ చైర్మన్ డాక్టర్ శంకర్‌నాయక్ మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో బంజారాల ఆరాధ్య దైవాలకు సంబంధించి ఎటువంటి ఆలయాలు, జాతర స్థలాలు లేవని, దీనివల్ల ప్రతీ యేటా జాతరలు నిర్వహించేందుకు బంజారా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి బంజారాలు కీలకపాత్ర పోషించారని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 4 లక్షలకు పైగా బంజారా జనాభా ఉన్నారని పేర్కొన్నారు. గతంలో జిల్లా కేంద్రంలోని రేగళ్ల ప్రాంతంలో కొంత స్థలాన్ని ప్రభుత్వం కేటాయించినప్పటికీ అనివార్య కారణాల వల్ల ఆలయ నిర్మాణం జరగలేదని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సంత్ శ్రీశ్రీశ్రీ సేవా లాల్ మహారాజ్, శ్రీశ్రీశ్రీ తుల్జా భవాని ఆలయ నిర్మాణంతోపాటు జాతర నిర్వహణ కోసం అవసరమైన స్థలాన్ని అన్ని అనుమతులతో ప్రభుత్వం కేటాయించే విధంగా కృషి చేయడంతోపాటు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయాలని, అవసరమైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ మేరకు స్పందించిన ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి త్వరితగతిన అన్ని అనుమతులతో స్థలం కేటాయించడంతోపాటు జాతర నిర్వహణకు అవసరమైన నిధులు, సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం జేఏసీ నాయకులు మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్‌ను కలిసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో బంజారాలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను విన్నవించారు. శ్రీశ్రీశ్రీ తుల్జా భవాని జాతర ఏర్పాటుకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జగదంబసేన వ్యవస్థాపక అధ్యక్షులు తేజావత్ రాములు, సాధుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు నూనావత్ శంకర్, బిచ్చ సాధు, వస్రాం సాధు, బంజారా భవన్ పాల్వంచ కమిటీ నాయకులు భూక్య చందు, బానోత్ రాము, జిల్లా జేఏసీ నాయకులు ధరావత్ కాన్షీరాం, బానోత్ రమేష్, డాక్టర్ వెంకట్, జాటోత్ భరత్, టిఎస్‌టిటిఎఫ్ ఉపాధ్యాయ సంఘ జిల్లా అధ్యక్షులు బి.మోహన్, సపావత్ బాలకృష్ణ, జర్పుల బిక్కులాల్, సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు మాళోత్ శివ నాయక్, ధరావత్ కృష్ణ, ఎల్‌హెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు గుగులోత్ కేశవ్ నాయక్, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి గుగులోత్ మోహన్ నాయక్, చంద్రుగొండ మండల అధ్యక్షులు భూక్య రాందాస్ రాథోడ్, జిల్లా నాయకులు బానోత్ చందర్ నాయక్, ఏజెన్సీ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బానోత్ లాల్‌సింగ్ నాయక్, సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షులు గుగులోత్ భద్రు నాయక్, భారతీయ గోర్‌బంజారా ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షులు బానోత్ దుర్గా ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బోడ గణేష్, గుగులోత్ కోటి, బానోత్ రాము, జర్నలిస్టు సంఘాల నాయకులు బానోత్ నాగేశ్వరరావు, బానోత్ రమేష్, బానోత్ రాందాస్, ధరావత్ వెంకన్న, బీఆర్ఎస్ నాయకులు మూడ్ జయరాం నాయక్, బీజేపీ లక్ష్మీదేవిపల్లి మండల అధ్యక్షులు మాళోత్ గాంధీనాయక్, సీపీఐ నాయకులు మాళోత్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రయాణికుడి వింత ఆలోచన

**- సుత్తితో స్లీపర్ బస్‌లో ప్రయాణం**

**- ఆలోచన అధిరిందంటున్న ప్రజలు**





**చర్చ, అశ్వారావుపేట:** ఇటీవల స్లీపర్ క్లాస్ బస్‌ల ప్రమాదాల్లో పదుల సంఖ్యలో ప్రయాణికులు మంటల్లో కాలిపోయి ప్రాణాలు పోగొట్టుకోవడంతో జనం స్లీపర్ బస్ ప్రయాణం అంటేనే చాలా భయపడుతున్నారు. జాగ్రత్తగా బస్ ఎక్కడం కాదు.. అంతే జాగ్రత్తగా బస్ దిగాలి అనుకుంటే మన ఏర్పాట్లు మనం చేసుకోవాలని ఓ సీఏ విద్యార్థి సరికొత్త ఆలోచన చేశాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటకు చెందిన ఉండవల్లి శివగోపాల్ అనే యువకుడు సీఏ చదువుతున్నాడు. సొంత పనులపై అశ్వారావుపేట నుండి హైదరాబాద్‌కు స్లీపర్ బస్‌కి టికెట్ బుక్ చేసుకున్నాడు. ప్రయాణికుల భద్రతపై బస్ యాజమాన్యం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదనే ఉద్దేశ్యంతో తన లగేజీలో ఫోన్ చార్జర్, ఇయర్ బడ్స్, మెడిసిన్స్, వాటర్ బాటిల్‌తోపాటుగా ఓ సుత్తిని(హేమర్) కూడా బ్యాగ్‌లో పెట్టుకుని ప్రయాణం చేశాడు. బస్సులో కూడా సుత్తిని పక్కనే పెట్టుకుని ఏదైనా ప్రమాదం జరిగితే ఆ స్తుతితో అద్దాలు పగలగొట్టుకుని బయటకు రావచ్చని గోపాల్ ఆలోచనపట్ల పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

# సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకుపిలుపునిస్తాం

**- ఎస్‌సిసిడబ్ల్యూ అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య**





**చర్చ, సత్తుపల్లి:** సింగరేణిలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, లేకుంటే సమ్మెకు పిలుపునిస్తామని ఎస్‌సిసిడబ్ల్యూ అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య హెచ్చరించారు. సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటియుసి ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సత్తుపల్లి కేంద్రంగా నడుస్తున్న సింగరేణిలో కార్మికులు పలు సమస్యలను ఎదుర్కొంటున్నారని, వాటిని తక్షణమే పరిష్కారం చేయాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో డిపెండెంట్‌లకు ఉద్యోగ నియామక పత్రాలు వెంటనే జారీ చేయాలని కోరారు. మెడికల్ బోర్డు పెట్టకుండా యాజమాన్యం కాలయాపన చేస్తుందని మండిపడ్డారు. రీజియన్‌లో ఉన్న వికే కోల్‌మైన్‌లో సింగరేణి కార్మికుల ద్వారానే బొగ్గును వెలికి తీయ్యాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న మారుపేర్ల సమస్యను పరిష్కరించాలని, సిఅండ్ ఎండి స్థాయి స్ట్రక్చర్ కమిటీ సమావేశంలో ఒప్పుకున్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అన్నారు. ఈ మేరకు గురువారం అన్ని మైన్స్, డిపార్ట్‌మెంట్స్ వద్ద జరిగే నిరసన కార్యక్రమాలతోపాటు , 8న జీఏం కార్యాలయాల వద్ద జరిగే భారీ ధర్నాకు కార్మికులు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సింగరేణి కార్మికులు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న సొంతింటి కల నెరవేర్చి ప్రతి కార్మికుడికి 200 గజాల స్థలంతోపాటు రూ.30 లక్షలు వడ్డీలేని రుణం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం సత్తుపల్లికి తొలి జిఎంగా బాధ్యతలు చేపట్టిన చింతల శ్రీనివాస్‌కు పుష్పగుచ్చం అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో కార్పొరేట్ బ్రాంచ్ కార్యదర్శి రమణమూర్తి, సెంట్రల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి వీరస్వామి, సత్తుపల్లి కార్యదర్శి సుధాకర్ సముద్రాల, సీనియర్ నాయకులు దండు ఆదినారాయణ, బీమయ్య, సూర్యప్రకాష్, నర్సింహారావు, భరణి, చారి, నరేందర్, బి సుధాకర్, బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

# మనల్ని ఎవడ్రా ఆపేది

- ఇందిరమ్మ ఇళ్ల పేరుతో అక్రమ రవాణాలు
- అధికారుల పర్యవేక్షణ కరువు
- ఒక ప్రాంతం నుండి కాకపోతే ఇంకో ప్రాంతం నుండి తవ్వేస్తాం తెచేస్తాం











**చర్చ, అశ్వారావుపేట:** మట్టి, గ్రావెల్ అక్రమ తవ్వకాలు, రవాణా యాదేచ్ఛగా కొనసాగుతున్నాయి. మండలంలోని పేరాయిగూడెం ప్రాంతంలో తవ్వనివ్వకపోతే మాకేంటి... మాకేమైనా అటవీ ప్రాంతానికి కొదవా... ఈ ప్రాంతం కాకపోతే ఇంకో ప్రాంతం... అంతే కాని మట్టి, గ్రావెల్ అక్రమ రవాణా ఆపేదేలేదు అంటోంది మట్టి మాఫియా. అశ్వారావుపేట మండల పరిధిలో మట్టి గ్రావెల్ అక్రమ రవాణా అడ్డగోలుగా జరుగుతుంది. కలెక్టర్, మైనింగ్, రెవెన్యూ ఎవరైనా చెప్పనీ... ఎంతైనా చెప్పనీ.. మేము ఎవ్వరి మాటా వినము. మాదందా మాదే అన్న తీరుగా ఉంది మట్టి మాఫియా పరిస్థితి. నిన్న మొన్నటి వరకు అశ్వారావుపేట మండల కేంద్రానికి దగ్గరలో ఉన్న పేరాయిగూడెం, అల్లిగూడెం, ప్రాంతాలలోని ప్రభుత్వ భూములలో యాదేచ్ఛగా తవ్వకాలు జరుపుతున్నారనే సమాచారంతో మైనింగ్, రెవిన్యూ అధికారులు సంయుక్తంగా తవ్వకాలు జరిపిన స్థలాన్ని పరిశీలించి, విచారణ జరిపి ఇప్పటి వరకు జరిగిన తవ్వకలు సక్రమమే, ఇందిరమ్మ ఇండ్ల కోసం అని తేల్చి చెప్పారు. కాని ఎక్కడ, ఏ ఇందిరమ్మ ఇంటికి మట్టి తొలకం జరిగిందో వారికే తెలియాలి. అక్రమ తవ్వకాలు జరిపిన, అక్రమ రవాణా జరిపిన అక్రమార్కులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించిన సంగతి అందరికి తెలిసిందే. హెచ్చరికలు జారీ చేసిన మరుసటి రోజునే రెండు మట్టి ట్రాక్టర్లను పోలీసులు పట్టుకుని స్థానిక రెవిన్యూ అధికారులకు అప్పగించినప్పటికి మాఫియాకు భయమనేదే లేకుండా ఇష్టానుసారం బుధవారం రోజున దబ్బతోగు నుండి వినాయకపురం అశ్వారావుపేట వరకు సుమారు 50 ట్రాక్టర్లతో మట్టి, గ్రావెల్ తోలకాలు చేపట్టారు. ఇదేమిటని ప్రశ్నించిన వారిపై బెదిరింపులకు పాల్పడుతున్నట్టు స్థానికులు వాపోయారు. ఎవరెన్ని చెప్పినా, ఎన్నిసార్లు కథనాలు రాసినా మమ్మల్ని ఎవరూ ఆపేది. మాకెదురేలేదు అంటూ తవ్వేస్తున్నారు.. తోలేస్తున్నారు. అధికార పక్షం మాకు అండగా ఉండగా మాకేం కాదు, ఏమైనా అంటే ఇందిరమ్మ ఇండ్లకు తోలుతున్నాం అని పేరు పెట్టుకుని ఆ పథకానికి మచ్చ తీసుకువస్తున్నారు. అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికి ఎందుకు పట్టించుకోకుండా వదిలేస్తున్నారనేది ప్రజలకు అర్థం కాని ప్రశ్నగా మారింది. ఇప్పటికైనా మండల వ్యాప్తంగా జరుగుతున్న మట్టి గ్రావెల్ అక్రమ తవ్వకాలు, అక్రమ అడ్డుకట్ట వేసి పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరుతున్నారు.

# మాటల్లోనే అభివద్ధి..! చేతల్లో శూన్యం


- కలెక్టర్ చొరవ చూపించేనా?
- ఎమ్మెల్యే దష్టి సారించేనా?
- ప్రజల ఎదురుచూపులకు తెరపడేనా












**చర్చ, కొత్తగూడెం:** 'మైకు దొరికితే ప్రసంగాలతో ఊదరగొడుతూ నేను అదిచేశా... ఇది చేశా అని చెప్పే ప్రజా ప్రతినిధులకు ఏళ్ల తరబడి పేరుకుపోయిన సమస్య కన్పించడంలేదా' అంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిధులు మంజూరు చేసినా. అభివద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది పరిస్థితి. నిత్యం క్రీడాకారులు తమ నైపుణ్యాలను మెరుగుపర్చుకునేందుకు ఉన్న క్రీడా మైదానం సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణంలోని రామవరం ప్రాంతంలో తెలంగాణ క్రీడా ప్రాంగణం దుస్థితిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతనెల 22వ తేదీన స్థానిక అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ శంకుస్థాపన కార్యక్రమానికి వచ్చిన సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు స్థానికులు క్రీడామైదానం దుస్థితిని చూపించినా ఇప్పటికీ ఎటువంటి పరిష్కారం చూపించలేదని వాపోతున్నారు. క్రీడాకారులకు సౌకర్యాలు కల్పించకపోవడంతో వారంతా తెలంగాణ క్రీడా మైదానంలో అసౌకర్యాల నడుమ ఆటలాడుకోవాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ 2024 ఆగస్టు నెలలో రామవరంలో 'స్వచ్ఛదనం.. పచ్చదనం మనందరి బాధ్యత' అనే కార్యక్రమాన్ని పరిశీలించేందుకు వచ్చిన సందర్భంగా స్థానికులు క్రీడా మైదానం దుస్థితిని కలెక్టర్‌కు వివరించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరిగి విన్నవించినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు మాటల్లో అభివృద్ధిని చూపించినా. చేతల్లో మాత్రం కన్పించడంలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



### - అసాంఘీక కార్యకలాపాలకు అడ్డాగా...

ఒకవైపు సౌకర్యాలలేమి క్రీడాకారులను నిరాశకు గురిచేస్తుంటే మరో పక్క రూ.1.35 కోట్లతో నిర్మించిన తెలంగాణ క్రీడా ప్రాంగణం ఇప్పుడు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని క్రీడాకారులు ఆరోపిస్తున్నారు. ఓపెన్ జిమ్‌లో మందుబాబులు తాగి తందనాలాడుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారని, మరికొన్ని రోజులు ఇలాగే వదిలేస్తే ఆకతాయిలు ఇతర కార్యకలాపాలకు వాడుకునే పరిస్థితి ఉందని స్థానికులు వాపోతున్నారు. సీసీ కెమేరాలు, వీధి దీపాలు లేకపోవడంతో సాయంత్రం అయితే క్రీడా ప్రాంగణం చిమ్మ చీకట్లు అలుముకోవడం మందుబాబులకు కలిసి వస్తుంది. ఇప్పటికైనా ఎమ్మెల్యే, కలెక్టర్ చొరవ తీసుకుని తెలంగాణ క్రీడా ప్రాంగణాన్ని అభివద్ధి చేసి ప్రజలకు, క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### - మహిళలు క్రీడాప్రాంగణానికి వచ్చే పరిస్థితి లేదు

**: ఎం.డి. ఖాజాబీ, స్థానికుడు**



ఉదయం, సాయంత్రం తెలంగాణ క్రీడా ప్రాంగణానికి వచ్చి మహిళలు వాకింగ్ చేయాలంటే ఇబ్బందులు పడుతున్నారు. పిచ్చిమొక్కల వల్ల విషసర్పాలు తిరుగుతుండటంతో నడవలే కపోతున్నారు. ఆకతాయిలు వచ్చి మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. సెక్యూరిటీ గార్డును ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

### - కమీషన్ల కోసం పార్కును నిర్వీర్యం చేశారు

**: కె.శ్రీను, స్థానికుడు**



మాజీ మున్సిపల్ ప్రజా ప్రతినిధులు కమీషన్ల కోసం కక్కుర్తిపడి పార్కును నిర్వీర్యం చేశారు. గొప్పలు చెప్పుకోడానికే ఓపెన్‌జిమ్ ఏర్పాటు చేశారు. నాసిరకంగా పనుల వల్ల జిమ్ పరికరాలు విరిగిపోతున్నాయి. పిచ్చి మొక్కలు పెరిగి, పాములు సంచరిస్తు న్నాయి. పార్కును అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలి.

# ప్రగతి నగర్ శివాలయంలో భక్తుల రద్దీ





**చర్చ, కొత్తగూడెం:** కార్తీక పౌర్ణమి సందర్భంగా కొత్తగూడెం పట్టణం ప్రగతినగర్ శివాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు తెల్లవారుజామున ఆలయానికి విచ్చేసి కార్తీక దీపాలను వెలిగించి మొక్కలు చెల్లించుకున్నారు. కొత్తగూడెం స్పెషల్ జ్యూడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ మెండు రాజమల్లు, కొత్తగూడెం 3 టౌన్ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్, ఏఎస్ఐ బి.వి.ఆర్.రఘులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ పూజారి కొండవీటి దత్తాత్రేయ శర్మ ఆశీర్వచనాలు అందచేశారు. వీరివెంట పిసి భూక్యా జయాత్రా, మద్దినేని వెంకటేశ్వర్లు, చౌరంగి శ్రీనివాస్, జడల కోటేశ్వరరావు ఉన్నారు.

## జూబ్లీహిల్స్‌లో అశ్వారావుపేట వాసుల ప్రచారం




**చర్చ, అశ్వారావుపేట:** కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు కోరుతూ అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సారధ్యంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు విస్తృతంగా ప్రచారాలు నిర్వహిస్తున్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో రహమత్ నగర్ ప్రాంతానికి ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ప్రచార ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇంటింటికి తిరుగుతూ తనదైన శైలిలో ప్రచారాన్ని ముందుకు తీసుకెళు న్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలు చేసి ప్రజలకు ఉపయోగకరమైన పథకాలు తీసుకురావడం, వాటిని అమలు పరచడంపై ప్రజలకు వివరిస్తూ ప్రచారం కొనసాగిస్తుండటంతో ప్రజలు వీరికి బ్రహ్మరథం పడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ కుమార్ యాదవ్ గెలుపు ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త నవీన్ యాదవ్ గెలుపుకు తమ వంతు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తుమ్మ రాంబాబు, బండి చెన్నారెడ్డి, మిండా హరిబాబు, ఆకుల శ్రీను, నార్లపాటి దివాకర్, కరీం, నాగు, నాగ కిషోర్, ముర్తుజ, రహమత్ తదితరులు అశ్వారావుపేట ప్రాంతం నుండి పాల్గొన్నారు.

## రూ.5.34 కోట్లతో రోడ్డు వైండింగ్

**- సెంట్రల్ లైటింగ్, డివైడర్ పనులను పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు**



**చర్చ, మణుగూరు:** స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ నుండి బాంబే కాలనీ వరకు రోడ్డు వైడింగ్, సెంట్రల్ లైటింగ్, డివైడర్ పనులకు రూ.5.34 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం ద్వారా పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు మంజూరుచేయించినట్లు మండల కాంగ్రెస్ నాయకులు తెలిపారు. గత పాలకులు కమిషన్లకు కక్కుర్తి పడి పనులను పూర్తి చేయలేకపోయారని, ఫలితంగా ఎన్నో ప్రమాదాలు జరిగి పలువురు మృత్యువాత పడ్డారని ఆరోపించారు. ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో ఎమ్మెల్యే ఈ విషయాన్ని సంబంధిత అధికారులతో మాట్లాడి పనులు చేయని కాంట్రాక్టర్‌ను పక్కకు పెట్టి నూతన టెండర్ పిలిచి కొత్త వారికి కాంట్రాక్ట్ ఇచ్చి నిధులను మంజూరు చేయించి పనులను ప్రారంభించినట్లు చెప్పారు. ఈ మేరకు నిర్వహిస్తున్న పనులను మండల ముఖ్య నాయకులు బుధవారం పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పిరినాకి నవీన్, టౌన్ అధ్యక్షులు శివ సైదులు, కాటబోయిన నాగేశ్వరరావు, మహిళా కూరపాటి సౌజన్య, గాండ్ల సురేష్, చింతల కృష్ణ, మానస, స్వరూప కార్యకర్తలు పాల్గొన్నారు.

## శాస్త్రీయ విద్యా విధానమే అంతిమ లక్ష్యం

**- ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్**




**చర్చ, అశ్వాపురం:** అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా సహాయ కార్యదర్శి ఈనపల్లి పవన్ సాయి అధ్యక్షత జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ మాట్లాడుతూ మండల కేంద్రంలో గురువారం జరగబోయే మండల మహాసభలను జయప్రదం చేయాలని, విద్యార్థులు శాస్త్రీయ విద్యా విధానం కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం వైపు ప్రభుత్వం దృష్టి సారించాలని, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఏఐఎస్ఎఫ్ చేసే పోరాటాలలో విద్యార్థులు భాగస్వాములు కావాలని, ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణకై పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఈనపల్లి పవన్ సాయి, జిల్లా ఉపాధ్యక్షులు అక్కెనపల్లి నాగేంద్రబాబు, మండల నాయకులు, పడిదల నిఖిల్, రమ్య, మౌనిక, సౌజన్య, పాల్గొన్నారు

## ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఎన్నికలు



**చర్చ, మణుగూరు:** ఎంపీడీవో కార్యాలయ పరిధిలో బుధవారం తెలంగాణ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సంఘం ఎన్నికలు శాంతియుతంగా జరిగాయి. అధ్యక్షుడిగా డోలి శ్రీనివాస్, కార్యదర్శులుగా కె. లూసి, నాగమణి, ఫైనాన్స్ సెక్రటరీగా టి.ఎస్.శాంతకుమారి, అసోసియేట్ సెక్రటరీ డి.ఎ.వి.ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్లుగా సిహెచ్. నరసింహారావు, హుస్సేనా ఖానం, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కే. శంకరయ్య, జాయింట్ సెక్రెటరీగా మోహన్, ప్రచార కార్యదర్శిగా జి. పాపయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా ఏ.జి.ఆర్. వెస్లీ, ఆర్. వెంకటేశ్వర్లు, మోహన్ రావు, జి. భూషణ్ రావు, అజరయ్య వ్యవహరించారు. ఈ సందర్భంగా పాత కమిటీ సభ్యులు కొత్తగా ఎన్నికైన కమిటీకి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. గతంలో తమ పదవీకాలంలో చేసిన సేవలను, సంఘం అభివృద్ధి కోసం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు డోలి శ్రీనివాస్ మాట్లాడుతూ సంఘం అభివృద్ధి, రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమం కోసం పాత కమిటీ చూపించిన మార్గంలోనే నడుస్తూ, మరింత సేవాతత్పరంగా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో సభ్యులు, రిటైర్డ్ పాల్గొన్నారు.

# అడవిలో గట్టు జాతర

**- భక్తులు అధిక పాల్గొన్న భక్తులు**

**- రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు**



**చర్చ, కరకగూడెం:** మండలంలోని సమత్ బట్టుపల్లి పంచాయతీలో దట్టమైన అడవిలో విస్తరించిన సమ్మక్క సారలమ్మ ఆలయం వద్ద కార్తీక పౌర్ణమి సందర్భంగా గట్టు జాతర అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ పుణ్యక్షేత్రానికి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకుంటున్నారు. రహదారి సౌకర్యాలు తక్కువగా ఉండటం వల్ల ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్లు, ఎడ్లబండ్ల సహాయంతో భక్తులు ఆలయాన్ని చేరుకుంటున్నారు. ఆహ్లాదకరమైన అడవి వాతావరణంలో సమ్మక్క సారలమ్మను దర్శించుకుంటే కోరిన కోరికలు తీరి, మానసిక శాంతి, ఆశీర్వాదం కలుగుతాయని స్థానిక భక్తుల నమ్మకం. కోయ జాతికి సంబంధించిన పోలేబోయిన వంశస్థులు ప్రతి ఏటా ఈ జాతరను నిర్వహిస్తుంటారు. తెల్లవారుజామున నుండి భక్తులు తులసి గద్దె వద్ద దీపాలు వెలిగించి, ఆలయాలలో ప్రత్యేక పూజలు చేస్తున్నారు. నదీ తీరాలలో ఆలయాల వద్ద పవిత్ర స్నానం చేసి, హారతులు సమర్పిస్తారు. ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్లు, ఎడ్లబండ్ల ద్వారా భక్తులు ఎన్నో ఇబ్బందులు పడుతూ కూడా ఆ ఆలయానికి చేరుకుంటున్నారు. దట్టమైన అడవిలో ఉండటం వల్ల భక్తులకు ప్రశాంతమైన వాతావరణంలో ఆలయ దర్శనం ఆనందదాయకంగా ఉంటుందని అక్కడికి వచ్చే భక్తులు అంటున్నారు. ఆలయం దగ్గరే ఉండే పుట్టలో పాలుపోసి భక్తులు తమ మొక్కలు చెల్లించుకుంటున్నారు

# గిరిజన ఉద్యమ కెరటం 'ధర్మ'

**- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని**



**చర్చ, సుజాతనగర్:** గిరిజనుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకోసం గుగులోత్ ధర్మ నిర్వహించిన ఉద్యమాలు నేటితరానికి ఆదర్శమని, ఆయనలేని లోటు తీర్చలేనిదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు, గిరిజన నేత గుగులోత్ ధర్మ ద్వితీయ వర్ధంతి సందర్భంగా సుజాతనగర్ మండలంలోని మంగపేట గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన ధర్మ విగ్రహావిష్కరణ, సంతాపసభలో అయన పాల్గొని మాట్లాడారు. గుగులోత్ ధర్మ ఉమ్మడి ఖమ్మం జిల్లా కమ్యూనిస్టు ఉద్యమాలకు దిక్సూచిలాంటివారని, ఎన్నో ప్రజా, రైతు, గిరిజనోద్యమాలకు నాయకత్వం వహించారని, ప్రజలకు ఒక్కతాటిపైకి తెచ్చి ప్రజా ఉద్యమాలు నిర్మించడం ద్వారా సమస్యల పరిష్కరంకోసం నిరంతరం శ్రమించాడని కొనియాడారు. అనంతరం విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, మండల నాయకులు భూక్యా దస్రు, కుమారి హన్మంతరావు, జక్కుల రాములు తదితరులు పాల్గొన్నారు

# నేడు సీనియర్స్ రెజ్లింగ్ జిల్లా జట్టు ఎంపికలు

**చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:** జిల్లా అమేచూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొత్తగూడెంలోని ప్రగతి మైదానం గ్రౌండ్ నందు గురువారం సీనియర్స్ రెజ్లింగ్ జిల్లా జట్టును ఎంపిక చేసేందుకు ఎంపికపోటీలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.కాశీ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన క్రీడాకారులు తెలంగాణ ఒరిజినల్ ఆధార్ కార్డుతో ఉదయం 10 గంటలకు గ్రౌండ్ నందు హాజరుకావాలని సూచించారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 8, 9 తేదీలల్లో హైదరాబాదులో జరగనున్న రాష్ట్రస్థాయి రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొనవలసి ఉంటుందని పేరొకన్నారు. వివరాలకు 9949761181 నెంబర్‌ను సంప్రదించవలసిందిగా కోరారు

# డైట్‌లో అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

**హనుమకొండ, నవంబర్ 5:**



హనుమకొండలోని ప్రభుత్వ విద్యాశిక్షణా సంస్థ(డైట్)లో ఖాళీగా ఉన్న కళలు-కళావిద్య-1, ఫిలాసఫీ/సోషియాలజీ/సైకాలజీ-1, పెడగోజి ఆఫ్ మ్యాథమెటిక్స్???-1 పోస్టులకు అతిథి అధ్యాపకులుగా(గెస్ట్ ఫ్యాకల్టీ) తాత్కాలిక విధానం ద్వారా భర్తీ చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్న ప్రిన్సిపాల్ ఎండీ అబ్దుల్‌హై తెలిపారు65 వయస్సు లోపు ఉన్న రిటైర్డ్, నిరుద్యోగ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని, ఆసక్తిగలవారు కాలేజీలో ఇచ్చే అప్లికేషన్ ఫారంను పూర్తిచేసి ఒక ఫొటో, విద్యార్హతలకు సంబంధించిన నిజపత్రాలను జతచేసి ఈనెల 7 నుంచి 13 వరకు సమర్పించాలన్నారు. 14న తుది జాబితా ప్రకటించి మెరిట్ ప్రాతిపదికన 1:5 నిష్పత్తిలో ఈనెల 15న డెమో/ఇంటర్వ్యూ నిర్వహించి జాబితా ప్రకటించబడుతుందన్నారు. ఈ జాబితా అభ్యర్థులు ఈనెల 17 నుంచి 2025-26 అకాడమిక్ సంవత్సరానికి గెస్ట్ ఫ్యాకల్టీగా డైట్ కాలేజీలో రిపోర్టు చేయాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

# ఇన్సూరెన్స్ అనేది ప్రతి ఒక్కరికి అవసరం

**- టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యే కూనంనేని**





**చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:** ప్రస్తుత కాలంలో ఇన్సూరెన్స్ అనేది ప్రతీ ఒక్కరికి అవసరమేనని, ఇన్సూరెన్స్ చేయించడం ద్వారా భవిష్యత్తులో జరిగే పరిణామాల వల్ల కుటుంబానికి ఆర్థిక భరోసా కలుగుతుందని కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. ఝాన్సీరాణి ఫైనాన్సియల్ సర్వీసెస్ సీఈవో, టాటా ఏఐఏ సీనియర్ బిజినెస్ అసోసియేట్ పి. కమలారాణి ఆధ్వర్యంలో చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీ నందు ఏర్పాటు చేసిన టాటా ఏఐఏ కార్యాలయాన్ని బుధవారం ముఖ్య అతిధగా హాజరైన కూనంనేని సాంబశివరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ ఇన్సూరెన్స్ రంగంలో టాటా కంపెనీ ప్రతీ ఒక్కరి నమ్మకాన్ని కలిగి ఉందని అన్నారు. ప్రతి ఒక్కరు జీవిత భీమా చేయించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇన్సూరెన్స్ రంగానికి మంచి భవిష్యత్తు ఉందని, నిరుద్యోగ యువత కూడా ఇన్సూరెన్స్ రంగంలో చేరి అభివద్ధి చెందవచ్చునన్నారు. భీమా అనేది జీవితానికి భీమా కల్పిస్తుందన్నారు. ఇటీవల వివిధ కారణాలతో మరణించి, టాటా కంపెనీలో ఇన్సూరెన్స్ చేయించిన వారి కుటుంబాలకు రూ. కోటి పరిహారం చెల్లించిన విషయాన్ని గుర్తుచేశారు. ఇన్సూరెన్స్ ద్వారా వచ్చిన డబ్బుల వల్ల ఇంటి పెద్ద దిక్కును కోల్పోయిన కుటుంబాలకు ఆర్థిక భరోసా కలిగిందన్నారు. కుటుంబంలో ఇంటి పెద్దదిక్కుతోపాటు ఇతరులకు కూడా అవకాశం ఉన్న మేరకు ఇన్సూరెన్స్ చేయించుకోవడం మంచిదని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్‌పాషా, టాటా ఏఐఏ సీనియర్ పార్ట్‌నర్స్ ఎస్. ముకుందరావు, పి. రాంగోపి, కొత్తగూడెం బ్రాంచి మేనేజర్ జక్కుల సతీష్, అసిస్టెంట్ బ్రాంచి మేనేజర్ వెంకటేష్ రాహుల్, లీడర్స్ నాగచందర్, గాయత్రి, దేవ్‌సింగ్, అడ్వైజర్స్ సామ్రాజ్యం, దేవరాజ్, పి.ప్రసాద్, రామారావు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

**- పర్యావరణాన్ని కాపాడండి...: నైనిక రజువా**

మనిషికి ఇన్సూరెన్స్‌తోపాటు ప్రాణవాయువు కూడా చాలా అవస రమని ప్రకతి ప్రేమికురాలు, హరితదీక్షాపరురాలు నైనిక రజువా అన్నారు. టాటా ఏఐఏ ఇన్సూరెన్స్ కార్యాలయం ప్రారం భం సందర్భంగా ముఖ్య అతిధులుగా హాజరైన ఎమ్మెల్యే కూన ంనేని సాంబశివరావుకు సింగరేణీయన్, హరిత దీక్ష వ్యవస్థా పకులు మొక్కల రాజ శేఖర్ అధ్వర్యంలో నైనిక మొక్కలు అందచేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్న వయస్సులోనే ప్రక తిని కాపాడటం కోసం దీక్ష చేపట్టడం అభిన ందనీయమన్నారు. నైనికకు మంచి భవిష్యత్తు ఉందని, తనను ఆదర్శంగా తీసుకుని ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని సూచించారు.

# ఇందిరా భవన్ కాంగ్రెస్ పార్టీ రెక్కల కష్టం

**- కార్యాలయ చరిత్ర నియోజకవర్గ ప్రజానీకానికి తెలుసు**

**- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఓరుగంటి బిక్షమయ్య**




**చర్చ, అశ్వాపురం:** కాంగ్రెస్ పార్టీ కార్యాలయం స్వాధీనంపై అశ్వాపురం మండల కాంగ్రెస్ కార్యాలయం ఓరుగంటి వీరయ్య భవన్‌లో బుధవారం పార్టీ మండల అధ్యక్షులు ఓరుగంటి బిక్షమయ్య నేతృత్వంలో బుధవారం విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నుండి గెలిచీ గెలవగానే పార్టీ కార్యాలయాన్ని కబ్జా చేయడానికి శ్రీకారం చుట్టిన ఘనత రేగా కాంతారావుదని, ఆరోజుల్లో రేగాకా ంతారావు అంటే కూడా ఎవరికీ తెలియని, కార్యకర్తలు కష్టపడి గెలిపిస్తే అన్నం పెట్టినొడికి సున్నం పెట్టినట్లు కార్యకర్తల కష్టాన్ని, ఆస్తిని దోచుకోవాలనుకున్నారని ఆరోపించారు. పాలిచ్చిన తల్లి రొమ్ముపై తన్నినట్లు కాంగ్రెస్ పార్టీని విడిచి నాటి టీఆర్ఎస్‌లోకి వెళుతూ, పార్టీకి ప్రతీకగా ఉన్న మణుగూరు ఇందిరా భవన్‌ను సైతం తెలంగాణ భవన్‌గా రంగులు మార్చి కబ్జా చేసిన ఘనుడు రేగ కాంతారావు అని ఎద్దేవా చేశారు. ఈ విషయం నియోజ కవర్గ ప్రజలకు తెలిసిన విషయమేనని అన్నారు. కార్యాలయం స్వాదీనం చేసుకునే విషయంలో కార్యకర్తల నిర్ణయం ముమ్మాటికీ సబబే అని, అన్యాయంగా ఆక్రమించిన కార్యాలయాన్ని తిరిగి స్వాధీనం చేసుకోడానికి సరైన సమయంకోసం ఇన్నాళ్లు వేచిచూశారని అన్నారు. ఇప్పటికైనా తమ ఆస్తి తమకు దక్కినందుకు కార్యకర్తలు ఆనందంలో ఉన్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ కార్యాల యంను తిరిగి స్వాధీనం చేసుకుంటామని అప్పట్లో కాంగ్రెస్ పెద్దలు స్పష్టం చేశారని, అది కార్యకర్తలు నెరవేర్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్ బాబు, బట్టా సత్యనారాయణ, లంకమల్ల కొండలరావు, గాదె వెంకటరెడ్డి, మాదినేని రాంబాబు, ఎక్కటి సత్యనారాయణ రెడ్డి, సబ్కా చిన వీరయ్య, కాకా రాములు, బచ్చు వెంకటరమణ, సోడి వెంకటేశ్వర్లు, తోట సత్యనారాయణ, కన్నెబోయిన నాగరాజు, బేతం బాబు, బొబ్బాల వీరన్న, వేముల విజయ్, మేకల అంజిబాబు, బూతం వెంకన్న, గొల్లపల్లి నరేష్, రావులపల్లి నరసింహారావు, మోసీన్, కోలా శశికాంత్, షారుక్ పాషా, మారం మల్లిఖార్జున రావు, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

# సిక్కు గురువులు సమాజ హితం , ధర్మ రక్షణ,స్థాపన కోసం పనిచేశారు

**- గురు గోవింద్ సింగ్ భారతీయ సంస్కృతి కోసం చేసిన సేవలు మరువలేనివి**

**- ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత కార్యకారిణి సభ్యులు బూర్ల దక్షిణామూర్తి**





**చర్చ :- కరీంనగర్** సిక్కుల మొదటి గురువు గురునానక్ దేవ్ నుంచి పదవ గురువు గురు గోవింద్ సింగ్ వరకు ప్రతి ఒక్కరూ సమాజ హితం, ధర్మ స్థాపన రక్షణ కోసం పనిచేశారని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ తెలంగాణ ప్రాంత కార్యకారిణి సభ్యులు బూర్ల దక్షిణామూర్తి తెలిపారు. గురు గోవింద్ సింగ్ జయంతిని పురస్కరించుకొని బుధవారం రోజున ఆర్ఎస్ఎస్ కరీంనగర్ విభాగ్ బాధ్యులు పట్టణంలోని గురుద్వారాను సంద ర్శించి , ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బూర్ల ద మాట్లాడుతూ సిక్కు గురువుల బోధనలన్నీ దేశ హితం కోసం కొనసాగాయన్నారు. సిక్కుల తొమ్మిదవ గురువు గురు తేగ్ బహదూర్ మత స్వేచ్ఛ కోసం అమరులయ్యారని తెలిపారు. ముఖ్యంగా పదవ గురువు గురు గోవింద్ సింగ్ బోధనలు ధైర్యం , సమానత్వం , నిస్వార్థ సేవల కోసం కొనసాగాయని ఆయన కొనియాడారు. గురు గోవింద్ సింగ్ భారతీయ సంస్కృతి , వారసత్వానికి, ధర్మ రక్షణ కోసం చేసిన సేవలు మరువలేనివన్నారు. గురు గోవింద సింగ్ ను సిక్కు మత నాయకుడిగా మాత్రమే కాకుండా భారతదేశ గొప్ప యోధు డిగా కీర్తించబడ్డారన్నారు. ముఖ్యంగా గురు గోవింద్ ను భారతీయ ఆధ్యాత్మిక నాయకుడిగా , భారతీయ సంస్కృతిలో ఒక భాగంగా ఆయనను చూస్తారని తెలిపారు. గురు గోవింద సింగ్ జీవితంవిషయాలలో ఎంతోమందికి స్ఫూర్తినిస్తుందని తెలిపారు.

# తనిఖీలకు ముందే తారు లేచింది

**- నాణ్యతకు తిలోధకాలు.. నాసిరకం పనులు**

**- మూడు నెలలకే కంకర తేలిన బిటి రోడ్డు**





**చర్చ, జగిత్యాల, నవంబర్ 5:** పదేండ్లకు పైగా మన్నికతో నిలిచి ప్రజలకు సేవలందించాల్సిన ఆ తారు రోడ్డు వేసిన మూడు నెలలుకే నాన్యత కోల్పోయి తారు లేచి గుంతలుగా మారిన సంఘటన జగిత్యాల పట్టణం లో చోటుచేసుకొంది. జగిత్యాల పట్టణంలోని మిషన్ కంపౌండ్ ముందు నుంచి విద్యానగర్ లోకి వెళ్లే దారిలో గత మూడు నెలల క్రితం టియుఎఫ్ఐడిసి నిధులలో నుంచి దాదాపుగా 20 లక్షలను బిటి రోడ్డు నిర్మాణం కోసం మున్సిపల్ కేటాయించినట్లు తెలిసింది. ఈ పనిని టెండర్లో ఓ మాజీ కౌన్సిలర్ భర్త ఛేజిక్కించుకొన్నట్లు తెలియగా గత మూడు నెలల క్రితం ఈ డాంబర్ రోడ్డు పనిని పూర్తి చేసినట్లు తెలిసింది. ఆనాటి నుంచి అవార్డు ప్రజల్లో ఈ రోడ్డు నాణ్యత పై అనేక అనుమానాలు మొదలయ్యాయి. అక్కడి ప్రజల అనుమానాలను నిజం చేస్తూ ఆ బిటి రోడ్డుపై వాహనాల రాకపోకలతో డాంబర్ లేచి కంకర తెలడం, గుంతలు పడడంతో స్థానికంగా విమర్శలు పెరిగాయి. ఓ పదేండ్ల పాటు ప్రజలకు వినియోగంలో వుండాల్సిన ఆ రోడ్డు వేసిన మూడు నెలల కే తారు పోయి, కంకర తెలడం తో స్థానికులు అధికారులు, ప్రజాప్రతినిధులపై మండి పడుతున్నారు.

**- బడా కాంట్రాక్టర్స్ చేయాల్సిన పనట**

పెద్ద పెద్ద కాంట్రాక్టర్స్, డాంబర్ మిక్సింగ్ యూనిట్ కలిగిన కాంట్రాక్టర్స్ చేయాల్సిన పనిని ఓ మాజీ కౌన్సిలర్ భర్త కాంట్రాక్టు చేపట్టడంతోనే స్థానికులు అనుమానాలు వ్యక్తం చేశారు. ఆ ప్రాంత ప్రజలు అనుకున్నట్లుగానే వేసిన కొద్ది రోజులకే రోడ్డు నాణ్యత రోజు రోజుకు తగ్గిపోతుండగా, ఈ పనికి చెందిన నాణ్యత ప్రమాణాల తనిఖీలకు ముందే ఈ రోడ్డు చెడిపోవడం విమర్శలు పెరిగాయి. దీనికి తోడు ఈ పనికి కేటాయించిన వర్క్ నిధుల్లో ఎక్కువ మొత్తాన్ని ఇప్పటికే మున్సిపల్ అధికారులు చెల్లించినట్లు సమాచారం. జిల్లా కేంద్రంలోనే ఇలాంటి నాసి రకం పనులను చేపడుతూ ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్న సంఘటన పై జిల్లా స్థాయి అధికారులు స్పందించి విచారణ జరిపించాలని స్థానికులు కోరుతున్నారు.

# టెన్త్ విద్యార్థులకు బండి సంజయన్న నజరానా

**- "మోదీ గిఫ్ట్" పేరుతో ఎగ్జామ్ ఫీజును చెల్లిస్తానని ముందుకొచ్చిన కేంద్ర మంత్రి బండి సంజయ్**

**- ప్రభుత్వ స్కూళ్లలో చదువుకునే 12 వేల మంది విద్యార్థులకు ఫీజు మొత్తం చెల్లించేందుకు అంగీకారం**

**-ఈ మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లకు లేఖ రాసిన బండి సంజయ్**




చర్చ :- కరీంనగర్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుకునే విద్యార్థులందరికీ శుభవార్త. ఈ ఏడాది టెన్త్ ఎగ్జామ్ ఫీజును పూర్తిగా చెల్లించేందుకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ముందుకొచ్చారు. ఈ మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లకు కేంద్ర మంత్రి లేఖ రాశారు. అధికార వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో 12,292 మంది విద్యార్థినీ, విద్యార్థులు పదో తరగతి చదువుకుంటున్నారు. వీరిలో కరీంనగర్ జిల్లాలో 4,847, సిరిసిల్ల జిల్లాలో 4059, సిద్దిపేట జిల్లాలో 1118, జగిత్యాల జిల్లాలో 1135, హన్మకొండ జిల్లాలో 1133 మంది విద్యార్థులున్నారు. వీరందరికీ పరీక్ష ఫీజు చెల్లించాలంటే రూ. 15 లక్షలకుపైగా ఖర్చవుతుంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులంతా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారే. వారిలో చాలా మంది విద్యార్థుల తల్లిదండ్రులు కూలీ పని చేసి బతికేటోళ్లు. పిల్లలకు పరీక్ష ఫీజు కూడా చెల్లించే పరిస్థితి లేదని తెలుసుకున్న బండి సంజయ్ తన నియోజకవర్గ పరిధిలోని ఆయా స్కూళ్లలో చదివే విద్యార్థుల ఫీజు మొత్తాన్ని చెల్లించాలని నిర్ణయించుకున్నారు. ఆ మొత్తాన్ని తన వేతనం నుండి చెల్లించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లకు లేఖలు పంపారు. వాస్తవానికి బండి సంజయ్ కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి పేద విద్యార్థులకు బాసటగా నిలుస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులతోపాటు సరస్వతి శిశు మందిరాల్లో చదువుకునే విద్యార్థులుసహా దాదాపు 20 వేల మందికి "మోదీ గిఫ్ట్" పేరుతో బ్రాండెడ్ సైకిళ్లను పంపిణీ చేశారు. అతి త్వరలోనే సర్కారీ స్కూళ్లలో 9వ తరగతి చదువుకునే విద్యార్థులకు సైతం సైకిళ్లను పంపిణీ చేస్తామని ప్రకటించారు. అట్లాగే వచ్చే ఏడాది విద్యా సంవత్సరం ఆరంభంలోనే 'మోదీ కిట్స్' పేరుతో విద్యార్థులందరికీ స్కూల్ బ్యాగ్, నోట్ బుక్స్, జామెట్రీ బాక్స్, పెన్ను, పెన్సిళ్లు, స్టీల్ వాటర్ బాటిల్ ను పంపిణీ చేయబోతున్నారు.

# సిపిఐ వందేళ్ల ఉత్సావాలకు శ్రమజీవుల విరాళం

చర్చ, కొత్తగూడెం: డిసెంబర్ 26న ఖమ్మం నగరంలో సిపిఐ శతవసంతల ముగింపు సందర్భంగా జరిగే బహిరంగ సభ, ఉత్సావాల జయప్రదం కోసం అన్నివర్గాల నుంచి సంపూర్ణ సహకారం అందుతోందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్‌పాషా తెలిపారు. ఉత్సావాల జయప్రదానికి తాము సైతం అంటూ పట్టణంలోని పెద్ద బజార్ హమాలీ వర్కర్స్ యూనియన్ సభ్యులు తమ శ్రమఫలితం నుంచి కూడబెట్టిన రూ. 1,00,116 లను బుధవారం కార్మిక అడ్డాలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషాకు అందించారు. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ కార్మికులు, శ్రామికులు, కర్షకులు, పేదవర్గాల జెండా ఎర్ర జెండానేని, వందేళ్లుగా ఎర్ర జెండాను మోస్తూ తమ సమస్యల పరిస్కారంకోసం అలుపెరగని పోరాటాలు చేస్తున్నారన్నారు. శ్రామికుల ఎర్ర జెండాను మరింత ఎరుపెక్కించి బలమైన ఉద్యమాలు నిర్మించడం ద్వారా ప్రజావ్యతిరేక పాలకుల మెడలు వంచాలని పిలుపునిచ్చారు. సిపిఐ వందేళ్ల ఉత్సావాల సందర్భంగా ఖమ్మంలో ఐదు లక్షల మందితో జరిగే బహిరంగ సభ, ఉత్సావాలను సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు కదలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కంచర్ల జమలయ్య, కార్యదర్శి గెడ్డాడు నగేష్, మాజీ కౌన్సిలర్ సత్యనారాయణాచారి, హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు పోరెడ్డి శ్రీనివాసరెడ్డి, తరాల రాజు, నీలం మొగలి, వెలిశాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.




# సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించండి

**- గని మేనేజర్ తో చర్చించిన ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్.**

చర్చ, రామగుండం : సింగరేణి సంస్థ రామగుండం ఏరియా వన్ ఆర్జీ వన్ జిడికె 11వ ఇంక్లైన్ లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్ గని మేనేజర్ ను కోరారు. బుధవారం గని మేనేజర్ ను కలిసిన అనంతరం మాట్లాడుతూ పని స్థలాల్లో గాలి సరఫరా సరిగా లేకపోవడం వల్ల కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, యాజమాన్యం మెరుగైన గాలి సరఫరా చేయకుండా కార్మికులను విధులు నిర్వహించాలని ఒత్తిడి చేయడం సరైంది కాదని అన్నారు. యాజమాన్యం స్పందించి గాలి సరఫరా మెరుగ్గా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా కార్మికుల కు తగినన్ని పని ముట్లు ఇవ్వడం లేదని, పని ముట్లు పూర్తి స్థాయిలో అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికులు విధులకు వెళ్ళే సమయంలో చైర్ కారు లు సరిపడా లేవని, పని చేసే స్థలాలకు వెళ్ళేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారని వెంటనే చైర్ కారుల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్పందించిన గని మేనేజర్ వారంలోగా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జి.ఎం.కమిటి సభ్యులు సిద్దమల్ల రాజు, పిట్ సెక్రటరీ నాయిని శంకర్, సహాయ కార్యదర్శి గొడిశల నరేశ్, నాయకులు ఎం చక్రపాణి తో పాటు మైన్స్, సేఫ్టీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.





# కార్తీక పౌర్ణమి ప్రత్యేక పూజలు









చర్చ, అశ్వారావుపేట:నియోజకవర్గ వ్యాప్తంగా కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని శైవ క్షేత్రాలు భక్తులతో కిక్కిరిశాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు కార్తీక స్నానమాచరించి దేవాలయాల్లో ప్రత్యేక దీపాలు వెలిగించి పూజలు చేశారు. గంగాజలం, బెల్లం, పాలు, తేనెతో పండ్లరసాలతో అభిషేకాలు చేస్తూ భక్తి భావంతో శివార్చన చేశారు. శివనామస్మరణతో ఆలయాల పరిసరాలు మార్మోగాయి. కార్తీక పౌర్ణమి కావడంతో పరమశివుని దర్శనానికి దేవాలయాల వద్ద భక్తుల రద్దీ కనిపించింది. భక్తులకు ఇబ్బంది కలగకుండా దర్శనం త్వరగా జరిగే విధంగా నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అనంతరం సాయంత్రం పెద్ద ఎత్తున మహిళలు దేవాలయాలకు చేరుకుని ఉసిరి చెట్టుకు , జమ్మి చెట్టు వద్ద దీపాలు వెలిగించి పూజలు చేశారు. దేవాలయ అధ్యక్షులు ఏర్పాటు చేసిన జ్వాలా తోరణం వద్ద పూజలు చేసి వెలిగించారు. హర నామ స్మరణతో ఆలయ ప్రాంగణం హోరెత్తింది.

# హుస్నాబాద్ పట్టణంలో శ్రీ రేణుక ఎల్లమ్మ కార్తీక పౌర్ణమి







సిద్దిపేట జిల్లా చర్చ:- పురస్కరించుకొని మహాగణపతి పూజ అమ్మవారికి కుంకుమ పూజ మంత్రపుష్పం పంచామృత అభిషేకం మొహం ఆశీర్వచనం తీర్థ ప్రసాద వితరణ మహా అన్నదాన కార్యక్రమం ఇట్టి కార్యక్రమంలో శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయ మాజీ చైర్మన్ పూదరి లక్ష్మీనారాయణ గౌడ్ అరుణ దంపతులు అన్నదానం చేయగా సింగిల్విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య ఆకుల వెంకన్న రజిత ఐరన్ శ్రీనివాస్ రెడ్డి అనిత చిత్తారి రవీందర్ పద్మ పచ్చిమట్ల రవీందర్ గౌడ్ సుమలత పొదరు చంద్రమౌళి పచ్చిమట్ల శ్రీకాంత్ గౌడ్ , పూదరి శ్రీనివాస్ గౌడ్ పెరుమాండ్ల నర్సాగౌడ్ వల్లపు రాజు పున్నసది దేవాలయ అర్చకులు తాటికొండ పరమేశ్వర శర్మ కొత్తకొండ దేవాలయ అర్చకులు వినయ్ శర్మ రవి శర్మ శ్రావణ్ శర్మ శశాంక్ శర్మ దేవాలయ సిబ్బంది నీల కుమారస్వామి పున్న హనుమంత్ గీకురు రమేష్ వీర రాజు భక్తులు పాల్గొన్నారు కార్యనిర్వహణాధికారి పి కిషన్ రావు రేణుక ఎల్లమ్మ దేవాలయం

# వరంగల్ నిట్‌లో ఉచిత 'గేట్' కోచింగ్

హనుమకొండ, నవంబర్ 5 : నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్)లోని ఎస్సీ,ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో ఉచిత గేట్ కోచింగ్ తరగతులు నిర్వహించనున్నట్లు నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి తెలిపారు. ఈ కోచింగ్ వరంగల్ నిట్ విద్యార్థులతో పాటు వరంగల్ పరిసర ప్రాంతాల్లోని ఇతర ఇంజినీరింగ్ కాలేజీల విద్యార్థులకు కూడా అందుబాటులో ఉంటుందని, ఈ తరగతులు అన్ని ఇంజినీరింగ్ శాఖలకు సంబంధించినట్లు పేర్కొన్నారు. కోర్సు 8 వారాలపాటు కొనసాగుతుందని, ఈనెల 17 నుంచి జనవరి 9 వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమం ఇంజినీరింగ్ విద్యార్థులు గేట్ పరీక్షకు సమర్థవంతంగా సిద్ధం కావడానికి సహాయప డుతుందన్నారు. ఆసక్తిఉన్న విద్యార్థులు అప్లికేషన్ ఫారం నింపి తరగతులకు హాజరుకావచ్చని, దరఖాస్తు ఫారం, నియమాలు, నిబంధనలు, మరిన్ని వివరాలకు వరంగల్ నిట్ అధికారిక వెబ్‌సైట్‌లో నోటిఫికేషన్ విభాగాన్ని సందర్శించాలని కోరారు. ఇతర వివరాలకు విద్యార్థులు వరంగల్ నిట్ ఎస్సీ, ఎస్టీ సెల్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

# సాగర హారతితో చక్కటి సాంప్రదాయానికి శ్రీకారం



**కృష్ణా జిల్లా, నవంబర్ 5:** కార్తీక పౌర్ణమి సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా భక్తులు నదీ స్నానాలు చేసి శివయ్యను దర్శించుకుంట ున్నారు. మహిళలు దీపాలకు వెలిగించి నదిలో వదులుతూ నదీ పూజలు చేస్తున్నారు. రాష్ట్రంలోని శివాలయాలు అన్నీ భక్తులతో కిటకిటలాడుతున్నాయి. హర హర మహాదేవ శంభో శంకర అంటూ ఆ దేవదేవుడిని స్మరించుకుంటు న్నారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా మంగిన పూడి బీచ్‌లో భక్తులు సముద్ర స్నానాలు చేస్తున్నారు. సాగర సుప్రభాత హారతితో మంత్రి కొల్లు రవీంద్ర సముద్ర స్నానాలను ప్రారంభించారు. ప్రముఖ వేదపండితులు విష్ణుభొట్ల సూర్యనారాయణ శర్మ ఘనాపాటి ఆధ్వర్యంలో సముద్రునికి ప్రత్యేక పూజలు చేశారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులతో కలిసి మంత్రి కొల్లు రవీంద్ర పవిత్ర సముద్ర స్నానం ఆచరించారు.అనంతరం మంత్రి మాట్లాడుతూ... సముద్ర స్నానాలకు విస్తృత ఏర్పాట్లు చేశామన్నారు. లక్ష మంది పైబడి భక్తులు వస్తారని అంచనా వేస్తున్నామని తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. సాగర హారతితో ఓ చక్కటి సాంప్రదాయానికి శ్రీకారం చుట్టామన్నారు. తీర ప్రాంతంలో పర్యాటక అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని అన్నారు. మంగినపూడి బీచ్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

# ధాన్యం కొనుగోలు డబ్బులు 24 గంటల్లోనే



**అమరావతి, నవంబర్ 5:** కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ముఖ్యమైన సంస్కరణ చేశామని.. రాష్ట్ర పౌరసరఫరాల శాఖలో రైతులను ఆదుకోవాలని నిర్ణయించామని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. అనేక సందర్భాల్లో ఏ విధంగా దళారులను ప్రోత్సహించినా పరిస్థితులను మార్చేందుకు కృషి చేశామన్నారు. రైతులతో మాట్లాడి ఈ పరిస్థితుల్లో మార్పులు తెచ్చేందుకు ప్రయత్నించామని చెప్పారు. తేమ శాతంలో పారదర్శకత లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడేవారన్నారు.ఈసారి ఖరీఫ్ మాసానికి 51 లక్షల మెట్రిక్ టన్నులు కొనేందుకు సిద్ధం అయ్యామని తెలిపారు. అంటే రూ.12,200 కోట్లు విలువైన ధాన్యం కొనుగోలుకు సిద్ధం అయినట్లు చెప్పారు. స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌ను.. 6 కోట్ల గోతాలను కూడా సిద్ధం చేసినట్లు తెలిపారు. కొన్ని సందర్భాలలో 6 నెలలు నుంచి 9 నెలలు వరకు బకాయిలు ఇవ్వలేదని గుర్తుచేశారు. రూ.1670 కోట్ల బకాయిలు గత ప్రభుత్వం వదిలి వెళ్ళిందన్నారు. 87 శాతం ధాన్యం కొనుగోలు డబ్బులు 48 గంటల్లో ఇచ్చామని తెలిపారు. ఈ సారి 24 గంటల్లోనే పేమెంట్ చేసేలా ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఉదయాన్నే 12, 2, 4, 7 గంటలకు ధాన్యం అమ్మినా రోజు వారికి పేమెంట్ చేస్తున్నామని.. అంటే కేవలం 2 గంటల్లోనే డబ్బు చెల్లిస్తామన్నారు. సెలవు రోజుల్లో మాత్రం తదుపరి రోజు చెల్లిస్తామని మంత్రి చెప్పారు. మాయిశ్చర్ రీడింగ్ వి బ్లూ టూత్ ద్వారా లెక్కించేలా చర్యలు తీసుకుంటామన్నారు. వాట్సప్ ద్వారా ధాన్యం కొనుగోలుకు అవకాశం ఇస్తున్నామని... ఈ సీజన్‌లో రైతులు ఇప్పటికే ఈ సౌలభ్యాన్ని వాడుతున్నారని తెలిపారు.నవంబర్‌లో 11 లక్షలు, డిసెంబర్‌లో 25లక్షలు, జనవరిలో 8 లక్షలు, ఫిబ్రవరిలో 3 లక్షలు, మార్చిలో మరో 4 లక్షలు మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు సిద్ధం అవుతున్నట్లు వెల్లడించారు. జనవరి నుంచి జిల్లా హెడ్ క్వార్టర్‌లలో గోధుమ కేజీ 18 రూపాయలకు అందించాలని చూస్తున్నట్లు తెలిపారు. దీపం 2 పథకం విషయంలో నవంబర్ 30 వరకు 3వ విడత కొనసాగుతుందని స్పష్టం చేశారు. మొంథా తుఫాను బాధితులకు పౌరసరఫరాల శాఖ నిత్యావసరాలు అందించిందన్నారు. ఇప్పటికే స్మార్ట్ కార్డ్‌లు 92 శాతం పంపిణీ పూర్తి అయిందని అన్నారు. నెలాఖరున మిగిలిన కార్డులు వెనక్కి తీసుకుని... మనమిత్ర యాప్ ద్వారా కోరిన వారికి పరిశీలించి ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. కౌలు రైతులకు 50 వేలు టారపాలిన్‌లు ఉచితంగా అందిస్తామని మంత్రి అన్నారు.చాలా జిల్లాల్లో ఈ క్రాప్ పూర్తి అయిందని.. అసలు గతంలో వారు ఎంతమంది దగ్గర నుంచి కొనుగోలు చేశారో ఆ పార్టీ నేత చెప్పాలని డిమాండ్ చేశారు. 39 లక్షల 51 వేల ఎకరాలు ధాన్యం కొనుగోలు ఈ క్రాప్ కింద నమోదు అయినట్లు తెలిపారు. 85 లక్షల మెట్రిక్ టన్నులు క్రాప్ వస్తుందని భావిస్తున్నామన్నారు. పంట నష్టం నమోదు చేసి అందించినప్పుడు ధాన్యం కొనుగోలు చేయరని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. నూటికి నూరు శాతం ఈ క్రాప్‌లో నమోదు అయిన ధాన్యాన్ని కొనుగోలు చేసి తీరుతామని స్పష్టం చేశారు. ఈ కేవైసీ చేయగా, నేషనల్ డెత్ రికార్డులో వివరాలు నమోదు చేయగానే డూప్లికేట్‌లు పోయాయన్నారు. తమవి కాని ఆస్తులు రేషన్ కార్డు జారీలో చూపిస్తున్న మాట నిజమే అని అదంతా లెగసీ వల్ల వచ్చిందని.. దీనిపై ముఖ్యమంత్రితో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కందిపప్పు విషయంలో ప్రైస్ ఇంటర్వెన్షన్ అవసరం లేదని భావిస్తున్నామన్నారు. గోధుమ 1 కేజీ కుటుంబానికి ఇచ్చే ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పీడీఎస్ రైస్ విషయంలో 5 నిముషాల్లో నిర్ధారణ చేసి సీజ్ చేసే అవకాశం ఉంటుందన్నారు.

# నో పోలీస్, నో పార్టీ ఓన్లీ పబ్లిక్ ఎమ్మెల్యే ఒంటరి పర్యటన




**కృష్ణా, నవంబర్ 5:** ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పెనమలూరు నియోజ కవర్గంలో ఒంటరిగా పర్యటన చేపట్టా ్టరు. సమ స్యలను ఒక్కరోజులో పరిష్కరించలేనని తనకున్న సమయంలో పరిష్కారం చూపుతానని ఎమ్మెల్యే చెబుతున్నారు. నో పోలీస్ . నో పార్టీ ఓన్లీ పబ్లిక్ అంటూ ఎమ్మెల్యే ఒక్కరే పర్యటన సాగించారు. (బుధవారం) కంకిపాడులో బుల్లెట్‌పై పర్యటిం చిన ఎమ్మెల్యే.. ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. ఈ క్రమంలో గ్రామంలో ప్రధానంగా రోడ్, డ్రైనేజ్ సమస్యను పరిష్కరించాలని బోడె ప్రసాద్‌కు ప్రజలు విజ్ఞప్తి చేశారు. అలాగే గత ప్రభుత్వం పెన్షన్ ఆపేసిందంటూ ఒకరిద్దరు ఫిర్యాదు చేశారు.ప్రజల సమస్యలు విన్న బోడె ప్రసాద్... అన్ని సమస్యలు ఒక్కసారి పరిష్కరించటం సాధ్యం కాదని స్పష్టం చేశారు. తనకు ఉన్న సమయంలో సమస్యలు అన్నీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఇప్పటికే మండల కేంద్రమైన కంకిపాడులో రూ. 2 కోట్లతో అభివృద్ధి చేశామని తెలిపారు. ప్రధాన రహదారికి ఇరువైపుల డ్రైన్ నిర్మాణంతో పాటు ప్రణాళిక బద్ధంగా గ్రామాభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చామని తెలిపారు. పలువురు స్థానికులు తనతో మాట్లాడారని... ఎమ్మెల్యే రావడం తమకు ఆనందంగా ఉందన్నారని తెలిపారు. గత ఐదేళ్లు వైసీపీ ఏమి చేయలేదని తమను మోసం చేసిందని వాపోయారని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు చెప్పకుండానే ఎమ్మెల్యే ఈ పర్యటన చేశారు. పార్టీ నాయకులు ఉంటే ప్రజలు తమ సమస్యలు చెప్పుకునేందుకు వీలు పడదని... అందుకే ఈ ఒంటరి పర్యటన అని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ చెప్పుకొచ్చారు.

# అలా వెళ్లిన ఏకైక నాయకుడు జగన్



**విజయవాడ, నవంబర్ 5:** మాజీ సీఎం వైఎస్ జగన్‌పై టీడీపీ నేత బుద్దా వెంకన్న తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. రైతుల పరామర్శ పేరుతో వారిపైనే జగన్ దండయాత్రలాగా వెళ్లారంటూ మండిపడ్డారు. రైతులపై ప్రేమ ఉంటే కట్ట మీద పొలాలు ఉన్న ప్రాంతంలో జగన్ పర్యటించాలని డిమాండ్ చేశారు. రైతులు ఓట్లు వేయలేదనే అక్కసుతోనే ప్రధాన మార్గంలో వెళ్లారని ఆరోపించారు. రైతుల కోసం వెళ్లిన జగన్‌కు మందీ మార్బలం ఎందుకు అని ప్రశ్నించారు. సీఎం చంద్రబాబుకు వార్నింగ్ ఇచ్చే అర్హత, స్థాయి జగన్‌కు ఉందా అని మండిపడ్డారురైతులపై కక్ష.'అసలు వ్యవసాయం గురించి నీకేం తెలుసు. నీ తాతది గ్రానైట్, నీ తండ్రి ఫ్యాక్షన్, వ్యాపారం, నీది దగా వ్యాపారం. అసలు జగన్‌కు స్క్రిప్ట్ ఇచ్చేది ఎవరో. చదివి చెప్పడం కూడా జగన్‌కు చేత కావడంలేదు. ఫసల్ బీమా కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి చెల్లిస్తున్నాయి. అసలు నువ్వు ముఖ్యమంత్రిగా ఏమీ తెలియకుండా ఐదేళ్లు ఉన్నావా. నీకు ఓట్లు వేయకపోతే రైతుల మీద కక్ష కడతావా' అంటూ ఫైర్ అయ్యారు.ఆనందంతోనే వెళ్లారు.సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లు రైతుల వద్దకు వెళ్లి పరామర్శ చేశారని చెప్పిన బుద్దా వెంకన్న.. జగన్ రైతుల వద్దకు పరామర్శకు వెళ్లి పూలు వేయించుకుంటారా అంటూ మండిపడ్డారు. ఎవరైనా చనిపోయిన వారి దగ్గరకు వెళ్లి కూడా ఇలాగే పూలు విసిరేయించుకుంటారంటూ విరుచుకుపడ్డారు. జగన్ పర్యటన ఆనందంతో వెళ్లినట్లుగా ఉంది కానీ.. పరామర్శకు వెళ్లినట్లు లేదంటూ వ్యాఖ్యలు చేశారు. వంద కార్లు, బైక్‌లు, జెండాలు, పెయిడ్ ఆర్టిస్ట్‌లతో పరామర్శకు వెళ్లిక ఏకైక నాయ ుడు జగన్ అంటూ ఎద్దేవా చేశారు.ఆ మాత్రం తెలీదా.జగన్.. రైతుల మీదకు దండయాత్రకు వెళ్లారని అన్నారు. ఓడించారనే అక్కసుతో హేళనగా చూసేందుకు వెళ్లారంటూ మండిపడ్డారు. తుఫాను సమయంలో అసలు జగన్ ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. చంద్రబాబు పవన్ కళ్యాణ్, లోకేష్ రాత్రింబవళ్లు ప్రజల కోసం పని చేశారని తెలిపారు. ప్రకృతి విపత్తులను ఆపగలమా... నష్టం తగ్గిస్తామా అని ప్రశ్నించారు. ఆ మాత్రం జగన్ తెలియదా అని ఫైర్ అయ్యారు. వరదల సమయంలో కోటి ఇస్తా అన్నారని.... ఎవరికి ఇచ్చారంటూ జగన్‌ను నిలదీశారు. దేశంలో అత్యధిక సంపన్నుడినని స్వయంగా జగనే అఫిడవిట్‌లో చెప్పారన్నారు. జగన్‌కు పేదలు అన్నా, రైతులు అన్నా చులకన భావమని అన్నారు. రైతులకు మేలు చేయాలని జగన్‌కు నిజంగా ఉంటే తుఫాను తగ్గిన సమయంలో వెళ్లేవారన్నారు. చంద్రబాబు తుఫాను హెచ్చరికల నుంచే అందరినీ అప్రమత్తం చేశారని.. నేతలను, అధికారులను క్షేత్ర స్థాయిలో పరుగెత్తించారని తెలిపారు. జగన్ విధ్వంసకర పాలన అందించారు కాబట్టే ప్రజలు ఇంట్లోకూర్చో పెట్టారని దుయ్యబట్టారు. చంద్రబాబు పడి లేచిన కెరటమని.. అలాంటి ఆయనకు జగన్ వార్నింగ్ ఇస్తారా అంటూ టీడీపీ నేత మండిపడ్డారు.

# భారీ పెట్టుబడులు, ఒప్పందాలకు విశాఖ వేదిక



**విశాఖపట్నం, నవంబరు5 :** ఉద్యోగాల కల్పనకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని విశాఖపట్నం ఇన్‌చార్జి మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామివ్యాఖ్యానించారు. ఎన్నికల మేనిఫెస్టోలో తాము ఇచ్చిన 20 లక్షల ఉద్యోగాలని కల్పించడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు చర్యలు చేపడుతున్నారని పేర్కొన్నారు. విశాఖపట్నంలో సాంకేతిక రంగంలో పెట్టుబడులకు ప్రోత్సాహం కల్పిస్తున్నామని స్పష్టం చేశారు మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి.ఆర్థిక కేంద్రంగా వైజాగ్ అభివృద్ధి చెందుతుందని ఉద్ఘాటించారు. బుధవారం ఏయూ ఇంజనీరింగ్ కాలేజ్ గ్రౌండ్‌లో విశాఖలో ఈ నెల 14,15వ తేదీల్లో జరిగే పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ ఏర్పాట్లను మంత్రి డీబీవీ స్వామి పరిశీ లించారు. మంత్రి వెంట ఎమ్మెల్యేలు, వెలగపూడి, వంశీకృష్ణ శ్రీనివాస్, విష్ణు కుమార్ రాజు, జిల్లా కలెక్టర్ అధి కారులు ఉన్నారు. ఈ సందర్భంగా మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి మాట్లాడారు. ఈ నెల 14,15వ తేదీల్లో ప్రతిష్టాత్మకంగా విశాఖపట్నంలో పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ జరుగుతుందని వివరించారు. ఈ భాగస్వామ్య సదస్సుకు ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోందని చెప్పుకొచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రులు, కేంద్రమంత్రులతో సహా 20 దేశాల నుంచి ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి.ఈ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ ద్వారా 9.8 లక్షల కోట్ల పెట్టుబడుల ఆహ్వానానికి అవకాశాలు ఉన్నాయని వివరించారు. భారీ పెట్టబడులు, ఒప్పందాలకు విశాఖ వేదిక కాబోతోందని ఉద్ఘాటించారు. ఈ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ ద్వారా సుమారు 410 ఒప్పందాలు జరుగుతాయని వెల్లడించారు. అలాగే, 7.5 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా తమ ప్రభుత్వం ముందుకెళ్తుందని నొక్కిచెప్పారు. భాగస్వామ్య సదస్సు సందర్భంగా ఒప్పందాలు, పరిశ్రమలకు శంకుస్థాపనలు కూడా జరుగుతాయని మంత్రి డోలా బాల వీరంజనేయ స్వామి పేర్కొన్నారు.డయాలసిస్ మిషన్లని ప్రారంభించిన మంత్రి డీబీవీ స్వామి.మరోవైపు. .విశాఖపట్నం కేజీహెచ్ ఆస్పత్రి నెఫ్రాలజీ విభాగంలో 9 హిమో డయాలసిస్ మిషన్లను మంత్రి డోలా బాల వీరంజనేయ స్వామి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే లు వంశీకృష్ణ శ్రీనివాస్, విష్ణుకుమార్ రాజు, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, కేజీహెచ్ వైద్యులు పాల్గొన్నారు. సీఎస్ఆర్‌లో భాగంగా ఎన్‌టీపీసీ రూ.2 కోట్ల వ్యయంతో 9 హిమో డయాలసిస్‌లని సమకూర్చింది. నెఫ్రాలజీ విభాగానికి 9 హిమో డయాలసిస్ మిషన్లను సమకూర్చిన ఎన్‌టీపీసీకి మంత్రి డీబీవీ స్వామి ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వైద్యానికి పెద్ద పీట వేస్తోందని ఉద్ఘాటించారు. ప్రభుత్వ ఆస్పత్రులను తాము బలోపేతం చేస్తున్నామని నొక్కిచెప్పారు. సంజీవిని పేరుతో హెల్త్ రికార్డులను డిజిటలైజేషన్ చేస్తున్నామని వివరించారు. పైలట్ ప్రాజెక్టు కింద కుప్పంలో సంజీవిని ప్రాజెక్టును ప్రారంభించామని వెల్లడించారు. కేజీహెచ్‌లో నెఫ్రాలజీ విభాగం ఉత్తమ సేవలను మంత్రి డోల బాలా వీరాంజనేయ స్వామి ప్రశంసించారు.

# ఏపీ వ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో ఏసీబీ సోదాలు




**అమరావతి, నవంబర్ 5:** ఏపీ వ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లోఏసీబీ సోదాలు చేపట్టింది. మొత్తం 120 చోట్ల ఏసీబీ తనిఖీలు కొనసాగుతున్నాయి. ఎన్టీఆర్ జిల్లా, కోనసీమ, ఏలూరు, ప్రకాశం, విశాఖ, నెల్లూరు, శ్రీసత్యసాయి జిల్లా, అన్నమయ్య జిల్లాల్లో ఏకకాలంలో రైడ్స్ జరుగుతున్నాయి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ఏసీబీ అధికారులు ఈ మేరకు సోదాలు చేపట్టారు. రిజిస్ట్రేషన్ పత్రాలు, రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు.. అనుమానాస్పదంగా ఉన్న ఫైళ్లను స్వాధీనం చేసుకున్నారు.ప్రకాశం జిల్లాలోని ఒంగోలు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఏసీబీ అధికారులు రావడం చూసిన కొంత మంది సిబ్బంది.. తమ తమ జేబుల్లో ఉన్న నగదు బయటకు విసిరేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోదాలు చేస్తున్నారు.విశాఖపట్నంలోని సబ్ రిజిస్టర్ కార్యాలయాలపై ఏసీబీ ఆకస్మిక తనిఖీలు చేపట్టింది. మధురవాడ, భోగాపురం, టర్నర్ చౌల్ట్రీతో పాటు సబ్ రిజిస్టర్ కార్యాలయాలపై ఏసీబీ సోదాలు చేస్తోంది. ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకే ఈ ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు సమాచారం.శ్రీ సత్యసాయి జిల్లాలోని చిలుమత్తూరు సబ్ రిజిస్టర్ కార్యాలయంపై ఏసీబీ అధికారులు రైడ్స్ చేశారు. ఇటీవల కాలంలో సబ్ రిజిస్టర్‌పై పలు ఫిర్యాదులు వెల్లడంతో ఏసీబీ రంగంలోకి దిగింది. కార్యాలయం తలుపులు మూసివేసి మరీ ఏసీబీ అధికారులు విచారణ జరుపుతున్నారు.ఎన్టీఆర్ జిల్లాలోని ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు నిర్వహించింది. సబ్ రిజిస్టర్ కార్యాలయంలో డాక్యుమెంట్స్ ఏసీబీ డీఎస్పీ బీవీ రావు తనిఖీ చేస్తున్నారు.

# జిల్లాల పునర్ వ్యవస్థీకరణపై ఏపీ ప్రభుత్వం స్పెషల్ ఫోకస్




**అమరావతి, నవంబరు5 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల పునర్ వ్యవస్థీకరణ పై స్పెషల్ ఫోకస్ పెట్టింది. ఇందులో భాగంగానే ఏపీ మంత్రి అనగాని సత్యప్రసాద్ నేతృత్వంలో అమరావతి సచివా లయంలో జిల్లాల పునర్ వ్యవస్థీకరణపై మంత్రుల బృందం(బుధవారం) సమావేశమైంది. ఈ భేటీకి మంత్రులు అనగాని సత్యప్రసాద్, నాదెండ్ల మనోహర్, నిమ్మల రామానాయుడు, బీసీ జనార్దన్ రెడ్డి, వంగలపూడి అనిత పాల్గొన్నారు. వర్చువల్‌గా మంత్రి నారాయణ, సత్య కుమార్ యాదవ్ ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై మంత్రులు చర్చిస్తున్నారు. ఈ నేపథ్యంలో గత జగన్ ప్రభుత్వ హయాంలో అశాస్త్రీయంగా జరిగిన జిల్లాల విభజనను సరిదిద్దడంపై మంత్రులు మాట్లాడుతున్నారు.జిల్లాల విభజన వల్ల ఉన్న ఇబ్బందులను తీరుస్తామని ఎన్నికల సందర్భంగా చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఇచ్చిన హామీ మేరకు జీవోఎం ఏర్పాటు చేసి కార్యాచరణ చేపట్టారు. ఇప్పటికే జీఎంవో ప్రాథమికంగా ఇచ్చిన నివేదికపై కొన్ని మార్గదర్శకాలు సీఎం చంద్రబాబు ఇచ్చిన విషయం తెలిసిందే. మండలాలు, పంచాతీయలు విభజన చేయకుండా నియోజకవర్గమంతా ఒకే డివిజన్‌లో ఉండాలని ఇప్పటికే జీఎంవో నిర్ణయించింది. మంత్రుల బృందం సమావేశమై తుది నివేదికను రూపొందించి సీఎం చంద్రబాబుకు మంత్రివర్గ ఉప సంఘం అందజేయనుంది. కేంద్ర ప్రభుత్వం చేయబోయే జనగణనకు ముందే నివేదిక ఇచ్చేందుకు జీవోఎం ప్రయత్నిస్తోంది. ఈ నెల 10వ తేదీన జరిగే కేబినెట్ సమావేశంలో జిల్లాల పునర్వ్యవస్థీకరణపై కీలక చర్చలు జరిపి మంత్రివర్గ ఉప సంఘం సిఫారసులకు ఆమోదం తెలిపే అవకాశాలు ఉన్నాయి.

# కార్తిక పౌర్ణమి సందర్భంగా తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ

**అమరావతి :** కార్తిక పౌర్ణమి సందర్భంగా తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. గోవిందుడిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు 18 కంపార్టుమెంట్లలో వేచిఉన్నారు. టోకెన్లు లేని భక్తులకు 18 గంటల్లో సర్వదర్శనం అవుతుందని టీటీడీ అధికారులు వివరించారు. నిన్న స్వామివారిని 67, 091 మంది దర్శించుకోగా 21,111 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల వల్ల శ్రీవారి హుండీకి రూ. 4.42 కోట్లు ఆదాయం ఎస్వీ గోశాలను పరిశీలించిన టీటీడీ ఈవోపరిశీలించారు. గోశాల నిర్వహణ, గోవులకు అందుతున్న దాణా, వసతి, వైద్యం, తాగునీరు, పరిశుభ్రత తదితర అంశాలను ఇన్‌చార్జి డైరెక్టర్ డి. పణికుమార్ నాయుడు వివరించారు. దాదాపు 500 గోవులకు ఆధునిక వసతులతో నిర్మిస్తున్న సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ భవనాన్ని, గోశాలలో గోవులు, పేయ దూడలు ఉంటున్న షెడ్లను పరిశీలించారు. గోశాలలో పశువుల సంఖ్య, దాణా మిక్సింగ్ ప్లాంటు, అగరబత్తిల యూనిట్ వంటి ఈవో పరిశీలించారు. గోశాల, అగరబత్తిల యూనిట్ లోని సిబ్బందితో ఈవో మాట్లాడారు.

# చంద్రబాబు ఎప్పుడు సీఎం అయినా తొక్కిసలాట జరుగుతూనే ఉంటాయి




ఏపీలో కూటమి ప్రభుత్వానికి బాధ్యత లేకుండా వ్యవహరిస్తుందని వైసీపీ నాయకుడు, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ ఆరోపించారు. ముఖ్యంగా చంద్రబాబుఎప్పుడు ముఖ్యమంత్రి అయినా కాశీబుగ్గ ఆలయం వద్ద జరిగిన తొక్కిసలాంటి ఘటనలు జరుగుతూనే ఉంటాయని విమర్శించారు.బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాశీబుగ్గ వేంకటేశ్వస్వామి ఆలయంలో తొక్కిసలాట జరిగి 9 మంది మృతి చెందితే ఆలయం ప్రైవేట్ ఆలయమని పేర్కొనడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని అన్నారు. ఎక్కువ మంది భక్తులు వస్తారని ప్రభుత్వానికి అంచనా లేదా అని ప్రశ్నించారు. తిరుపతి, సింహాచలం ఘటన నుంచి ప్రభుత్వం ఏం నేర్చుకుందని, ఎలాంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు.కూటమి ప్రభుత్వ పాలన వల్ల ప్రజల జీవన ప్రమాణాలు తగ్గిపోతున్నాయని విమర్శించారు. ప్రకృతి విపత్తు జరిగినప్పుడు ప్రభుత్వ విధానం బాధాకరంగా ఉందని వెల్లడించారు. తుపాను పంట నష్టంపై ప్రభుత్వానికి స్పష్టత లేదని విమర్శించారు. వైఎస్ జగన్ పాలనలో రైతులను అన్ని విధాలుగా ఆదుకున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వమే రైతులకు బీమా చెల్లించి పంట నష్ట పరిహారాన్ని అందజేసిందని గుర్తు చేశారు.ఇటీవల మొంథా తుపాను వల్ల అన్ని రకాల పంటల రైతులు తీవ్రంగా నష్టపోయారని, ఇప్పటివరకు ప్రభుత్వం నష్టపరిహారం ప్రకటించకపోవడం దురదృష్టకరమని ఆరోపించారు. లక్షలాధి కోట్లను అప్పులు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం రైతుల బీమాను ఎందుకు కట్టడం లేదని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందినప్పుడు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ ప్రతిపక్షాలపై నెపాన్ని వేస్తున్నారని మండిపడ్డారు.

# హరియాణాలో ఓటు చోరీ అవాస్తవం- రాహుల్ నాయకుడిగా ఉన్నంత కాలం కాంగ్రెస్ గెలవదు



**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ల చోరీ జరిగిదంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను బీజేపీ తిరస్కరించింది. రాహుల్ గాంధీ అర్థం లేని మాటలు మాట్లాడుతున్నారని, అవన్నీ అవాస్తవాలు అని కేంద్రమంత్రి కిరణ్ రిజిజు అన్నారు. వారి వైఫల్యాలను దాచుకోవడానకే ఇలాంటివి తప్పుడు వాదనలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని కించపరచడానికే ఎన్నికల కమిషన్‌పై ప్రశ్నలు లేవనెత్తారని తెలిపారు. రాహుల్ నాయకుడిగా ఉన్నంత కాలం కాంగ్రెస్ గెలవదని సొంత పార్టీ నేతలే చెబుతున్నారని అన్నారు. బీజేపీ, ఈసీ కలిసి ఓట్లు చోరీకి పాల్పడ్డారంటూ రాహుల్ గాంధీ వ్యాఖ్యలు చేసిన కొద్ది గంటలకే కిరణ్‌రిజిజు ఈ విధంగా స్పందించారు.ఓటింగ్, ఓటర్లతో సమస్య ఉంటే వారు ఎన్నికల కమిషన్, తర్వాత కోర్టుకు అప్పీల్ చేయాలి. కానీ వారు అలా చేయడం లేదు. కేవలం ప్రెస్ మీటింగ్ మాత్రమే నిర్వహిస్తున్నారు. మన సంస్థలను, ప్రజాస్వామ్యాన్ని అవమానిస్తున్నారు. రాహుల్ గాంధీ తన వైఫల్యాలను దాచి పెట్టడానికే ప్రెస్ మీటింగ్ ఉద్దేశం. బిహార్?లో గురువారం పోలింగ్ ఉంది. ఇంకా హరియాణా గురించి కథలు పంచుకుంటున్నారు. బిహార్‌లో కాంగ్రెస్‌కు ఏం మిగలలేదని, హరియాణా సమస్యను లేవతనెత్తడం ద్వారా దృష్టిని మళ్లించడానికి ప్రయత్నిస్తోన్నట్లు ఉంది. ప్రతిపక్ష నాయకుడిగా ఆయన తీవ్రమైన సమస్యలపై మాట్లాడాలి. ఇలాంటి అంశాలపై సమయం వృథా చేయకూడదని నేను ఆయనకు సలహా ఇస్తానుహరియాణా ఎన్నికల్లో బ్రెజిల్‌కు చెందిన ఓ మోడల్‌కు కూడా 22 ఓట్లు ఉన్నాయంటూ చేసిన వ్యాఖ్యలపై కిరణ్ రిజిజు మండిపడ్డారు. 'రాహుల్ ఒక విదేశీ మహిళ పేరు కూడా ప్రస్తావించారు. ఎన్నికల సమయంలో ఆయన విదేశాలకు వెళతారు. పార్లమెంట్ సమావేశాల జరగుతున్న సమయంలో కూడా ఆయన కంబోడియా, థాయిలాండ్ వంటి ప్రదేశాలను రహస్యంగా సందర్శిస్తారు. ఇప్పుడు, బిహార్? ఎన్నికల సమయంలో, ఆయన కొలంబియాకు వెళ్లారు. ఇలా విదేశాలకు వెళ్లినప్పుడు, అక్కడి నుంచి కొన్ని ఆలోచనలను తీసుకొస్తారు. వాటిని తన బృందానికి ఇస్తే వారు ఈ నిరాధారమైన కథనాలను సిద్ధం చేస్తారు. అందరి సమయాన్ని వృథా చేస్తారు. ఎన్నికల సయమంలో ప్రజల మధ్య ఉండరు. తన పార్టీ ఓడిపోయిన తర్వాత మాత్రం ఏడుస్తున్నారు' అని కిరణ్ రిజిజు వ్యంగంగా మాట్లాడార.కాంగ్రెస్ గెలవదని సొంత పార్టీ నేతలే చెప్పారు : కిరణ్ రిజిజు'రాహుల్ గాంధీ అణు బాంబు పేలుతుందని అంటున్నారు. కానీ ఆయన అణు బాంబు ఎప్పుడూ ఎందుకు పేలదు? ఆయన ఏ విషయాన్ని కూడా సీరియస్‌గా తీసుకోరు. హరియాణాలో కాంగ్రెస్ గెలవదని ఎన్నికలు సమయంలో సొంత పార్టీ నాయకురాలు కుమారి సెల్జా అన్నారు. కేవలం మూడు రోజుల క్రితం, హరియాణాకు చెందిన ఒక మాజీ మంత్రి కాంగ్రెస్‌కు రాజీనామా చేసి, సొంతపార్టీనే గెలవదని ప్రటకన చేశారు. సొంత నాయకులే కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పనిచేస్తు న్నందున హరియాణా కాంగ్రెస్ అధిపతి రావు నరేంద్ర సింగ్ కూడా పార్టీ పరిధిలో సమన్వయం లేదని అన్నారు. వారు ఇలా ఎలా గెలవగలరు వారి సొంత నాయకులు తమ వల్లే ఓడిపోతున్నామని ఒప్పుకున్నప్పుడు రాహుల్ గాంధీ చేస్తున్న వ్యాఖ్యలను ఎవరు నమ్ముతారు? పదే పదే ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత కూడా వారు ఎటువంటి గుణపాఠాలు నేర్చుకోరు. చాలా మంది కాంగ్రెస్ నాయకులు మమ్మల్ని ప్రైవేట్‌గా కలిసి నిరాశను వ్యక్తం పరిచారు. రాహుల్ గాంధీ తమ నాయకుడిగా ఉన్నంత కాలం కాంగ్రెస్? గెలవలేదని అంటున్నారు' కిరణ్ రిజిజు అన్నారు.

# హరియాణాలో 25 లక్షల ఓట్లు చోరీ లేదంటే మేమే గెలిచే వాళ్లం




**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. ఓట్ల చోరీ జరగకుంటే, 2024 హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ గెలిచి ఉండేదని ఆయన వ్యాఖ్యానించారు. ఆ ఎన్నిక ల్లో నకిలీ, డూప్లికేట్, బల్క్ ఓటింగ్ జరగబట్టే బీజేపీ గెలిచిందని ఆరోపించారు. గతంలో ఓట్ల చోరీకి సంబంధించి హైడ్రోజన్ బాంబు లాంటి సమాచారం తమ వద్ద ఉందని రాహుల్ చెప్పా రు. అయితే ఇప్పుడు హైడ్రోజన్ బాంబు లాంటి సమాచారంతో కూడిన డాక్యుమెంట్లను 'హెచ్' ఫైల్స్‌గా రాహుల్ అభివర్ణించారు. బీజేపీ ఓట్ల చోరీకి ఎన్నికల సంఘం సహక రిస్తోంది అనేందుకు 'హెచ్' ఫైల్స్ రుజువులుగా నిలుస్తాయని, అవి తమ చేతిలో ఉన్నాయన్నారు. 100 శాతం రుజువులతో తాను మాట్లాడుతున్నట్లు పేర్కొన్నారు. బుధవారం దిల్లీలోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు"సీఈసీ, ఇద్దరు ఎన్నికల కమిషనర్లు బీజేపీతో చేతులు కలిపారు"కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ)తో పాటు ఇద్దరు కేంద్ర ఎన్నికల కమిషనర్లు బీజేపీతో చేతులు కలిపి హరియాణాలో గెలిపించారని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఆ ఎన్నికల అధికారులు ప్రధాన మంత్రి నరేంద్రమోదీతో పొత్తు పెట్టుకున్నారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌ను ఓడించేందుకు 'ఆపరేషన్ సర్కార్ చోరీ'ని నిర్వహించారని ఆయన మండిపడ్డారు. ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాలని దేశంలోని జెన్-జీ యువతకు పిలుపునిచ్చారు. ఓట్లచోరీ ద్వారా జెన్-జీ నుంచి భవిష్యత్తును లాక్కుంటున్నారని ధ్వజమెత్తారు. ఇళ్లు లేని వాళ్లకు ఇంటి నంబరుగా జీరోను కేటాయిస్తామని దేశ ప్రజలకు సీఈసీ జ్ఞానేశ్ కుమార్ అబద్ధాలు చెబుతున్నారని, ఆ ఇళ్ల పేరుతో ఏం జరుగుతోందో ఇప్పుడు అందరికీ తెలిసిపోయిందని రాహుల్ పేర్కొన్నారు. డూప్లికేట్ ఓట్లను ఎందుకు తొలగించడం లేదని ఈసీని ఆయన ప్రశ్నించారు. ఒకవేళ వాటిని తొలగిస్తే ఎన్నికల్లో సరైన ఫలితం వస్తుందన్నారు.హరియాణాలో 25 లక్షల మంది ఫేక్ ఓటర్లే"2024 అసెంబ్లీ ఎన్నికల సమయానికి హరియాణాలో మొత్తం 2 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 25 లక్షల మంది ఫేక్ ఓటర్లే. ఒక బ్రెజీలియన్ మోడల్ ఫొటోతో ఓట్లను రిజిస్టర్ చేయించి, చాలా ఎన్నికల బూత్‌లలో ఓట్లు వేయించారు. ఈ లెక్కన ప్రతీ 8 మంది హరియాణా ఓటర్లలో ఒకరు నకిలీ ఓటర్లే. అంటే దాదాపు 12.5 శాతం మంది నకిలీ ఓటర్లు రాష్ట్రంలో ఉన్నారు. పోస్టల్ ఓట్లు, బూత్ ఓట్ల లెక్కల్లోనూ పెద్ద తేడాలు కనిపిస్తున్నాయి. దీనిపై మా పార్టీ దగ్గర స్పష్టమైన ఆధారాలు ఉన్నాయి. యావత్ హరియాణా రాష్ట్రంలో ఓట్ల చోరీ జరిగింది. అందుకే దానికి సంబంధించిన ఆధారాలకు హెచ్-ఫైల్స్ అనే పేరు పెట్టాం. ఒకే ఒక్క ఫొటోపై 223 ఓట్లను జారీ చేశారు. బ్రెజీలియన్ మోడల్ ఫొటోతో ఓ మహిళ 10 వేర్వేరు పోలింగ్ బూత్‌లలో 22 సార్లు ఓట్లు వేసింది. ఇంతకీ ఆమె ఎవరు ? ఆమె ఓట్లు వేసిన అసెంబ్లీ స్థానంలో కాంగ్రెస్ 22వేల ఓట్ల తేడాతో ఓడిపోయింది. ఇలాంటి 25 లక్షల ఓట్లు హరియాణాలో ఉన్నాయి" అని రాహల్ గాంధీ వివరించారు.జాతీయ స్థాయిలోనూ ఇలాగే జరిగి ఉండొచ్చు"హరియాణాలోని ఏదో ఒక్క అసెంబ్లీ నియోజకవర్గానికి ఈ ఓట్ల చోరీ ఉదంతం పరిమితం కాలేదని మాకు అనుమానం కలుగుతోంది. ఈ వ్యవహారం రాష్ట్రాల స్థాయిలో, జాతీయ స్థాయిలోనూ జరిగి ఉండొచ్చు. ఏదో అనుమానాస్పదంగా జరుగుతోందని హరియాణాలోని మా అభ్యర్థుల నుంచి 2024 అసెంబ్లీ ఎన్నికల టైంలో సమాచారం వచ్చింది. వాళ్లందరి అంచనాలు, అనుమానాలు నిజమని చివరకు తేలింది. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లోనూ మేం ఇలాంటి చేదు అనుభవాన్నే ఎదుర్కొన్నాం. అందుకే హరియాణాలో ఓట్లచోరీపై మేం పూర్తి ఫోకస్ పెట్టి యావత్ సమాచారాన్ని సేకరించాం. ఓట్లచోరీ వల్లే గెలవాల్సిన హరియాణాను మేం కోల్పోయాం" అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

# జనవరిలో గగన్‌యాన్ పరీక్ష 2035 నాటికి స్పేస్ ల్యాబ్



**న్యూఢిల్లీ :** మానవరహిత గగన్‌యాన్ ప్రాజెక్టుకు చెందిన కీలక విషయాన్ని ఇస్రోచైర్మెన్ వీ నారాయణన్ వెల్లడించారు. గగన్ యాన్ ప్రాజెక్టు సంబంధించిన పరీక్షను జనవరిలో నిర్వహించనున్నట్లు చెప్పారు. అంతరిక్షంలోకి మానవులను పంపాలని ఇస్రో ప్రయత్నాలు చేస్తున్న విషయం తెలిసిందే. దీని కోసం గగన్‌యాన్ ప్రాజెక్టును చేపట్టింది. అయితే స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన రాకెట్‌లో ఆస్ట్రోనాట్లను అంతరిక్షంలోకి పంపాలని ఇస్రో భావిస్తున్నది. ఈ ప్రయోగాన్ని 2027లో చేపట్టాలన్న సంకల్పంతో ఉన్నట్లు ఇస్రో చీఫ్ నారాయణన్ తెలిపారు.గగన్‌యాన్ ప్రాజెక్టులో భాగంగా అనేక పరీక్షలు జరుగుతున్నట్లు ఇస్రో చీఫ్ చెప్పారు. ఇప్పటికే ఆ మిషన్‌కు చెందిన సుమారు 8000 టెస్టులను నిర్వహించినట్లు ఆయన వెల్లడించారు. ఇవాళ ఢిల్లీలో జరిగిన ఎమర్జింగ్ సైన్స్, టెక్నాలజీ, ఇన్నోవేషన్ సదస్సులో ఆయన ఈ విషయాన్ని తెలిపారు. భూ కక్ష్యలోకి మానవులను పంపడానికి ముందు.. కనీసం మూడుసార్లు మానవరహిత పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు.భారతీయ అంతరిక్ష స్టేషన్‌కు చెందిన కీలక విషయాన్ని కూడా ఆయన వెల్లడించారు. 2028లో భారతీయ అంతరిక్ష స్టేషన్‌కు చెందిన ఫస్ట్ మాడ్యూల్‌ను లాంచ్ చేయనున్నట్లు ఇస్రో చీఫ్ చెప్పారు. మొత్తం అయిదు మాడ్యూల్స్‌ను నింగిలోకి పంపనున్నారు. ఫైవ్ మాడ్యూల్ ఆర్బిటాల్ ల్యాబ్‌ను 2035లో ఆపరేషన్‌లోకి తీసుకున్నట్లు నారాయణన్ తెలిపారు. భారతీయ స్పేస్ స్టేషన్ కనీసం 52 టన్నుల బరువు ఉండనున్నది. ముగ్గురు లేదా నలుగురు వ్యోమగాములు ఉండే రీతిలో దీన్ని నిర్మిస్తున్నారు. స్వల్ప కాలం ఆరుగురు ఉండే రీతిలో స్పేస్ స్టేషన్‌ను నిర్మించనున్నట్లు చెప్పారు.

# తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో 100 శాతం టీవీకేదే గెలుపు




**తమిళనాడు:** అధికార డీఎంకే పార్టీకి బలమైన ప్రత్యామ్నాయం టీవీకే అని ఆ పార్టీ చీఫ్ , సినీ నటుడు విజయ్ అన్నారు. వచ్చే ఏడాది తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన పోటీ డీఎంకే, టీవీకే మధ్యే ఉంటుందని తెలిపారు. ఆ పోరులో టీవీకే 100 శాతం గెలుపొందుతుందని ధీమా వ్యక్తం చేశారు. కరూర్ తొక్కిసలాట ఘటనపై ఏక సభ్య కమిషన్‌ను తొందపాటుగా నియవించడాన్ని ప్రజలు ప్రశ్నిస్తున్నారని వ్యాఖ్యానించారు. మహాబలిపురంలో టీవీకే పార్టీ ప్రత్యేక జనరల్ కౌన్సిల్ మీటింగ్‌లో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తొక్కిసలాట జరిగిన తర్వాత పార్టీ అనేక ఇబ్బందులను ఎదుర్కొంటుందని, కానీ ఇవన్నీ తాత్కాలికమేనని చెప్పారు. వీటన్నింటిని పరిష్కరించుకుందామని తెలిపారు. ప్రజల రూపంలో దేవుడు, ప్రకృతి మనతో ఉన్నారని, ఇంకెవ్వరూ మనల్ని ఆపరేలని అన్నారు. తొక్కిసలాట ఘటన తనను ఎంతో కలిచి వేసిందని చెప్పారు. జనరల్ కౌన్సిల్ మీటింగ్ ప్రారంభానికి ముందు తొక్కిసలాట మృతులకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. అంతకు ముందు ఈ సమావేశంలోనే 12 తీర్మానాలను పార్టీ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఇందులో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా విజయ్‌ను ఎన్నుకుంటూ చేసిన తీర్మానం కూడా ఉంది. ఎన్నికల్లో ఏ పార్టీతో పొత్తు పెట్టుకో వాలనే అంశంపై నిర్ణయాన్ని పూర్తిగా విజయ్‌కే అప్పగిస్తూ తీర్మానించింది. తమిళిగ వెట్రి కళగం పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఆ పార్టీ అధ్యక్షుడు, నటుడు విజయ్ పేరును ప్రకటించారు. బుధవారం ఉదయం తమిళనాడరాజధాని చెన్నై లోని పార్టీ కార్యాలయంలో జరిగిన 'టీవీకే స్పెషల్ జనరల్ కౌన్సిల్ మీటింగ్ లో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు తీర్మానం కూడా చేశారు.సెప్టెంబర్ 27న టీవీకే పార్టీ అధ్యక్షుడు, సినీనటుడు విజయ్ కరూర్‌లో నిర్వహించిన ప్రచార సభ తీవ్ర విషాదాన్ని నింపింది. విజయ్ ర్యాలీలో తొక్కిసలాటలో జరిగి 41 మంది మృతి చెందగా, మరో 60 మందికిపైగా గాయపడ్డారు. మద్రాసు హైకోర్టు ఆదేశాల మేరకు ఈ ఘటనపై దర్యాప్తును తొలుత సిట్ చేపట్టింది. అయితే, దీనిని సవాల్ చేస్తూ టీవీకే సుప్రీం కోర్టును ఆశ్రయించింది.టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్ సమక్షంలో ఈ సమావేశం జరిగింది. కాగా తమిళనాడులో గత కొన్ని దశాబ్దాలుగా ప్రాంతీయ పార్టీలదే హవా నడుస్తోంది. ముఖ్యంగా అధికార డీఎంకే, ప్రతిపక్ష అన్నాడీఎంకే పార్టీల మధ్యనే తరచూ అధికారం చేతులు మారుతూ వస్తున్నది. జాతీయస్థాయిలో ప్రధాన పార్టీలుగా ఉన్న బీజేపీ, కాంగ్రెస్‌లకు తమిళనాడులో పెద్ద ప్రాధాన్యం లేదు. ఈ క్రమంలో విజయ్ సొంతంగా పార్టీ పెట్టి.. అసెంబ్లీ ఎన్నికల్లో అధికారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. సిట్‌పై తమకు నమ్మకంలేదని, ఈ ఘటనపై దర్యాప్తునకు ఆదేశించాలని కోరింది. పిటిషన్‌పై విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం దర్యాప్తు బాధ్యతను సీబీఐకి అప్పగిస్తూ మధ్యం తర ఉత్తర్వులు ఇచ్చింది.కాగా, ప్రస్తుతం ఈ కేసును దర్యాప్తు చేస్తున్న సీబీఐ అధికారులు బాధిత కుటుంబాలు, ప్రత్యక్ష సాక్షులతోపాటు స్థానికుల నుంచి వాంగ్మూలాలను సేకరిస్తున్నా రు. తాజాగా సోమవారం సీబీఐ అధికారులు తమిళగ వెట్రి కళగం ప్రధాన కార్యాలయానికి వెళ్లినట్లు తెలుస్తోంది. తొక్కిసలాట ఘటన జరిగిన సందర్భంలో పార్టీ ప్రచారానికి హాజరైన నేతలకు సంబంధించిన వివరాలు, కార్యక్రవ నికి సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్‌ను అధికా రులు స్వాధీనం చేసుకున్నట్లు టీవీకే పార్టీ నేత నిర్మల్ కుమార్ వెల్లడించారు. ఇంకా పలువురు నేతలను కూడా వారు విచారించినట్లు సమాచారం. ప్రచార సమయంలో తొక్కిసలాటకు గల కారణాలు తెలుసుకోవడానికి సీబీఐ అధికారులు అధునాతన 3లేజర్ స్కానింగ్ టెక్నాలజీని ఉపయోగిస్తున్నట్లు సంబంధిత వర్గాలు వివరించాయి. మరోవైపు ఈ ఘటనపై క్షుణ్ణంగా దర్యాప్తు జరపడానికి దాదాపు 306 మందిని విచారించనున్నామ ని, వారందరికీ సమన్లు జారీ చేశామని అధికారులు తెలిపారు.

# ఉత్తరప్రదేశ్‌లో ఘోర ప్రమాదం రైలు ఢీకొని ఆరుగురు మృతి



**ఉత్తరప్రదేశ్:** మిర్జాపూర్ చునార్ జంక్షన్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. రైల్వే పట్టాలు దాటుతున్న కొందరి ప్రయాణికులను వేగంగా వచ్చిన రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆరుగురు అక్కడికక్కడే మృతిచెందగా.. పలువురికి గాయాలయ్యాయి. సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు.మృతులు గంగానదిలో పవిత్ర స్నానాలు ఆచరించడానికి చోపాన్ ప్రాంతం నుంచి వారణాసికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. వారు ప్యాసింజర్ రైలులో చునార్ రైల్వేస్టేషన్‌కు చేరుకొని పట్టాలు దాటుతుండగా వారిని రైలు ఢీకొట్టినట్లు పేర్కొన్నారు. ఈ ప్రమాదంపై యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. ఎస్‌డిఆర్ఎఫ్, ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలను ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని అధికార యంత్రాంగాన్ని సీఎం యోగి ఆదేశించారు.

# ఓట్ల చోరీతో ప్రభుత్వ ఏర్పాటుకు ఎన్డీయే కుటిల యత్నం




**బీహార్:** బీహార్‌లో ఓట్ల చోరీకి పాల్పడి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ఎన్డీయే కూటమికుటిలయత్నం చేస్తున్న దని కాంగ్రెస్ అగ్ర నాయకు రాలు, వాయనాడ్ ఎంపీప్రియాంకాగాంధీ వాద్రా అన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివి జన్ పేరుతో బీహార్‌లో మహిళలు సహా 65 లక్షల మంది ఓట్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించారని విమర్శించారు. బీజేపీ పాలనతో ప్రజలు విసిగిపోయారని, అందుకే ఎన్నికల్లో ఎలాగైనా గెలిచేందుకు పూర్తిగా ఓట్ల చోరీలో మునిగిపోయిందని ప్రియాంక ఆరోపించారు. బీహార్‌లో రెండో విడత అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వెస్ట్ చంపారన్ జిల్లాలో ఆమె ఇవాళ ప్రచారం నిర్వహించారు. వాల్మీకి నగర్, చన్‌పాటియాల్లో ఏర్పాటు చేసిన బహిరంగసభల్లో ప్రసంగించారు.దేశంలో ప్రస్తుత ఎన్డీయే పాలన బ్రిటిష్ పాలనను తలపిస్తోందని ప్రియాంకాగాంధీ విమర్శించారు. ఎన్డీయే తీరు చూస్తుంటే భవిష్యత్తులో దేశంలో అసలు ఎన్నికలు జరుగుతాయో, జరుగవోనని అనుమానంగా ఉందని ఆమె చెప్పారు.

# రాహుల్ ఓట్ల రిగ్గింగ్ ఆరోపణలను తోసిపుచ్చిన ఈసీ




**హర్యానా:** ఓట్ల రిగ్గింగ్ జరిగిందని కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపణ లను కేంద్ర ఎన్నికల కమిషన్ వర్గాలు తోసిపుచ్చాయి. ఓటర్ల జాబితాపై ఎలా ంటి అప్పీల్స్ దాఖలు కాలేదంటూ ఈసీ అధికారులను ఉటంకిస్తూ ప్రముఖ వార్తా సంస్థ పీటీఐ కథనం తెలిపింది. ఫేక్ ఓటర్లను నివారించాలంటే కాంగ్రెస్ బూత్ స్థాయి ఏజెంట్లు సవరణ సమయ ంలో ఎందుకు అభ్యంతరాలు లేవనెత్త లేదని ఈసీ వర్గాలు ప్రశ్నించాయి. ఓటింగ్ ప్రక్రియను పర్యవేక్షించేందుకు, అవకతవకలను గుర్తిం చడానికి రాజకీయ పార్టీలు బూత్ స్థాయి ఏజెంట్లను కూడా నియమిస్తాయని గుర్తు చేశారు.గత హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి అనుకూలంగా రిగ్గింగ్ జరిగిందని రాహుల్ గాంధీ బుధవారం విలేకరుల సమావేశంలో ఆరోపించారు. ఎన్నికల కమిషన్, బిజెపి కుట్రపూరితంగా వ్యవహరిం చాయని. హర్యానాలో 2.5 మిలియన్ల ఓట్లు చోరీకి గురయ్యాయని వ్యాఖ్యానించారు. అందులో 5.21లక్షల నకిలీ ఓటర్లు, 93,174 చెల్లని ఓటర్లు, 19.26 లక్షల బల్క్ ఓటర్లు ఉన్నారని రాహుల్ పేర్కొన్నారు. హర్యానా, ఉత్తరప్రదేశ్ రెండింటిలోనూ బీజేపీతో సంబంధం ఉన్న వేలాది మంది ఓటు వేశారని ఆరోపించారు.

# 7వ తేదీ నుంచి ఆపరేషన్‌లోకి నిసార్ ఉపగ్రహం



**న్యూఢిల్లీ:** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) చైర్మెన్ వీ నారాయణన్ కీలక అప్‌డేట్ ఇచ్చారు. అమెరికాకు చెందిన నాసాతో కలిసి సంయుక్తంగా అభివృద్ధి చేసి ప్రయోగించిన నిసార్ ఉపగ్రహంనవంబర్ 7వ తేదీ నుంచి ఆపరేషన్‌లోకి వస్తుందన్నారు. నాసా-ఇస్రో సింథటిక్ అపార్చర్ రేడార్(ఎన్ఐఎస్ఏఆర్) అత్యంత ఖరీదైన ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్. భూ గ్రహంపై ఉన్న మంచు కేంద్రాలను ప్రతి 12 రోజులకు రెండుసార్లు మానిటర్ చేసే సామర్థ్యం ఆ ఉపగ్రహానికి ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.జూలై 30వ తేదీన జీఎస్ఎల్వీ రాకెట్ ద్వారా సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి ఆ శాటిలైట్‌ను ప్రయోగించారు. నిసార్ బరువు సుమారు 2400 కేజీలు. డేటా సమీకరణ పూర్తి అయ్యిందని, నవంబర్ 7వ తేదీన జరిగే భేటీలో శాటిలైట్‌ను అపరేషనల్‌గా ప్రకటించనున్నట్లు నారాయణన్ అన్నారు. ఎమర్జింగ్ సైన్స్, టెక్నాలజీ, ఇన్నోవేషన్ కాన్‌క్లేవ్ సదస్సులో ఆయన ఈ విషయాన్ని తెలిపారు.నిసార్ శాటిలైట్‌లో రెండు సార్ సిస్టమ్స్ ఉన్నాయి. ఒకటి ఎల్ బ్యాండ్. మరొకటి ఎస్ బ్యాండ్ సెన్సార్. ఎల్ బ్యాండ్ రేడార్.. అడవును స్కాన్ చేసి అక్కడ నేత సాంద్రతను, ఫారెస్ట్ బయోమాస్, ఐస్ సర్ఫేస్‌ను అంచనా వేస్తుంది. ఇక ఎస్ బ్యాండ్ రేడార్.. వ్యవసాయ, గ్రాస్‌ల్యాండ్ ఎకోసిస్టమ్, మంచు తేమను స్టడీ చేయనున్నది. మేఘాలు, హిమపాతం నుంచి రెండు సిస్టమ్‌లు డేటాను సేకరిస్తాయన్నారు. నిసార్ అందించే డేటా అసాధారణమైందని, ప్రతి 12 రోజులకు ఓసారి భూమిని స్కాన్ చేయవచ్చు అని, ఈ శాటిలైట్ చాలా ఉపయుక్తంగా ఉంటుందని నారాయణన్ అన్నారు.

# చిన్నారులకు ఏది ఇష్టం... ఏది కష్టం...?

నెలల వయసు నుంచి స్కూల్ వయస్సు వరకు పిల్లలకు పోషకాహారం చాలా అవసరం. కొన్ని రకాల పదార్థాలంటేనే చిన్నారులకు మక్కువ. కొన్ని అంటే మొహం తిప్పుకుంటారు. ఇక్కడ ఏదన్నది కాదు ముఖ్యం వారికి అందాల్సిన పోషకాలు అందుతున్నాయా? లేదా? అన్నది తల్లిదండ్రులు చూసుకోవాల్సిన అంశం. ఈ నేపథ్యంలో ఏ వయసులో ఏ ఆహారం అందించొచ్చన్నది, పోషకాహార, వైద్య నిపుణుల సూచనలు ఎలా ఉన్నాయన్నది తెలుసుకుందాం.

### పసిపిల్లలు

వీరికి ఈ వయసులో తల్లిపాలు లేదంటే ఫార్ములా మిల్క్ లేదంటే రెండూ కలిపి ఇవ్వొచ్చు. దాదాపుగా అన్ని పోషకాలు తల్లి పాల నుంచి అందుతాయి. కానీ, విటమిన్ డి తగినంత అందదు. అందుకే వీరిని ప్రతీ రోజూ సూర్యోదయం సమయంలో కొంత సమయం పాటు ఎండలో ఉంచితే విటమిన్ డి అందు తుంది. లేదంటే విటమిన్ డి చుక్కల మందు రూపంలో అందించాలి. అలానే ఐరన్ కూడా వీరికి తగినంత అందదు. అందుకే వైద్యులు ఐరన్, జింక్, విటమిన్స్ కూడిన డ్రాప్స్ ను సూచిస్తుంటారు. పిల్లలకు పాలిచ్చే తల్లులు పూర్తి పోషకాహారాన్ని తీసుకోవడంపై శ్రద్ధ పెట్టాలి. ఎందుకంటే వారి నుంచే పిల్లలకు పోషకాలు అందాలి కనుక. తగిన పోషకాహారం తీసుకోవడం వల్ల బ్రెస్ట్ మిల్క్ తగినంత ఉత్పత్తి ఉంటుందని ఎన్నో పరిశోధనలు చెబుతున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గదర్శకాల మేరకు శిశువులకు ఆరు నెలల వరకు తల్లిపాలు మినహా మరేమీ ఇవ్వకూడదు. పిల్లలకు రెండో ఏడాది ముగిసే వరకు బ్రెస్ట్ ఫీడింగ్ ను కొనసాగించాలి. ఆరు నెలల వయసులో శిశువులు ఘన ఆహారాన్ని తీసుకునేందుకు సిద్ధంగా ఉంటారు. కనుక వారికి రైస్, ఉడికించిన పండ్లు, కూరగాయలు ఇవ్వాలి. ఏడాది వయసుకు వచ్చిన తర్వాత సాధారణంగా ఇంట్లో తినే ఆహార పదార్థాలను ఒక్కొక్కటి యాడ్ చేయాలి. పిల్లలకు ఈ వయసు నుంచే రుచి తెలుస్తుంది. మంచి ఆహార అలవాట్లకు పునాది పడేది ఇప్పుడే. కొన్నింటి విషయంలో మొహం తిప్పుకుంటుంటే వాటిని పక్కన పెట్టేయకండి. అలా చేస్తే అది జీవితాంతం నిషేధ పదార్థంగా ఉండపోవచ్చు. ఒకవేళ ఏదైనా ఆహార పదార్థం సరి పడడం లేదని భావిస్తే పిల్లల వైద్య నిపుణు లకు తెలియజేస్తే వారు తగిన సూచనలు చేస్తారు.

### ఎంత మేర?

పిల్లలు ఆకలి ఉన్నంత మేర తింటారు. కొంత తిన్న తర్వాత వద్దు అని ముఖం తిప్పుకుంటున్నారంటే వారి కడుపునిండినట్టుగానే అర్థం చేసుకోవాలి. పిల్లలు పెరిగేకొద్దీ వారిలో ఆకలి కూడా అలానే పెరగడం సహజంగానే జరుగుతుంది. ఒకవేళ పిల్లలు సరిగా ఆహారం తినడం లేదని మీరు గమనిస్తే ఆ విషయాన్ని పోషకాహార నిపుణుల దృష్టికి తీసుకెళ్లాలి. అలాగే, బరువు తగ్గుతూ ఉన్నా ఉపేక్షించ కుండా వైద్య నిపుణుల సలహా తీసుకోవడం తప్పనిసరి.

### అన్ని రుచులు

కొత్త ఆహార పదార్థాలను రుచి చూసేలా చిన్నారులను ప్రోత్సహించాలి. పండ్లు, ఆకు కూరలు, గుడ్లు, కూరగాయలు, యోగర్ట్ లేదా పెరుగు ఇవి చాలా కీలకం. వీటిని పిల్లలు అవాయిడ్ చేయకుండా చూసుకుంటే చాలు. ఏడాది వయసు నుంచి పిల్లలు తోటి కుటుంబ సభ్యులు తినే వాటినే అనుసరిస్తుంటారు. కనుక కుటుంబ సభ్యుల ఆహార అలవాట్లు వారిపై ప్రభావం చూపిస్తాయి. శిశువుల ఆహారం విషయంలో జాతీయ శిశు సంక్షేమ శాఖ మార్గదర్శకాల కోసం ఈ లింక్ ను సందర్శించొచ్చు.

### ఏడాది తర్వాత...

ఎదిగే వయసు కనుక పాలు సరిపడా ఉండేలా చూసుకోవాలి. తల్లిపాలే సరిపోవు కనుక విడిగా పాలు కూడా ఇవ్వాల్సి ఉంటుంది. ఎముకలు, దంతాలకు క్యాల్షియం చాలా అవసరం. శరీర నిర్మాణంలో కండరాలతోపాటు ఎముకలకూ అంతే ప్రాధాన్యం ఉంటుంది. ఒకవేళ పాలతో అలర్జీ ఉండి, పిల్లలు తీసుకోకపోతే సోయా మిల్క్, క్యాల్షియంతో కూడిన పండ్ల రసం, రైస్, ఓట్ మీల్ ఇవ్వాలి. ఈ వయసులో వైద్యులు క్యాల్షియం సప్లిమెంట్లను కూడా సూచించొచ్చు. అలాగే, పీచు పదార్థం చాలా అవసరం. ఇచ్చే ఆహారంలో ఇది తగినంత ఉండాలి.

### తక్కువ ఫ్యాట్

పిల్లలకు ఫ్యాట్ అవసరమే కానీ పరిమితి దాట కూడదు. అందుకే తక్కువ ఫ్యాట్ ఉన్న ఆహారం ఇస్తే సరిపోతుంది. అలాగే, తక్కువ శాచురేటెడ్ ఫ్యాట్,ట్రాన్స్ ఫ్యాట్ ఉండేలా శ్రద్ధ వహించాలి.

### ఐదేళ్ల తర్వాత శారీరక వృద్ధి

పిల్లలకు ఐదేళ్ల వయసు నాటికి వారిలో మెదడు పూర్తిగా అభివృద్ధి చెందుతుంది. ఐదో ఏట నుంచి వారిలో అసలైన శారీరక వృద్ధి మొదలవుతుంది. ఇందుకోసం వారిలో తగినంత రక్త సరఫరా జరిగేందుకు వీలుగా ఐరన్ సప్లిమెంట్లను ఇవ్వాలి. కానీ, తల్లిదండ్రులు నేడు సహజ ఆహారానికి బదులు ప్రాసెస్డ్ ఆహార పదార్థాలైన బిస్కట్లు, శాండ్ విచ్ లు, నూడుల్స్ (ఇవన్నీ ప్రాసెస్ చేసినవి, వేయించినవి), కాండీలు, చాక్లెట్లు ఇవ్వడం జరుగుతోంది. వీటి వల్ల



ట్రాన్స్ ఫ్యాట్ పిల్లలకు ఎక్కువ అందుతుంది. ఫలితంగా వారి శారీరక వృద్ధికి తీవ్ర హాని కలుగుతోందని ప్రముఖపోషకాహార నిపుణులు డాక్టర్ సువర్ణ పాఠక్ తెలిపారు. అలాగే, పిల్లలకు సరైన విటమిన్స్, ముఖ్యమైన పోషకాలు అందవు. ఇది కూడా వారిలో గ్యాస్ట్రో ఇంటెస్టినల్, పేగు సంబంధిత సమస్యలకు దారి తీస్తుంది. సాధారణంగా పిల్లల్లో విటమిన్ డి3 (ఎముకలకు),బి3(నరాలకు),బి12 (కండరాలకు),ఐరన్(రక్తానికి)చాలా అవసరం. పిల్లలు ఎదిగే క్రమంలో వారికి విటమిన్లు, మినరల్స్ తో కూడిన ఆహారం అందించే శ్రద్ధ తీసుకోవాలి. కనీస పోషకాలైన క్యాల్షియం, ప్రొటీన్స్, ఐరన్, విటమిన్స్ తో కూడిన సమతులాహారాన్ని అందించాలని డాక్టర్ సువర్ణ పాఠక్ సూచన.

### హెల్తీ బ్రేక్ ఫాస్ట్

నేటి కాలం పిల్లలకు స్కూల్, క్రీడలు, ట్యూషన్స్, అదనపు ప్రావీణ్యాల్లో శిక్షణ వంటి వాటితో వారిలో ఉన్న శక్తి అంతా ఆవిరైపోతోంది. అందుకే ఈ అంశాలన్నింటినీ దృష్టిలో ఉంచుకుని పోషకాహార నిపుణులు డాక్టర్ గీతా ధర్మట్టి పలు రకాల ఆహార మెనూలను తెలియజేస్తున్నారు. 1.బ్రెడ్ స్లయిస్, దోశ, అటుకులు, అన్ని రకాల అల్పాహారాలు. 2.పాలు,పాల పదార్థాలు, గుడ్లు, సోయా మిల్క్, గుడ్లు ఏ రూపంలో అయినా తీసుకోవచ్చు. పాలు రోజూ 150 ఎం ఎల్.పెరుగు రోజూ 100 గ్రాములు. పనీర్, చీజ్3. పండ్లు, కూరగాయలు. రుతువుల వారీగా అందుబాటులో ఉండే పండ్లు, యాపిల్, బెర్రీస్, క్యారట్, పచ్చి బఠానీలు తీసుకోవాలి.

### అల్పాహారం ఆప్షన్స్

మిల్క్ షేక్, పండ్లు లేదా పాలతో కార్న్ ఫ్లేక్స్ లేదా ఓట్స్ కలిపి తీసుకోవచ్చు. అటుకులను కూరగాయలతో కలిపి తీసుకోవచ్చు. ఆమ్లెట్, చపాతీ కలిపి తీసుకోవచ్చు. ఉడికించిన గుడ్డు తినిపించొచ్చు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచన ప్రకారం పిల్లలు రోజులో నాలుగు సార్లు ఫుల్ మీల్స్ తీసుకోవాల్సి ఉంటుంది. ఈ ఆహారం కూడా తాజా పండ్ల రసాలు, ప్రొబయోటిక్ పెరుగు, కూరగాయలు (రసాలు, ఉడకబెట్టిన రూపంలో) కలిపి తీసుకోవాల్సి ఉంటుంది. అలాగే,చపాతీలు,పరాటాలు కూడా భాగం చేసుకోవాలి. మొలకెత్తిన ధాన్యం, బీన్స్ ను కూడా తీసుకోవడం వల్ల పోషకాహార బలం లభిస్తుంది. వ్యాధి నిరోధక శక్తి మెరుగుపడుతుంది.

### ధాన్యాలు(గ్రెయిన్స్)

ఆహారంలో ధాన్యాలు తప్పనిసరి.వీటిలో పోషకాలు, శక్తి అన్నవి పిల్లల ఎదుగుదలకు ఉపయోగపడతాయి.తృణ ధాన్యాలతోపాటు, బ్రెడ్స్, ఓట్స్, బియ్యం తీసుకోవాలి. శుద్ధి చేసిన ఆహార పదార్థాలు, అధికంగా షుగర్ ఉన్నవి, శాచురేటెడ్ ఫ్యాట్ అధికంగా ఉన్నవి, ఉప్పు, లేదా సోడియం, కేక్స్, బిస్కట్లకు దూరంగా ఉండాలి.

### పండ్లు, కూరగాయలు

వీటితో నీరు, విటమిన్స్, మినరల్స్, పీచు (ఫైబర్) తగినంత లభిస్తాయి. చిన్నారులు ఐదు భాగాల పండ్లు, కూరగాయలను ఒక రోజులో తీసుకోవాలి.

### ఫ్యాట్స్, నూనెలు

చిన్న పిల్లలు, టీనేజీ వయసులో ఉన్నవారికి కొవ్వులు, నూనె పదార్థాలు ఎంతో అవసరం. చిన్నారుల మానసిక వృద్ధికి ఇవి తోడ్పడతాయి. కొవ్వు అన్నది మన శరీరంలో ఇంధనంలా పనిచేస్తుంది. ఫ్యాట్ లో కరిగే విటమిన్ ఎ, డీ, ఈ, కే లను శరీరం గ్రహించేలా చేయగలదు. కొవ్వుతో కూడిన పదార్థాలు అధికంగా తీసుకుంటే బరువు పెరగడం, స్థూలకాయం, గుండె జబ్బులు తదితర ప్రమాదాలుంటాయి. అందుకే వీటిని తగినంత మోతాదులో తీసుకుంటే ఆరోగ్య ప్రయోజనాలు పొందొచ్చు. నట్స్, అవొకాడో, కార్న్ ఆయిల్, సోయాబీన్ ఆయిల్, ఆలివ్ ఆయిల్, కనోలా ఆయిల్ ను ఇందుకు ఎంచుకోవచ్చు.

### పాలు, పాల పదార్థాలు

పాలు, పాల పదార్థాలు ఎన్నో పోషకాలకు నెలవు. వీటిలో విటమిన్ ఎ, డి, బి1, బి2, బి12 విటమిన్లు, మినరల్స్,ముఖ్యంగా క్యాల్షియం సమృద్ధిగా లభిస్తాయి. చిన్నారులు, యుక్త వయసులోకి వచ్చిన వారికి పాలు చాలా అవసరం. ఎముకల వృద్ధికి అవసరమైన క్యాల్షియం అందుతుంది.

### మాంసం, బీన్స్

మాంసం,పౌల్ట్రీ,చేపలు,బీన్స్, బఠానీలు, గుడ్లు, విత్తనాలు ఎన్నో పోషకాలకు నెలవు. ఆరోగ్యకరమైన ఆహారంలో వీటికి చోటుండాలి. మన శరీరంలో వివిధ రకాల పనులకు అవసరం. మాంసం కూడా విటమిన్ 12, ఐరన్ నిల్వలకు కేంద్రం. ఐరన్ అధికంగా ఉండడంతో అనీమియా నిరోధించడానికి సహాయపడుతుంది.

ఎక్కువ మంది పిల్లల్లో కనిపించేది ఇదే. రక్త హీనత కారణంగా నీరసంగా, పాలిపోయినట్టు కనిపిస్తారు. శాకాహారులైతే మాంసానికి ప్రత్యామ్నాయంగా సోయా,బీన్స్,గుడ్లు, పాలు, జున్ను, పెరుగు,పుట్టగొడుగులు,నట్స్,సీడ్స్ను వాడుకోవచ్చు.

### ఎంత మేర పాలు అవసరం?

2-3 ఏళ్ల మధ్య చిన్నారులకు రెండు కప్పుల పాలు (480 ఎంఎల్) ఇవ్వాలి. 4-8 ఏళ్ల పిల్లలకు రెండున్నర కప్పులు (600 ఎంఎల్) ఇవ్వాలి. 9 ఏళ్లు దాటిన వారికి మూడు కప్పులు (720 ఎంఎల్) ఇవ్వాలని డాక్టర్ దేవయాని బెనర్జీ సూచించారు. కొవ్వు తీసిన పాలు, 1 శాతం ఫ్యాట్ ఉన్న పాలను ఉపయోగించడం మంచిదని ఆమె సూచించారు.

### అనారోగ్యంతో ఉన్నప్పుడు...

అనారోగ్యంతో ఉన్నప్పుడు కడుపు మాడ్చుకూడదు. శక్తితో కూడిన ధాన్యాలు, పాలు, ఉడికించిన కూరగాయలు కొంచెం చొప్పున ఎక్కువ సార్లు అందించాలి.పుష్కలంగా నీరు,ద్రవ పదార్థాలు ఇవ్వాలి.డీహైడ్రేషన్ రాకుండా అవసరమైతే ఓరల్ రీహైడ్రేషన్ ద్రావకాన్ని తాగించాలి.

### పోషకాహారంతో కూడిన భోజన నమూనా

ఉదయం నిద్ర నుంచి లేచిన తర్వాత ఒక గ్లాస్ గోరు వెచ్చని, ఫ్యాట్ తక్కువగా ఉన్న పాలు అల్పాహారం కింద కోడిగుడ్డు ఆమ్లెట్, ఉల్లిగడ్డలు, టమాటా, పాల కూర, ముడి ధాన్యాలు, యాపిల్.ఉదయం 11 గంటల సమయంలో ఫ్రూట్ సలాడ్, తక్కువ ఫ్యాట్ ఉన్న యోగర్ట్ మధ్యాహ్నం భోజనం కింద రైస్, పండ్ల రసం. మాంసాహారులైతే లీన్ చికెన్. సాయంత్రం పాలకూర, పుట్టగొడుగుల కట్లెట్. బాదం గింజలతో తాజా పండ్ల రసం (యాపిల్ లేదా జామ లేదా నిమ్మ) రాత్రి భోజనం కింద మల్టీ గ్రెయిన్ (ఒకటికి మించిన ధాన్యాలతో పట్టించిన పిండి) పుల్కాలు, పప్పు, పనీర్, పుట్టగొడుగులతో కూడిన కూర తీసుకోవాలి. నిద్రకు ముందు గ్లాస్ గోరువెచ్చని పాలు తాగాలి.

### గోధుమలు వద్దు

చిన్నారులకు గోధుమలతో కూడిన ఆహారం ఇవ్వడం సరికాదని డాక్టర్ కాశిష్ ఎ చాబ్రియా అభిప్రాయం. దీనిలో గ్లూటెన్ ఉండడం వల్ల పేగులను జిగటలా మార్చి ఆహారాన్ని సరిగా ముందుకు పోనివ్వదని వివరించారు.చాలా మంది పిల్లలకు గ్లూటెన్ పడదు కనుక, దాన్ని డైట్ నుంచి మినహాయించడం మంచిదంటున్నారు.

### శారీరక కదలికలు

పిల్లలకు రోజువారీ శారీరక శ్రమ అవసరం. బలమైన ఎముకలు, తగినంత కండరాల బలం కోసం శారీరక కదలికలు ఉండేలా చూడాలి. నడక, పరుగు, ఇతర క్రీడలు ఉపయోగపడతాయి. ఈ విషయంలో తల్లిదండ్రులే పిల్లలకు మార్గదర్శకం. కనుక వారు చేయడం ద్వారా పిల్లలను ప్రోత్సహించొచ్చు.

### వేటిలో ఏ పోషకాలు

పిల్లలకు సమతుల పోషకాహారం ఎంతో ప్రాధాన్యమని ఇక్కడ చెప్పుకున్నాం. అవేంటన్న సందేహం రావచ్చు. కనుక పోషకాలు ఏవి, ఎందులోఅవి లభ్యమవుతాయన్నది తెలుసుకోవచ్చు.

### ప్రొటీన్స్

శరరీంలో కణాల నిర్మాణానికి ప్రొటీన్లు అవసరం. ఆహారాన్ని శక్తిగా మార్చేందుకు, ఇన్ఫెక్షన్ పై పోరాడేందుకు, ఆక్సిజన్ ను సరఫరా చేసేందుకు ప్రొటీన్లు అవసరం. మాంసం, పౌల్ట్రీ, చేపలు, గుడ్లు, నట్స్ (బాదం, అక్రూట్ తదితర), బీన్స్, పాల ఉత్పత్తుల్లో ప్రొటీన్ పుష్కలంగా ఉంటుంది.

### కార్బోహైడ్రేట్స్

శరీరానికి శక్తినందించే కీలక వనరులు ఇవి. కొవ్వు, ప్రొటీన్లను శరీర కణజాల నిర్మాణానికి ఉపయోగించేందుకు ఇవి అవసరం. చక్కెరలు, గంజి, పీచు పదార్థాలు ఇలా భిన్న ఆహార పదార్థాల్లో కార్బొహైడ్రేట్స్ తగినంత ఉంటాయి. చిన్నారులకు మాత్రం చక్కెరలు కాకుండా, ఇతర రూపాల్లో ఇవి అందేలా శ్రద్ధ తీసుకోవాలి. బ్రెడ్స్, ధాన్యాలు, బియ్యం, ఆలుగడ్డల్లో కార్బొహైడ్రేట్లు పుష్కలం.

### ఫ్యాట్స్

కొవ్వు పదార్థాలు పిల్లలకు అధికంగా ఇవ్వకూడదు. కానీ, తగినంత మోతాదు అవసరమే. కొన్ని రకాల పోషకాలను శరీరం తగిన విధంగా వినియోగించుకునేందుకు ఇవి అవసరమవుతాయి. కొవ్వులు అధికంగా ఉండే వాటిలో హోల్ మిల్క్ పదార్థాలు, వంట నూనెలు, మాంసం, చేపలు, నట్స్.

### క్యాల్షియం

ఎముకలు, దంతాలకు అవసరమైన మూలకం క్యాల్షియం. నరాలకు, రక్తం గడ్డ కట్టేందుకూ, కండరాలకు, గుండె పనితీరుకూ క్యాల్షియం అవసరమవుతుంది. పాలు, పెరుగు, ఐస్ క్రీమ్, గుడ్డు పచ్చసొన, క్యాబేజీ, పాలకూర తదితర పదార్థాల్లో క్యాల్షియం తగినంత లభిస్తుంది.

# 12 జ్యోతిర్లింగాలు ఎక్కడున్నాయో తెలుసా..? వాటి ప్రత్యేకత ఏంటి..?



శివరాత్రి సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో శివుని పూజలో పాల్గొంటారు. ఉపవాసం చేసి, రాత్రి జాగరణ చేస్తారు. ఈ సందర్భంలో 12 జ్యోతిర్లింగాల గురించి తెలుసుకోవడం ఎంతో ముఖ్యమైనది. భారతదేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ఈ జ్యోతిర్లింగాలకు ప్రతి ఒక్కదానికి విశేషమైన ప్రత్యేకత ఉంది. జ్యోతిర్లింగాలు శివుని కాంతి రూపం అని చెబుతారు. ఈ 12 జ్యోతిర్లింగాలపై శివుని ప్రత్యేక ఆశీస్సులు ఉంటాయని అక్కడ పూజలు చేసిన వారికి శివుని కృప లభిస్తుందని భక్తులు నమ్ముతారు.

**సోమనాథ జ్యోతిర్లింగం..** గుజరాత్ లోని సౌరాష్ట్రంలో సోమనాథ జ్యోతిర్లింగం మొదటి జ్యోతిర్లింగంగా గుర్తించబడింది. ఇది శివుని ప్రధాన పూజా స్థలాలలో ఒకటి.

**మల్లికార్జున జ్యోతిర్లింగం..** శ్రీశైలం పర్వతంపై కృష్ణానది ఒడ్డున మల్లికార్జున జ్యోతిర్లింగం ఉంది.ఇది ఆంధ్రప్రదేశ్ లో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం.

**మహాకాలేశ్వర జ్యోతిర్లింగం..** ఉజ్జయినిలో ఉన్న మహాకాలేశ్వర జ్యోతిర్లింగం దక్షిణాభిముఖంగా ఉన్న ఏకైక జ్యోతిర్లింగంగా ప్రసిద్ధి పొందింది. ఇది మధ్యప్రదేశ్ లో ఉంది.

**ఓంకారేశ్వర జ్యోతిర్లింగం..** ఓంకారేశ్వర జ్యోతిర్లింగం నర్మదా నది ఒడ్డున ఇండోర్ సమీపంలోని మాల్వా ప్రాంతంలో ఉంది.

**భీమాశంకర జ్యోతిర్లింగం..** మహారాష్ట్రలోని పూణే సమీపంలోని సహ్యాద్రి పర్వత శ్రేణులపై ఉన్న భీమాశంకర జ్యోతిర్లింగం కూడా ప్రధానంగా గుర్తించబడింది.

**కేదారనాథ జ్యోతిర్లింగం..** హిమాలయాల్లో కేదార్ పర్వతంపై ఉన్న కేదారనాథ జ్యోతిర్లింగం ఉత్తరాఖండ్ లో ప్రసిద్ధి చెందింది. ఇది అత్యంత పవిత్రమైన పుణ్యక్షేత్రాలలో ఒకటిగా భావిస్తారు.

**కాశీ విశ్వనాథ జ్యోతిర్లింగం..** ఉత్తరప్రదేశ్ లోని వారణాసిలో ఉన్న కాశీ విశ్వనాథ జ్యోతిర్లింగం పవిత్ర కాశీలో ప్రసిద్ధి చెందినది. ఇది శివుని అతి ముఖ్యమైన పూజా స్థలాలలో ఒకటి.

**త్రయంబకేశ్వర జ్యోతిర్లింగం..** మహారాష్ట్రలోని నాసిక్ జిల్లాలో గోదావరి నది ఒడ్డున ఉన్న త్రయంబకేశ్వర జ్యోతిర్లింగం ఎంతో విశిష్టమైనది.

**వైద్యనాథ జ్యోతిర్లింగం..** జార?ండ్ లోని దేవఘర్లో ఉన్న వైద్యనాథ జ్యోతిర్లింగం మత విశ్వాసాల ప్రకారం చితాభూమి అని పిలువబడింది. ఇది ప్రధాన జ్యోతిర్లింగాలలో ఒకటి.

**నాగేశ్వర జ్యోతిర్లింగం..** గుజరాత్ లో ద్వారకా పురి సమీపంలో ఉన్న నాగేశ్వర జ్యోతిర్లింగం శివుని ఇష్ట ప్రకారం ప్రసిద్ధి చెందింది.

**రామేశ్వర జ్యోతిర్లింగం..** తమిళనాడులోని రామనాథంలో ఉన్న రామేశ్వర జ్యోతిర్లింగం 11వ జ్యోతిర్లింగంగా గౌరవించబడింది.

**ఘృష్ణేశ్వర జ్యోతిర్లింగం..** మహారాష్ట్రలోని సంభాజీనగర్ లో దౌలతాబాద్ సమీపంలో ఉన్న ఘృష్ణేశ్వర జ్యోతిర్లింగం శివుని 12వ జ్యోతిర్లింగం.

# ఔషధ గుణాల రోజా....ఆరోగ్యానికి రాజా

చూడగానే ఎంతో అందంగా కన్పించే రోజా పూలకు ఎన్నో ఔషధ గుణాలున్నాయి. అవి అందానికే కాదు ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు. రోజా రేకులను తినడం వల్ల పలు రకాల ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. అవేంటో ఒకసారి చూద్దాం...



**వీర్యవృద్ధి :** రోజా రేకులు మీ శృంగార జీవితానికి చాలా దోహదం చేస్తాయి. శాస్త్రీయ పరిశోధనల ప్రకారం, రోజా రేకులను రోజూ గుప్పెడు తింటూ వస్తే అవి మన శరీరంలోని దోషాలను పోగొడుతాయి. తద్వారా రక్తశుద్ధి జరుగుతుంది. అంతేకాక సహజంగానే వీటికి వీర్యవృద్ధిని కలిగించే గుణముంది.

**మొటిమలు, నల్లమచ్చలు మటుమాయం :** యుక్త వయసులో హార్మోన్ల ప్రభావంతో యువతీ యువకులకు మొహంపై వచ్చే మొటిమలు, తద్వారా ఏర్పడే నల్లమచ్చలను పోగొట్టడంలో రోజా రేకులు సమర్థవంతంగా పనిచేస్తాయి. రేకులను నీటిలో బాగా మరిగించాలి. తర్వాత వాటిని బయటకు తీసి ముద్దగా నూరాలి. దీనికి ముల్తానీ మట్టి కలిపి మిశ్రమంగా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని వారంలో ఒక్కసారి మీ మొహంపై రాసుకుంటే సత్ఫలితం ఉంటుంది. క్రమేపీ నల్లమచ్చలు తగ్గిపోవడం మీరు గుర్తించవచ్చు. అంతేనా...రోజా రేకులు మీ మొహ చర్మాన్ని ఆరోగ్యవంతంగా కూడా ఉంచడంలో ఇవెంతగానో దోహదపడతాయి.


**రోజా రేకుల కషాయం :** రోజా రేకులతో తయారు చేసే కషాయం కూడా ఆరోగ్యానికి మంచిదే. మార్కెట్లలో లభించే ఔషధాల కంటే కూడా ఇది బాగా పనిచేస్తుంది. మీ చర్మానికి మెరుపును అందిస్తుంది. చర్మంపై ప్రధానంగా మొహంపై మొటిమల వల్ల ఏర్పడిన కూపములను ఇది తగ్గిస్తుంది. దీనిని మీరు మీ ఇంట్లోనే స్వయంగా తయారు చేసుకోవచ్చు. మీకు కావాల్సిందల్లా రోజా రేకులు, నీరు మాత్రమే.

**మనసుకు ప్రశాంతత :** రోజా పూల నుండి వచ్చే సువాసనను ఆస్వాదించడం వల్ల మీకు శారీరకంగానే కాక మీ మనసుకు కూడా ప్రశాంతత చేకూరుతుంది. ఒత్తిడి నుండి ఉపశమనం పొందడానికి దోహదపడుతుంది. వేడి నీటిలో రోజా రేకులతో పాటు కొంత బాత్ సాల్ట్ని కలిపాలి. ఈ మిశ్రమాన్ని ఒక పద్ధతి ప్రకారం, మీరు గనుక పీల్చితే తప్పకుండా ఉపశమనం లభించి, చురుగ్గా మారుతారు.

**నాజూకుతనానికి :** రోజా రేకుల్లో ఉండే పదార్థాలు నాజూకుతనానికి బాగా ఉపయోగపడుతాయి. కొద్దిగా మెంతులు, రోజా రేకులు కలిపి చేసుకున్న పేస్టును తినడం లేదా రోజా రేకులతో కాచిన కషాయాన్ని తాగినా మీరు సన్నబడతారు. అంతేకాక రోజా రేకులు జీవక్రియను మెరుగుపరుస్తాయి. తద్వారా మీరు సన్నబడే అవకాశముంటుంది.


# ఓటీపీలు చెప్పకపోయినా.. మీ బ్యాంకు ఖాతా హ్యాక్.. అర్జెంటుగా ఈ టిప్స్ తెలుసుకోకపోతే డేంజర్..

సైబర్ నేరగాళ్లు మీ బ్యాంకు అకౌంట్‌లో డబ్బు కొట్టేయడానికి సరికొత్త మార్గాలు వెతుక్కుంటు న్నారు. ఇప్పుడు వాళ్లకు మీ మనీ కాజేయడానికి మీ మొబైల్‌కు వచ్చే ఓటీపీలు, ఏటీఎం పిన్‌లు కూడా అవసరం లేదు. ఇటీవల కాలంలో ఈ కేటుగాళ్లు మీకు బ్యాంకుల నుంచి వచ్చినట్లుగా నకిలీ మెసేజ్‌లు పంపిస్తున్నారు. మీరు పొరపాటున ఆ లింకులపై క్లిక్ చేశారో అంతే సంగతులు, మీ ఖాతాలోని డబ్బు క్షణాల్లో మాయం అవుతుంది.ఆమెకు మీరు ఒక బహుమతి గెలుచుకున్నారని మెసేజ్ వచ్చింది. కానీ ఆ మెసేజ్‌లో ఉన్న ఒక చిన్న తప్పును ఆమె గమనించింది. అనుమానం రావడంతో ఆ మోసం నుంచి ఆమె తప్పించుకోగలిగింది. కానీ అందరికీ ఆమెలాంటి పరిశీలన ఓపిక తెలివి ఉండకపోవచ్చు. సురక్షితంగా ఉండాలంటే ఏం చేయాలి.. ఎవరైనా తెలియని వ్యక్తులు ఫోన్ చేసినా, మెసేజ్‌లు పంపినా చాలా జాగ్రత్తగా ఉండాలి. మీ వ్యక్తిగత వివరాలు, బ్యాంకు అకౌంట్ డీటెయిల్స్ లాంటివి ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరితోనూ షేర్ చేసుకోవద్దు. అది ఎంత నమ్మకంగా అనిపించినా తొందరపడొద్దు. డిస్కౌంట్లు, వోచర్లు, క్యాష్ రివార్డులు అంటూ ఆఫర్లు ఇచ్చే లింకులపై అస్సలు క్లిక్ చేయవద్దు.అవి మిమ్మల్ని ట్రాప్ చేయడానికే అని గుర్తుంచుకోవాలి. యాప్స్ డౌన్‌లోడ్ చేసుకునేటప్పుడు నమ్మకమైన ప్లే స్టోర్ లేదా




యాప్ స్టోర్ వంటి వాటి నుంచే చేసుకోవాలి. ఎక్కడ పడితే అక్కడ దొరికే యాప్స్ అస్సలు వద్దు. ఎందుకంటే ఆ యాప్‌లు మీ ఫోన్ కెమెరా, ఫొటో గ్యాలరీ వంటి వాటికి యాక్సెస్ తీసుకుంటాయి.వాటితో స్కామర్లు కేవైసీ మోసాలు చేస్తారు. ఒకవేళ మీకు ఏదైనా అనుమానాస్పదమైన ఫోన్ కాల్ వస్తే, వెంటనే స్పందించవద్దు. ముందు ఆ విషయాన్ని అధి కారిక మార్గాల ద్వారా క్రాస్ చెక్ చేసుకోవాలి. అవసరమైతే వస్తే అధికారులకు ఫోన్ చేయాలి. అప్పుడే మోసాల బారిన పడకుండా సురక్షితం గా ఉండగలరు. కాల్ మెర్జింగ్ స్కామ్ ఈ ట్రిక్‌లో స్కామర్ మీకు ఫోన్ చేస్తాడు. తెలిసిన వ్యక్తిలా మాట్లాడుతూ ఏదో ఒక ఈవెంట్ కవర్ చేయమని అడుగుతాడు. మీరు మాట్లాడుతుండ˘గానే మరో నంబర్ నుంచి మీకు కాల్ వస్తుంది. అప్పుడు స్కామర్ రెండో కాల్ ఏదో వీఐపీ నుంచి అని నమ్మించి, రెండు కాల్స్‌ను మెర్జ్ చేయమని అడుగుతాడు. మీరు మెర్జ్ చేయగానే, హ్యాకర్ మీ మాటలు వింటూ ఉంటాడు. మీరు బ్యాంకు నుంచి గానీ, వాట్సాప్, ఫేస్‌బుక్ వంటి యాప్‌ల నుంచి గానీ వచ్చే ఓటీపీలను చెప్పేస్తే అవి వాళ్లకు తెలిసిపోతాయి. అంతే, మీ అకౌంట్లు హ్యాక్ చేసి డబ్బు కొట్టేస్తారు. మీ ఫ్రెండ్‌కి ఫ్రెండ్‌ని అని కూడా చెప్తారు జాగ్రత్త. మాల్వేర్ స్కామ్ హ్యాకర్లు ఆండ్రాయిడ్ అప్లికేషన్ ప్యాకేజీ ఫైల్స్‌లో, రిమోట్ యాక్సెస్ ట్రోజన్‌లు )లో మాల్వేర్‌ను దాచిపెడతారు. ఈ మాల్వేర్‌తో స్కామర్లు మీ ఫోన్‌ను మీకు తెలియకుండానే కంట్రోల్ చేయగలరు. ఉదాహరణకు, గతేడాది మే 21న హసన్ సబ్-డివిజన్‌కు చెందిన ఒక డీఎస్పీ ఏకంగా రూ.15.98 లక్షలు పోగొట్టుకున్నారు. ఆయన ఒక నేషనలైజ్డ్ బ్యాంకు నుంచి వచ్చినట్లుగా ఉన్న మెసేజ్‌లోని లింక్ ద్వారా ఒక యాప్ ఇన్‌స్టాల్ చేసుకు న్నారు. ఆ లింక్‌లో మాల్వేర్ ఉండటంతో, హ్యాకర్లు ఆయన ఫోన్‌లోకి ఈజీగా ఎంటర్ అయిపోయారు.

# బర్త్‌డే స్పెషల్ కోహ్లీ ఫిట్‌నెస్ సీక్రెట్



టీమ్ ఇండియా స్టార్ క్రికెటర్, పరుగుల రారాజు విరాట్ కోహ్లీ పుట్టిన రోజు నేడు. అండర్ -19 వరల్డ్ కప్ హీరోగా జట్టులోకి వచ్చి.. విలువైన ఆటగాడిగా.. సమర్థుడైన నాయకుడిగా జట్టుపై తన ముద్ర వేసిన కోహ్లీ నేడు 37వ వసంతంలో అడుగుపెట్టాడు ఈ సందర్భంగా కోహ్లీకి సోషల్ మీడియా ద్వారా శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. సహచర ఆటగాళ్లు, సీనియర్ క్రికెటర్లు, అభిమానులు ఈ క్రికెట్ కింగ్‌కు విషెస్ తెలుపుతున్నారు. ఈ సందర్భంగా కోహ్లీ ఫిట్‌నెస్ సీక్రెట్ ఏంటో తెలుసుకుందాం.కోహ్లీ ఫిట్‌నెస్‌కి అధిక ప్రాధాన్యం ఇస్తాడన్న విషయం అందరికీ తెలిసిందే. ప్రపంచంలోని ఫిట్టెస్ట్ ఎవరు? అని అడిగితే.. కోహ్లీ అని ఎవరైనా ఠక్కున చెప్పేస్తారు. ఇందులో ఎలాంటి సందేహం లేదు. నిరంతరం కష్టపడుతూ తన శరీరాన్ని దృఢంగా ఉంచుకుంటాడు. ఆటతో పాటు ఫిట్‌నెస్‌తో విరాట్ కోట్లాది మంది అభిమానుల మనసు గెలిచాడు. ఫిట్‌నెస్‌లో భారత క్రికెట్ జట్టు సభ్యులందరూ విరాట్‌ను స్ఫూర్తిగా తీసుకుంటారు. వ్యాయామం, డైట్‌కు అంతలా ప్రాధాన్యమిస్తాడు ఈ స్టార్ బ్యాట్స్‌మెన్.ఫిట్‌గా ఉండేందుకు కోహ్లీ మూడింటికే అధిక ప్రాధాన్యత ఇస్తారు. ఫిట్‌నెస్, ఆహారం విషయంలో క్రమశిక్షణతో ఉంటారు. రోజూ ఉదయం లేవగానే కార్డియో వర్కవుట్స్, క్రికెట్ ప్రాక్టీస్ చేస్తారు. ఇక ఆహారం విషయానికి వస్తే.. జంక్ ఫుడ్ అస్సలు తినరు. కూల్ డ్రింక్స్ వంటి వాటికి దూరంగా ఉంటారు. ఇక కోహ్లీ నిద్రకు కూడా తగిన ప్రాధాన్యత ఇస్తారు. నిద్ర విషయంలో అస్సలు రాజీపడరు. దాదాపు ఎనిమిది గంటలపాటు ప్రశాంతంగా నిద్రపోతారు. మంచి నిద్రతో తగిన విశ్రాంతి దొరుకుతుందని కోహ్లీ భావిస్తారు. కోహ్లీ ఫిట్‌నెస్ వెనుక ఉన్న ఈ రహస్యాన్నిఆయన సతీమణి, స్టార్ నటి అనుష్క శర్మ ఓ ఇంటర్వ్యూలో బయటపెట్టారు.

# వరల్డ్ కప్ కోచ్‌కు ఘన స్వాగతం




ప్రపంచ కప్ కోసం 47 ఏళ్లుగా నిరీక్షిస్తున్న భారత మహిళల జట్టు కలను సాకారం చేశాడు కోచ్ అన్మోల్ మజుందార్. క్రికెటర్‌గా పెద్ద రికార్డులేమీ సాధించని అతడు హర్మన్‌ప్రీత్ కౌర్ బృందాన్ని ఛాంపియన్లుగా మలిచిన తీరును వేనోళ్ల కొనియాడుతున్నారు క్రీడా ప్రముఖులు. దశాబ్దాలుగా అందకుండా ఊరిస్తున్న మెగా ట్రోఫీని పట్టేయడంలో కీలకమైన మజుందార్‌పై సర్వత్రా ప్రశంసలు కురుస్తున్నాయి. భారత జట్టు గొప్ప కోచ్‌లలో ఒకడిగా ఆయన పేరు దేశమంతా మార్మోగిపోతోంది. ఆయన కంటపడితే చాలు అభినందనల్లో ముంచెత్తుతున్నారు ఫ్యాన్స్. మహిళల జట్టు చరిత్ర సృష్టించడంలో కీలకమైన మజుందార్‌కు అతడి నివాసం వద్ద ఘన స్వాగతం లభించింది. హర్మన్‌ప్రీత్ సారథ్యంలోని టీమిండియాను వరల్డ్ కప్ ముద్దాడేలా చేసిన కోచ్ మజుందార్‌కు ఇరుగుపొరుగు వాళ్లు వినూత్నంగా స్వాగతం పలికారు. విల్లే పార్లేలోని తన నివాసానికి మంగళవారం ఆయన వెళ్లగానే.. స్థానికులు అభినందల్లో ముంచెత్తారు. బ్యాండ్ బాజాలతో.. గులాబా రెమ్మలతో మజుందార్‌కు స్వాగతం పలికారు. కొందరు బ్యాట్లు చేతబూని అచ్చం క్రికెట్ మైదానంలో మాదిరిగా గార్డ్ ఆఫ్ హానర్‌తో ఆయనకు మర్చిపోలేని విధంగా వెల్‌కమ్ చెప్పారు. తనపై వాళ్లు చూపిస్తున్న ప్రేమాభిమానాలకు సంబురపడిపోయిన మజుందార్.. కూల్‌గా నడుచుకుంటూ తన ఇంటికి వెళ్లారు. ప్రస్తుతం ఆ వీడియో నెట్టింట వైరలవుతోంది.ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదుక్రికెటర్‌గా జాతీయ జట్టు తరఫున ఒక్క మ్యాచ్ కూడా ఆడని మజుందార్ కోచ్‌గా టీమిండియాను విశ్వ విజేతగా నిలిపాడు. రెండేళ్ల క్రితం బాధ్యతలు చేపట్టిన అతడు జట్టులో నిలకడ, స్థిరత్వం.. విజయకాంక్ష వంటి లక్షణాలను రగిల్చాడు. కెప్టెన్ హర్మన్‌తో కలిసి ప్రతిభావంతులకు ప్రాధాన్యమిచ్చిన ఆయన.. వరల్డ్ కప్‌లో తన మార్క్ చూపించాడు. రెండు విజయాల తర్వాత వరుసగా మూడు పరాజయాలు ఎదురైన వేళ 'అధైర్యపడొద్దని.. సొంతగడ్డపై కప్‌ను గెలిచే సత్తా మీకుంద'ని హర్మన్ టీమ్‌లో ఆత్మవిశ్వాసాన్ని నూరిపోశాడు. ఇంకేముంది.. న్యూజిలాండ్‌పై భారీ విజయంతో సెమీస్ చేరిన టీమిండియా.. ఫైనల్లో ఆస్ట్రేలియాపై 5 వికెట్ల విజయంతో మూడోసారి ఫైనల్‌కు దూసుకెళ్లింది. టైటిల్ పోరుకు ముందు ..'ఈ ఏడు గంటలు చాలా కీలకం. ఏం ఆలోచించకుండి. కప్ మనదే' అనే సందేశంతో భారత బృందాన్ని కార్యోన్ముఖులను చేశాడు మజుందార్. కోచ్ మాటల్ని ఒంటబట్టించుకున్న భారత క్రికెటర్లు.. గెలవాలనే కసితో బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌లో సత్తా చాటారు. సమిష్టిగా రాణించి 52 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా తొలి కప్ కలను చెదరగొడుతూ జగజ్జేతలుగా అవతరించారు

# టీ20ల్లో తోపు, వన్డేల్లో జీరో




టీ20 ఫార్మాట్‌లో మిస్టర్ 360గా ప్రపంచవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్న భారత స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ ప్రస్తుతం తన వన్డే కెరీర్‌పై దృష్టి సారించాడు. టెస్టులు, టీ20లలో అద్భుతంగా రాణించినప్పటికీ, 50 ఓవర్ల ఫార్మాట్‌లో మాత్రం ఆశించిన స్థాయిలో ప్రదర్శన చేయలేకపోవడం సూర్యకుమార్‌ను కలవరపెడుతోంది.వన్డేలలో సూర్యకుమార్ విఫలం.టీ20 క్రికెట్‌లో సూర్యకుమార్ యాదవ్ అద్భుతమైన స్ట్రైక్ రేట్‌తో ఆడుతూ ఐసీసీ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో నిలిచాడు. అయితే, వన్డే ఫార్మాట్‌లోకి అడుగుపెట్టినప్పటి నుంచి అతను నిలకడైన ప్రదర్శన చేయడంలో ఇబ్బంది పడుతున్నాడు.ఇప్పటి వరకు సూర్యకుమార్ 37 వన్డేల్లో కేవలం 25.76 సగటుతో 773 పరుగులు మాత్రమే చేశాడు. ఈ క్రమంలో తాను వన్డే క్రికెట్‌ను కూడా టీ20 లాగే ఆడాలని అనుకున్నానని, అయితే ఆ ఆలోచన సరైంది కాదని ఇప్పుడు అర్థమైందని సూర్యకుమార్ ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పేర్కొన్నాడు. ఫార్మాట్‌ల మధ్య ఏబీడీకి సూర్యకుమార్ సందేశం.సూర్యకుమార్ యాదవ్, ఏబీ డివిలియర్స్‌ను తన ఆదర్శంగా భావిస్తాడు. మైదానం చుట్టూ షాట్లు కొట్టే అతని సామర్థ్యాన్ని తరచుగా ఏబీ డివిలియర్స్‌తో పోలుస్తుంటారు. ఈ నేపథ్యంలోనే, తన వన్డే కెరీర్‌కు మళ్ళీ జీవం పోయడానికి డివిలియర్స్ సలహా కావాలని సూర్యకుమార్ అడిగాడ"త్వరలో నేను అతన్ని (ఏబీ డివిలియర్స్) కలిస్తే, టీ20లు, వన్డేలను అతను ఎలా బ్యాలెన్స్ చేశాడో అడగాలనుకుంటున్నాను. నేను అలా చేయలేకపోయాను. వన్డేలను కూడా టీ20ల్లాగే ఆడాలని అనుకున్నాను. రెండు ఫార్మాట్‌లలో విజయం సాధించడానికి అతను ఏం చేశాడో తెలుసుకోవాలనుకుంటున్నాను" అంటూ చెప్పుకొచ్చాడు."ఏబీ, మీరు ఈ మాట వింటున్నట్లయితే, దయచేసి నన్ను త్వరగా సంప్రదించండి. ఎందుకంటే, నా ముందు ఇంకా ముఖ్యమైన మూడు-నాలుగు సంవత్సరాలు ఉన్నాయి. నేను వన్డే క్రికెట్ ఆడాలని చాలా ఆసక్తిగా ఉన్నాను. దయచేసి నాకు సహాయం చేయండి! నేను టీ20లు, వన్డేలను సమతుల్యం చేసుకోలేకపోయాను" అని సూర్యకుమార్ బహిరంగంగా విజ్ఞప్తి చేశాడుఎందుకు ఏబీ డివిలియర్స్?ఏబీ డివిలియర్స్ అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యుత్తమ వైట్-బాల్ ఆటగాళ్ళలో ఒకరిగా పేరుగాంచాడు. అతని బ్యాటింగ్ టెక్నిక్, మైదానంలో అన్ని వైపులా షాట్లు ఆడగల సామర్థ్యం అతన్ని "మిస్టర్ 360cగా మార్చాయి. కాగా, ఏబీడీ వన్డేలలో 50కి పైగా సగటు, 100కు పైగా స్ట్రైక్ రేట్‌తో రాణించిన సంగతి తెలిసిందేవన్డే జట్టులోకి తిరిగి రావాలని పట్టుదలతో ఉన్న సూర్యకుమార్ యాదవ్, తన కలలను సాకారం చేసుకోవడానికి ఏబీ డివిలియర్స్ సహాయాన్ని కోరడం ప్రస్తుతం క్రికెట్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. డివిలియర్స్ దీనిపై ఎలా స్పందిస్తారో చూడాలి.

# మళ్లీ లక్షకు బంగారం ధర




నిన్నమొన్నటిదాకా పరుగులు పెట్టిన బంగారం ధరలు ఇప్పుడు తగ్గుముఖం పట్టాయి. అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న పరిస్థితులు.. పుత్తడి డిమాండ్‌ను అమాంతం తగ్గించేస్తున్నాయి మరి. ఈ ట్రెండ్ ఇలాగే కొనసాగితే భారత్‌లో 24 క్యారెట్ 10 గ్రాముల ధర మళ్లీ లక్ష రూపాయల స్థాయికి దిగొస్తుందన్నది నిపుణుల అంచనా. రికార్డుల మోత మోగించిన గోల్డ్ మార్కెట్‌ను నిశబ్దం ఆవరించింది. దాదాపు నెల కిందట ఆల్‌టైమ్ హై స్థాయిని తాకిన బంగారం ధరలు ఇప్పుడు దిగొస్తున్నాయి. ముఖ్యంగా దేశ, విదేశీ మార్కెట్లలో పడిపోతున్న పుత్తడి డిమాండ్‌ను.. చైనా నిర్ణయం మరింత దిగజార్చుతున్నది. ఇన్నాళ్లూ గోల్డ్ సేల్స్‌పై అక్కడి రిటైలర్లకు ఇచ్చిన విలువ ఆధారిత పన్ను (వ్యాట్) మినహాయింపును ఎత్తేశారు. ఈ నెల (నవంబర్) 1 నుంచి షాంఘై గోల్డ్ ఎక్స్ఛేంజ్ నుంచి కొనే పసిడికి వ్యాట్ వర్తిస్తుందని చైనా ఆర్థిక మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. బంగారం ఏ రూపంలో ఉన్నా పన్ను చెల్లించాల్సిందేనని చెప్పింది. నగలు, నాణేలు, కడ్డీలు, పారిశ్రామిక అవసరాలన్నింటికీ విక్రయించే గోల్డ్ ధరలు ఇప్పుడు ఒక్కసారిగా పెరిగిపోయాయి.ఇదీ సంగతి.బంగారం కొనుగోళ్లలో ప్రపంచంలోనే చైనా మొదటి స్థానంలో ఉన్నది. అక్కడి మార్కెట్‌లో గోల్డ్‌కు డిమాండ్ విపరీతంగా ఉంటుంది మరి. ఇందుకు ఆ దేశ ప్రభుత్వం పసిడి అమ్మకాలపై ఇచ్చిన పన్ను మినహాయింపు కూడా కారణమే. అయితే ఇప్పుడా ప్రోత్సాహకానికి బ్రేక్ పడింది. దీంతో మార్కెట్‌లో పెరిగిన ధరలు.. సహజంగానే విక్రయాలపై ప్రభావం చూపనున్నాయి. ఇప్పటికే అది కనిపిస్తున్నది కూడా. ఈ క్రమంలో చైనాకు పసిడి దిగుమతులు తగ్గిపోవచ్చని అంటున్నారు. దీనివల్ల అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ తగ్గి ధరలు ఇంకా పతనమయ్యే అవకాశాలే ఎక్కువ. దీంతో చైనా తర్వాత అత్యధికంగా పసిడిని కొంటున్న భారత్‌కు ఇది కలిసిరానున్నదని ఎక్స్‌పర్ట్స్ మాట. ఇకపై భారత్‌కు వచ్చే బంగారం దిగుమతులు మరింత చౌక అవుతాయని, ఫలితంగా మార్కెట్‌లో ధరలూ దిగొస్తాయని వారు ప్రస్తుత ట్రేడింగ్ సరళిని విశ్లేషిస్తున్నారు. అంతేగాక డాలర్‌తో పోల్చితే రూపాయి విలువ బలపడితే.. దిగుమతులకు చెల్లింపులు మరింత సులభతరం అవుతుందని అంటున్నారు.10 గ్రాములు.. 10 వేలు డౌన్అక్టోబర్ 17న భారతీయ మార్కెట్‌లో 24 క్యారెట్ 10 గ్రాముల ధర ఏకంగా రూ.1,34, 800 పలికింది. ఇప్పుడది రూ.1,24,100 వద్దకు దిగింది. ఇంచుమించుగా గడిచిన 20 రోజుల్లో రూ.10,700 తగ్గుముఖం పట్టింది. ఈ నేపథ్యంలో మారిన చైనా ట్యాక్స్ రూల్స్.. ఇంకా భారతీయ మార్కెట్‌లో రేట్లను దించుతాయన్న అంచనాలు నెలకొన్నాయి. ఇది రిటైల్ సేల్స్‌ను ప్రభావితం చేస్తున్నదని నగల వ్యాపారులూ చెప్తున్నారు. ఈ రివర్స్ ట్రెండ్ ఇలాగే కొనసాగితే ఈ ఏడాది చివరికల్లా మళ్లీ మేలిమి బంగారం ధర తులం లక్ష రూపాయలకు రావచ్చని అంటున్నారంతా.ఒక్కరోజే రూ.1,200 తగ్గుముఖందేశీయ మార్కెట్‌లో బంగారం ధరలు రోజుకింత పడిపోతూనే ఉన్నాయి. మంగళవారం 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) తులం ధర రూ.1,200 తగ్గింది. దీంతో ఢిల్లీ స్పాట్ మార్కెట్‌లో రూ.1,24,100గా నమోదైంది. కిలో వెండి ధర కూడా రూ.2,500 క్షీణించి రూ.1,51,500 వద్ద స్థిరపడింది. గత నెల అక్టోబర్ 14న ఇది ఆల్‌టైమ్ హైని తాకుతూ రూ.1,85,000 పలికిన విషయం తెలిసిందే. దీంతో 20 రోజుల్లో రేటు రూ.33,500 దిగజారినైట్టెంది. ఇదిలావుంటే హైదరాబాద్‌లో 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.710 తగ్గి రూ.1,22,460గా ఉన్నది.22 క్యారెట్ (99.5 స్వచ్ఛత) పుత్తడి విలువ రూ.650 దిగి రూ.1,12,250కి తగ్గింది. అంతర్జాతీయంగా.. ఔన్స్ గోల్డ్ విలువ 7.84 డాలర్లు పడిపోయి 3,993.65 డాలర్లకు చేరింది. వెండి రేటూ దాదాపు 1 శాతం తగ్గి 47.73 డాలర్లుగా ఉన్నది. డాలర్ ఇండెక్స్ 0.12 శాతం పుంజుకొని 99.99కి చేరడం, వచ్చే ద్రవ్య సమీక్షలో కీలక వడ్డీరేట్ల తగ్గింపు ఉండబోదని అమెరికా రిజర్వ్ బ్యాంక్ సంకేతాలు ఇవ్వడం.. గోల్డ్ మార్కెట్‌ను షేక్ చేశాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టేవారికి బిగ్ అలర్ట్




గత కొన్ని నెలలుగా ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు బుల్లిష్ పథంలో ఉన్నాయి. కంపెనీల పెరుగుదల, రేటు కోతల అంచనాలు, బలమైన కార్పొరేట్ ఆదాయాలు మార్కెట్‌ను కొత్త ఎత్తులకు పంపించాయి. అమెరికా, జపాన్, కొరియా, చైనాలలో సూచీలు రికార్డు స్థాయిలో ఉన్నాయి. రెండు బ్యాంకులు (గోల్డ్‌మన్ సాచ్స్, మోర్గాన్ స్టాన్లీ) రాబోయే సంవత్సరాల్లో ఆసియా, ముఖ్యంగా భారతదేశం, చైనా, జపాన్, హాంకాంగ్ ప్రపంచ వృద్ధికి కేంద్రంగా మారుతాయని విశ్వసిస్తున్నాయి. భారతదేశంలో మౌలిక సదుపాయాల సౌకర్యాలు, తయారీ వేగం, అలాగే జపాన్‌లో కార్పొరేట్ సంస్కరణలు రెండూ దీర్ఘకాలంలో మార్కెట్‌కు శుభవార్త.స్టాక్ మార్కెట్‌లో ర్యాలీ తర్వాత స్వల్ప క్షీణత సాధారణమేనని గోల్డ్‌మన్ సాచ్స్, మోర్గాన్ స్టాన్లీ చెబుతున్నారు. గోల్డ్‌మన్ సాచ్స్ సీఈఓ డేవిడ్ సోలమన్ ప్రకారం రాబోయే 12 నుండి 24 నెలల్లో మార్కెట్ 10 నుండి 20 శాతం వరకు పడిపోవచ్చు. అయితే ఈ క్షీణత దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్‌లో భాగంగా ఉంటుంది. చిన్న చిన్న షాక్‌లకు భయపడే బదులు పెట్టుబడిదారులు పెట్టుబడి పెట్టడం కొనసాగించి, వారి పోర్ట్‌ఫోలియోలను తిరిగి సమతుల్యం చేసుకోవాలని ఆయన అన్నారు. సరళంగా చెప్పాలంటే మీ పెట్టుబడులను సమీక్షించండి, ఈ క్షీణతతో తొందరపడకండి. మోర్గాన్ స్టాన్లీలెడ్ పిక్ ప్రకారం మార్కెట్‌లో 10-15 శాతం క్షీణత చెడ్డ విషయం కాదు. కొన్నిసార్లు మార్కెట్ స్లో అవుతుంది, మళ్లీ పుంజుకుంటుంది. ఫెడరల్ రిజర్వ్ చైర్మన్ జెరోమ్ పావెల్, బ్రిటిష్ బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ గవర్నర్ ఆండ్రూ బెయిలీ కూడా మార్కెట్ విలువలు చాలా ఎక్కువగా ఉన్నాయని హెచ్చరించారు. కాబట్టి మార్కెట్ క్షీణించినట్లయితే దానిని క్రాష్ కాకుండా దిద్దుబాటుగా పరిగణించండి. బలమైన పోర్ట్‌ఫోలియోలు ఉన్నవారు ఈ సమయంలో భయపడాల్సిన అవసరం లేదని సోలమన్, పిక్ ఇద్దరూ అంటున్నారు. మీరు దీర్ఘకాలికంగా మంచి నాణ్యత గల స్టాక్‌లలో పెట్టుబడి పెట్టి ఉంటే, చింతించకండి. చిన్న పెట్టుబడిదారులు మాంద్యం సమయంలో వారి లేదా కొనుగోళ్లను క్రమంగా పెంచుకోవచ్చు.

# ఇన్సూరెన్స్ ఉన్నా కూడా ఆస్పత్రిలో బిల్లు కట్టమంటున్నారా




కొన్ని సార్లు మనకు హెల్త్ ఇన్సూరెన్స్ ఉన్నా కూడా ఆస్పత్రిలో ఎక్స్‌ట్రా బిల్లు కట్టమంటారు. ఎందుకంటే.. సాధారణ హెల్త్ ఇన్సూరెన్స్ ప్రతి అనారోగ్యాన్ని కవర్ చేయదు. క్యాన్సర్, గుండెపోటు లేదా మూత్రపిండాల వైఫల్యం వంటి తీవ్రమైన అనారోగ్యాలకు ఈ పాలసీ ప్రత్యేకంగా ప్రభావవంతంగా ఉండదు. కాబట్టి మీ ప్రస్తుత పాలసీకి క్రిటికల్ ఇల్నెస్ కవరేజీని యాడ్ చేసుకుంటే మంచిది. చిన్న అదనపు ప్రీమియం చెల్లించడం ద్వారా లక్షల్లో ఉండే వైద్య ఖర్చులను నుంచి తప్పించుకోవచ్చు. తీవ్రమైన అనారోగ్యాలలో ఆసుపత్రిలో చేరడం, ఇంటి ఖర్చులు, మందులు, ఆదాయ నష్టం కూడా ఉండవచ్చు. తీవ్రమైన అనారోగ్య కవర్ మీ వైద్య ఖర్చులు, ఇతర అవసరాలను కవర్ చేయడానికి ఏక మొత్తాన్ని అందిస్తుంది. ఇది భీమా మాత్రమే కాదు, కష్ట సమయాల్లో ఆర్థికంగా ప్రాణాధారం.అయితే చాలా మంది ఫారమ్‌లను పూరించడానికి ఏజెంట్లపై ఆధారపడతారు. ఆ తరువాత చింతిస్తారు. ఎందుకంటే బీమాను కొనుగోలు చేసే ముందు, కవరేజీని, వెయిటింగ్ పీరియడ్‌తో సహా, ఫ్యామిలీ ఫ్లోటర్ ప్లాన్లో చేర్చారో లేదో చెక్ చేసుకోరు. ఈ చిన్న చిన్న తప్పులతో తర్వాత చాలా ఇబ్బంది పడతారు. అలాగే ఆరోగ్య బీమా సెక్షన్ 80%ఐ% కింద పన్ను ప్రయోజనాలను అందిస్తుంది, కానీ మీరు రైడర్‌ను యాడ్ చేస్తే, దాన్ని కూడా సద్వినియోగం చేసుకోండి. ఇది ప్రీమియం భారాన్ని తగ్గిస్తుంది, పొదుపును పెంచుతుంది. మీ పాలసీని తెలివిగా నవీకరించడం అంటే భద్రత, పొదుపు రెండూ రెట్టింపు ప్రయోజనాలను కలిగి ఉంటాయి.మీరు 40 ఏళ్లు పైబడిన వారైతే లేదా అధిక-రిస్క్ ఉద్యోగం చేస్తుంటే, క్రిటికల్ ఇల్నెస్ కవరేజ్ తప్పనిసరి పెట్టుబడి. ఈ వయస్సులో, అనారోగ్య ప్రమాదం పెరుగుతుంది, చికిత్స మరింత ఖరీదైనదిగా మారుతుంది. మీ మొత్తం పొదుపును ఆసుపత్రి బిల్లుగా మారకుండా మీ పాలసీని సకాలంలో అప్డేట్ చేసుకోండి.

# మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్



భారత ఆర్థిక వ్యవస్థ బలం గురించి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కీలక ప్రకటన చేశారు. భారత్ నేడు ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో ఒకటి అని, త్వరలో ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక శక్తిగా అవతరిస్తుందని ఆమె అన్నారు. ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లోని విద్యార్థులతో మాట్లాడుతూ భారత్ నేడు తన ఆర్థిక బలం మీద తన సొంత కాళ్ళపై దృఢంగా నిలబడిందని కేంద్ర మంత్రి తెలిపారు. 2014లో 10వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ నుండి ఐదవ స్థానానికి, ఇప్పుడు నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థకు మనం ఎదిగాం అనేది మమ్మల్ని ప్రత్యేకంగా నిలబెట్టింది. భారత్ బహుశా త్వరలో మూడవ స్థానానికి చేరుకుంటుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.మెరుగుపడ్డ జీవన ప్రమాణాలుఈ పురోగతి గణాంకాలకే పరిమితం కాదని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ ప్రయత్నాలు ఇప్పటివరకు 25 మిలియన్ల మందిని బహుమితీయ పేదరికం నుండి విజయవంతంగా బయటకు తీసుకువచ్చాయి.


# గర్ల్‌ఫ్రెండ్ మూవీ సంతృప్తిని ఇచ్చే సినిమా

## నిర్మాత అల్లు అరవింద్ కామెంట్స్



రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో, రష్మిక మందన్నా ప్రధాన పాత్రలో రూపొందిన 'ది గర్ల్‌ఫ్రెండ్' ఈనెల 7న విడుదల కానుంది. అల్లు అరవింద్ గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై వస్తున్న ఈ చిత్రం ట్రైలర్ నుంచి మంచి హైప్ క్రియేట్ చేయడంతో సినిమాపై ప్రేక్షకులలో భారీ అంచనాలు ఉన్నాయి. సినిమా విడుదలకు మరో రెండు రోజుల సమయం మాత్రమే ఉన్న నేపథ్యంలో తాజాగా బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా.. అల్లు అరవింద్ మాట్లాడుతూ.. పలు ఆసక్తికర అంశాలు పంచుకున్నారు. నేను చాలా సినిమాలు తీశాను, డబ్బులు సంపాదించాను. కానీ 'ది గర్ల్‌ఫ్రెండ్' మాత్రం తృప్తికోసం తీశాను అంటూ వ్యాఖ్యానించారు. 2021లో ఈ కథ విన్నప్పటి నుంచి సినిమా తీయాలని ఎదురుచూశాను. సమాజానికి బోల్డ్‌గా కొన్ని విషయాలు చెప్పాలనిపించింది. అందుకే ఈ సినిమా చేశాము. ఇది చాలా సున్నితమైన సబ్జెక్ట్. ప్రతి యువకుడు, యువతి తప్పకుండా చూడాల్సిన సినిమా ఇదని అన్నారు. ఇందులో ఎన్ని పాటలు ఉన్నాయి, ఎన్ని ÷టింగ్‌లు ఉన్నాయి, ఏం పంచ్‌లు ఉన్నాయనేది ఈ సినిమాకు వర్తించదని, 'మన ఇంట్లో ఆడవాళ్ల మనస్సుల్లో ఏమి కోరికలు, భావోద్వేగాలు ఉంటాయో ఈ సినిమా చూపిస్తుంది. కథ అతి సున్నితంగా మొదలై, అతి ఘాటుగా ముగుస్తుంది. చూసిన వారు ఈ సినిమాను మర్చిపోలేరు? ఈ కథ వెంటాడుతుంది. 'ది గర్ల్‌ఫ్రెండ్' కి తక్కువ రేటింగ్ ఇవ్వలేరు అంత సంతృప్తికరంగా ఉంటుంది సినిమా అని స్పష్టం చేశారు. ప్రస్తుతం అల్లు అరవింద్ కూడా ముందుకు వచ్చి చెప్పిన ఈ మాటలు ఇప్పుడు సినిమాపై మరింత బజ్ తీసుకొచ్చేలా ఉన్నాయి. ఇదిలా ఉంటే.. ఓ విలేఖరి ఇటీవల బండ్ల గణెళిష్ చేసిన కామెంట్స్ గురించి మాట్లాడాలి అని అడగగా.. నేను ఆయన గురించి మాట్లాడను నాకంటూ ఓ స్థాయి ఉంది అంటూ కౌంటర్ ఇచ్చారు.

# పెద్దిలో చికిరి చికిరి స్టెప్పులు



రామ్ చరణ్ బుచ్చిబాబు సానా కాంబోలో వస్తున్న పెద్ది సినిమాపై ప్రపంచ వ్యాప్తంగా భారీ అంచనాలు ఉన్న విషయం తెలిసిందే. జాన్వీ కథానాయిక కాగా ఆస్కార్ విన్నర్ రెహామాన్ సంగీతం అందిస్తున్నాడు. అయితే.. ఈ సినిమా నుంచి అప్డేట్ ఎప్పుడు వస్తుందా అని మెగా అభిమానులు వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే వచ్చిన ఫస్ట్ షాట్ వీడియో ప్రపంచ వ్యాప్తంగా తెగ వైరల్ అయింది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శర వేగంగా జరుగుతుండగా ఇటీవలే శ్రీలంకలో ఓ పాట సైతం చిత్రీకరణ పూర్తి చేసుకుని టీం తిరిగి వచ్చింది. వచ్చే మార్చిలో ఈ మూవీ ప్రేక్షకులకు ఎదుటకు రానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ఈ చిత్రం నుంచి ఓక్కొక్కటిగా అప్డేట్ ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. తాజాగా ఈ సినిమా నుంచి పాట రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించిన డైరెక్టర్ బుచ్చి బాబు సానా పాటకు సంబంధించి బుధవారం చిన్న గ్లిమ్స్ రిలీజ్ చేసి నవంబర్ 7, శుక్రవారం రోజున పూర్తి పాటను విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఇందుకోసం బుచ్చిబాబు ఏకంగా ఈ సినిమా సంగీత దర్శకుడు రెహామాన్ నే రంగంలోకి దింపాడు. ఆయనతో తన ఫస్ట్ ఇంటరాక్షన్ గురించి వివరించి చివరకు ఈ సినిమా సాంగ్ సిట్యూవేషన్ చెప్పి ఓ ట్యూన్ అడగడం అయన వెంటనే చికిరి చికిరి అంటూ ఓ ట్యూన్ ఇవ్వడం అంతా చకచకా జరిగిపోయినట్లు చూపించారు. చివర్లో పాట ట్యూన్‌కు తగ్గట్టు రామ్‌చరణ్ వేసిన స్టెప్స్ ను సైతం చూపించి ఒక్క సారిగా పాటపై హైప్ పెంచేశారు. ఈ వీడియో బయటకు వచ్చిన క్షణాల్లోనే రామ్ చరణ్ హుక్ స్టెప్ సోషల్ మీడియాను కమ్మేసింది. రామ్ చరణ్ , మెగా అభిమానులే కాక చాలామంది నెటిజన్లు సైతం ఈ వీడియోకు, ఆ స్టెప్పులకు ఫిదా అవుతున్నారు. రానున్న నెలరోజులు ఈ పాట ఇంటర్నెట్‌ను షేక్ చేస్తుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఎక్కడ చూసినా రామ్ చరణ్ స్టెప్పులే దర్శణమివడం గ్యారంటీ.

## నా మాటలు బాధపెడితే క్షమించండి: బండ్ల గణేశ్



నిర్మాత బండ్ల గణేశ్ తన వ్యాఖ్యలపై క్షమాపణలు తెలిపారు. ఇటీవల 'కె రాంప్' సినిమా సక్సెస్ మీట్‌లో తాను చేసిన ప్రసంగం కొంత వివాదాస్పదం కావడంతో ఆయన స్పందించారు. తన మాటల వల్ల ఎవరైనా బాధపడి ఉంటే క్షమించాలని కోరుతూ ఒక ప్రకటన విడుదల చేశారు.

ఈ విషయంపై బండ్ల గణేశ్ స్పందిస్తూ, "ఇటీవల 'కె రాంప్' సినిమా సక్సెస్ మీట్‌లో నేను మాట్లాడిన మాటలు కొందరిని బాధపెట్టాయని తెలిసింది. నేను ఎవరినీ ఉద్దేశించి మాట్లాడలేదు. నా ఉద్దేశం అందరూ బాగుండాలి, కళామాత ఆశీస్సులతో అందరం పైకి రావాలని మాత్రమే" అని వివరణ ఇచ్చారు. తన మాటల వెనుక ఎలాంటి దురుద్దేశం లేదని స్పష్టం చేశారు. పరిశ్రమలో అందరూ కలిసికట్టుగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ క్రమంలో ఎవరైనా తన వ్యాఖ్యల వల్ల నొచ్చుకుని ఉంటే క్షమించాలని కోరారు. "ఎవరైనా బాధపడి ఉంటే క్షమాపణలు" అని తన ప్రకటనలో పేర్కొన్నారు. బండ్ల గణేశ్ క్షమాపణ చెప్పడంతో ఈ వివాదం ముగిసినట్టేనని పలువురు భావిస్తున్నారు. 'కె రాంప్' కార్యక్రమంలో బండ్ల గణేశ్ మాట్లాడుతూ, "ఒకప్పుడు నా దగ్గర సినిమాల్లో అవకాశాలు అడిగిన వాళ్లు ఇప్పుడు పెద్ద హీరోలయ్యారు" అంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆయన మాట్లాడిన తీరు, సందర్భాన్ని బట్టి ఆ వ్యాఖ్యలు యువ హీరో విజయ్ దేవరకొండను ఉద్దేశించినవేనని పలు మీడియా సంస్థలు కథనాలు ప్రచురించాయి. సోషల్ మీడియాలోనూ దీనిపై పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. దీంతో ఈ విషయం టాలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలోనే ఆయన తాజాగా వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు.

# అనగనగా ఒక రాజులో పాట పాడిన నవీన్




మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి సినిమా తర్వాత జాతి రత్నాలు ఫేం నవీన్ పొలిశెట్టి నటిస్తోన్న చిత్రం అనగనగా ఒక రాజు. ఈ మూవీ నుంచి ఇప్పటికే లాంచ్ చేసిన ప్రీ వెడ్డింగ్ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. ఈ సినిమాను జనవరి 14న సంక్రాంతి కానుకగా విడుదల చేయనున్నారు. మ్యాడ్ ఫేం కళ్యాణ్ శంకర్ ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేయాల్సి ఉండగా.. మారి చేతుల్లోకి వెళ్లింది. ఈ సినిమా కోసం నవీన్ పొలిశెట్టి సింగర్‌గా మారిపోయాడన్న వార్త మూవీ లవర్స్‌లో క్యూరియాసిటీ పెంచేస్తుంది. తాజా సమాచారం ప్రకారం నవీన్ పొలిశెట్టి పాడిన ఈ పాట నవంబర్ మూడో వారంలో లాంచ్ కానుంది. ఇప్పటిదాకా విడుదల చేసిన ప్రమోషనల్ కంటెంట్ కామిక్ టచ్‌తో సాగుతూ సినిమాపై అంచనాలు పెంచేస్తుంది. ఇప్పటికే లాంచ్ చేసిన పోస్టర్‌లో నవీన్ పొలిశెట్టి లుంగీ, బనియన్ వేసుకుని, మెడలో రుమాలు వేసుకొని రాయల్ ఎన్‌ఫీల్డ్ బైకుపై వెళ్తూ క్యూరియాసిటీ పెంచుతున్నాడు.


సితార ఎంటర్‌టైన్ మెంట్స్ నిర్మిస్తున్న ఈ మూవీలో ఈ చిత్రంలో మీనాక్షిచౌదరి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో వస్తోన్న ఈ చిత్రాన్ని ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ కో ప్రొడ్యూస్ చేస్తుంది. ఈ చిత్రానికి మిక్కీ జే మేయర్ మ్యూజిక్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నాడు. రాజుగారి పెళ్లి విందులో చమ్మక్ చంద్ర అరేయ్ ఇది రాజుగారి పెళ్లి.. గెస్టులందరికీ గోల్డ్ ప్లేట్స్ మాత్రమే పెట్టండి.. అంటూ చెప్పే డైలాగ్స్‌తో మొదలైంది ప్రీ వెడ్డింగ్ వీడియో. అతిథుల్లో ఓ వ్యక్తి ఏంటండి వీళ్లు ప్లేటు గోల్డ్.. స్వీటు గోల్డ్ అంటున్నారు.. ఇదేమైనా మలబార్ గోల్డ్ వాళ్ల పెళ్లా అని అడుగుతుంటే.. మరో వ్యక్తి ఏవండి ఇది మా రాజుగారి పెళ్లండి అని అంటున్నాడు. నవీన్ పొలిశెట్టి ముఖేశ్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ వెడ్డింగ్ క్యాసెట్ చూస్తూ.. ముఖేశ్ అంబానీకి ఫోన్ చేసి.. ముఖేశ్ మామయ్యా ఈవెంట్‌కు వచ్చిన సెలబ్రిటీల ఫోన్ నంబర్లు పెట్టు చెబుతా.. ఈ ఇయర్ అంతా అంబానీ పెళ్లి.. వచ్చే ఏడాదంతా రాజుగారి పెళ్లి అంటున్నాడు. జాతి రత్నాలు హీరో స్టైల్ ఆఫ్ హ్యూమర్ టచ్‌తో సాగుతున్న వీడియో సినిమాపై హైప్ క్రియేట్ చేస్తోంది.

# కె ర్యాంప్ పాపకి వర్క్ అవుట్ అయినట్టేనా..?



కిరణ్ అబ్బవరం కె ర్యాంప్ లో హీరోయిన్ గా నటించిన బ్యూటీ యుక్తి తరేజా. చాలామంది ఆమెకు ఇది తొలి తెలుగు సినిమా అనుకున్నారు కానీ యుక్తి ఆల్రెడీ 2023లోనే టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. యువ హీరో నాగ శౌర్యతో రంగబలి సినిమా తీసిన ఈ అమ్మడు ఆ సినిమాలో ఆకట్టుకుంది. ఐతే సినిమా కమర్షియల్ సక్సెస్ అవ్వలేదు కాబట్టి ఆమెను పట్టించుకోలేదు. ఇక కన్నడ మార్కో సినిమాలో హీరోయిన్ గా చేసి సక్సెస్ అందుకుంది అమ్మడు. కె ర్యాంప్ తో కిరణ్ అబ్బవరం తో జత కట్టింది. సినిమాలో అమ్మడి పర్ఫార్మెన్స్, గ్లామర్ అంతా కూడా తెలుగు ఆడియన్స్ కి నచ్చేసింది. కె ర్యాంప్ తో కమర్షియల్ గా సక్సెస్ అందుకుంది యుక్తి తరేజా. సో అమ్మడికి కచ్చితంగా మంచి ఛాన్స్ వచ్చేస్తాయని చెప్పొచ్చు. కె ర్యాంప్ తర్వాత యుక్తి ఆల్రెడీ కింగ్ జాకీ క్వీన్ అనే సినిమాలో నటిస్తుంది. ఈ సినిమాలో దసరా దీక్షిత్ శెట్టి హీరోగా చేస్తున్నాడు. కె ర్యాంప్ తో ఆడియన్స్ లో ఒక ఐడెంటిటీ తెచ్చుకుంది కాబట్టి యుక్తికి ఇక్కడ మంచి స్కోప్ దొరికినట్టే లెక్క. ఐతే 2023 తర్వాత సినిమా ఆఫర్లు రాలేదా తనే స్కిప్ చేసిందా తెలియదు కానీ కె ర్యాంప్ లో ఆమెను చూసి తెలుగు తెరకు మరో టాలెంటెడ్ హీరోయిన్ ఎంట్రీ ఇచ్చిందని అంటున్నారు. సినిమాలు తక్కువ చేస్తున్నా యుక్తి ఫోటో షూట్స్ తో మాత్రం రచ్చ రంబోలా అనిపిస్తుంది. గ్లామర్ షోతో అమ్మడు చేసే ఫోటో షూట్స్ ఐతే సోషల్ మీడియాని షేక్ చేస్తాయి. సినిమాల్లోకి రాకముందు మోడల్ గా చేసిన అనుభవం ఉన్న యుక్తి ఇప్పటికీ కొన్ని యాడ్స్ లో కనిపిస్తుంది. యుక్తి తరేజా ఫోటో షూట్స్.. సోషల్ మీడియాని షేక్.. కె ర్యాంప్ హిట్ తర్వాత యుక్తి తెలుగు కెరీర్ గాడిన పడుతుందా లేదా అన్నది చూడాలి. కె ర్యాంప్ సక్సెస్ తో కిరణ్ అబ్బవరం అయితే సూపర్ హ్యాపీగా ఉన్నాడు. క తర్వాత దిల్ రూబా షాక్ ఇచ్చినా మళ్లీ కె ర్యాంప్ తో హిట్ అందుకున్నాడు కిరణ్. సో సినిమా హిట్ అయ్యింది కాబట్టి యుక్తి గురించి కూడా డిస్కషన్స్ చేస్తున్నారు. తెలుగులో రెండు సినిమాలు చేసిన యుక్తి అందులో మొదటిది ఆకట్టుకోలేకపోయినా రెండో సినిమా సక్సెస్ అయ్యింది.

## బోర్డర్-2 నుంచి వరుణ్ ధావన్ లుక్ విడుదల



వరుస సినిమాలతో సూపర్ హిట్లు అందుకున్న బాలీవుడ్ నటుడు సన్నీడియోల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం బోర్డర్ 2. ఈ సినిమాకు సినిమాకు అనురాగ్‌సింగ్ దర్శకత్వం వహించనుండగా.. భూషణ్‌కుమార్, కృష్ణన్ కుమార్ ?, జేపీదత్తా, నిధిదత్తా కలిసి నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో వరుణ్ ధావన్, దిలిజిత్ దోసాంజే, అహాన్ శెట్టి, సోనమ్ బజ్వా తదితరులు కీలక పాత్రల్లో నటించబోతున్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం వచ్చే ఏడాది జనవరి 22న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అయితే ఈ మూవీ నుంచి చిత్రబృందం తాజాగా వరుణ్ ధావన్ ఫస్ట్ లుక్‌ని విడుదల చేసింది. వరుణ్ ధావన్ ఇందులో హోషియర్ సింగ్ దాహియా అనే పాత్రలో కనిపించబోతుండగా ఈ ఫస్ట్ లుక్‌లో వరుణ్ ధావన్ గన్ పట్టుకుని శత్రువులను కాల్చుతున్నట్లు కనిపిస్తుంది.

## మోహన్ లాల్ తనయుడు ప్రణవ్ లాల్ మూవీ డిఎస్ ఈరే



మలయాళ స్టార్ నటుడు మోహన్‌లాల్ కొడుకు ప్రణవ్ లాల్ చాలా రోజుల తర్వాత నటిస్తున్న తాజా చిత్రం 'డీయస్ ఈరే'. ఈ సినిమాకు బ్రహ్మయుగం దర్శకుడు రాహుల్ సదశివన్ దర్శకత్వం వహించగా మలయాళంలో ఈ చిత్రం అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి విజయాన్ని అందుకుంది. ఇప్పుడు ఇదే చిత్రం తెలుగులో నవంబర్ 07న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా తెలుగు ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. మిస్టరీ థ్రిల్లర్‌గా ఈ చిత్రం రాబోతుంది.

Published by Goli Sammi reddy , Owned by VIJETHA PUBLICATIONS, H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209, Printed at VIJETHA GRAPHICS & OFFSET PRINTERS, H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209 and Published at H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209 Editor: Pittala Ravinder, Associate Editor NAYANI RAJESH, RNI.No.APTEL/1998/02685, email: charcha123@gmail.com